ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
01.04.2026 బుధవారం | సంపుటి : 12 | సంచిక : 252 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం JANAMSAKSHI TV
తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# దేఖ్‌లేంగే..!



## భూతల యుద్ధానికి మేం సిద్ధం : ఇరాన్

### అణుకేంద్రాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు

- మిత్రులై ఉండి నాకు సహకరించరా..?
- పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగమాగం
- హర్మూజ్ వద్ద మీరే వెళ్లి చమురు కొనుక్కోండి అంటూ అసహనం
- 31వ రోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం
- సెకనుకు సుమారు 9.8 లక్షలు ఖర్చు చేస్తున్న అమెరికా


టెహ్రాన్/వాషింగ్టన్ మార్చి 31 (జనంసాక్షి) :
యుద్ధం విరమణ కోసం ఓ వైపు చర్చలు జరుపుదామంటూనే.. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రణాళికలు వేస్తున్నట్టు ఆ దేశ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా బలగాలు భూతల దాడులకు దిగితే.. వారిని మట్టుపెట్టేందుకు ఇరాన్ దళాలు సంసిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చాలన్న ట్రంప్ ప్లాన్ బెడిసికొట్టింది. ఎఫ్-35 సహా కీలక విమానాలు, విమాన వాహక యుద్ధ నౌకలు దెబ్బతిన్నాయి. చమురు మార్కెట్లు నియంత్రణ తప్పాయి. హోర్ముజ్‌ను తెరిచేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించే పరిస్థితి లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితిలో చర్చలకు సిద్ధమని బయటికి చెబుతూనే.. రహస్యంగా భూతల దాడులకు ప్లాన్ చేస్తున్నారు అని ఇరాన్ నాయకత్వం పేర్కొంటోంది.
ఇరాన్‌పై అమెరికా భీకరంగా దాడి చేస్తూ విధ్వంసకర పేలుడు పదార్థాలు, క్షిపణులను ఆ దేశం వినియోగిస్తున్నది. చాలా ఖరీదైన ఆ ఆయుధాల వల్ల.. అమెరికా అనూహ్య రీతిలో యుద్ధం కోసం మిగితా 2లో

### మీ చావు మీరు చావండి : ట్రంప్

పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్‌లో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలతో పాటు ఈ యుద్ధంలో అగ్రరాజ్యం పిలుపును నిరాకరించిన పలు దేశాలనుద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'హర్మూజ్ జలసంధి కారణంగా ఇంధనం కొరత ఎదుర్కొంటున్న దేశాలకు.. ఇరాన్‌పై చేస్తోన్న యుద్ధంలో కలిసిరాని యూకే వంటి దేశాలకు నాదొక సూచన. మొదటిది.. అమెరికా నుండి చమురు కొనాలి. అది మా దగ్గర పుష్కలంగా ఉంది. రెండవది.. కొంత ఆలస్యమైనా ధైర్యం కూడగట్టుకుని ఆ జలసంధికి వెళ్లి.. దానిని స్వాధీనం చేసుకోండి. మీ కోసం మీరే పోరాడటం నేర్చుకోవాలి. మీరు మాకు అండగా రావడం లేదు.. అలాగే మీకు సహాయం చేయడానికి అమెరికా మీతో రాదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. కష్టమైన పని పూర్తయింది.. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని పోస్టులో హెచ్చరించారు.

## నౌకలకు టోల్ వసూలు

- హర్మూజ్‌పై ఇరాన్ పట్టు
- ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్



2

## ప్రజాస్వామ్యబద్ధంగానే మూసీ పునర్జీవన ప్రాజెక్టు

### 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటాం

- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ అవుతుంది
- అధికారులకు 24/7 మూసి సబ్ కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :
మూసి పునర్జీవనం పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని డిప్యూటీ సీఎం, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్‌తో కలిసి మూసి పునర్జీవనం పనుల ప్రగతిపై సవివరంగా అధికారులతో చర్చించారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో musrirdc@gmail.com మెయిల్ ఐడి ద్వారా మూసి పునర్జీవనంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటిని అధికారులతో కూర్చొని విశ్లేషణ చేసి అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసి నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగింది ఆ రోజు నుంచి మూసి ఫేస్ -1, ఫేస్- 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసి పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా మిగితా 2లో

### ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్దఎత్తున నిర్వహించాలి

2

- సంక్షేమ పథకాలు, జూన్ 2 నుంచి కొత్త పథకాల అమలు గురించి వివరించాలి
- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి వీడియో కాన్ఫరెన్స్

## తడిసిన పసుపు పంట

### రైతులకు మంత్రి తుమ్మల భరోసా

- పూర్తిస్థాయి కొనుగోళ్లకు నిర్ణయం
- అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :
పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...ఈ మేరకు పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన మిగితా 2లో



## ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

### తక్షణమే సమస్య పరిష్కరించండి

కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ

హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :
హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైంద న్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవలం 20శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.



## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

- పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
- ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :
తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీ ని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారం భమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాల ను ఇస్తోందని మంత్రి వెల్లడించారు.



12

## ఇద్దరు కొడుకులను చంపి తల్లి ఆత్మహత్య

- కుటుంబ తగాదాలతో కూకట్‌పల్లిలో దారుణం
- భర్త రెండో వివాహం చేసుకోవడంతో మనస్తాపం
- 12, 10 ఏళ్ల కుమారులు కార్తీక్, కౌశిక్ మృతి

11

## శ్రీశైలం నుంచి ఏపి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది

- వేసవిలో తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలి
- జీవో, హైకోర్టు తీర్పు ఉన్నా ఏపీ ఉల్లంఘిస్తోంది
- 69% తెలంగాణకు, 31% ఆంధ్రకు వాటా
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



2

## ట్యాంక్ బండ్ శివకు సీఎం సాయం

- 5లక్షల రూపాయల ఆర్థిక సాయం
- ఉదారత చాటుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని ఆదేశాలు

## ఊపందుకున్న ఎన్నికల ప్రచార జోరు

### కేరళ, అసోం, బెంగాల్‌లో వేడెక్కిన రాజకీయం

- ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు : రాహుల్ గాంధీ
- బెంగాలీలను బిజెపి అవమానం చేస్తోంది : మమత
- అసోంలో మహిళలకు మూడువేల తాయిలం
- 31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల





11

తిరువనంతపురం/ కోల్‌కతా (జనంసాక్షి) :
అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిం చారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారం నాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ మిగితా 2లో

## నలందలో ఘోర తొక్కిసలాట

- 8 మంది మహిళా భక్తులు మృతి
- శీతలా మాత ఆలయం వద్ద దారుణం
- మరో 12 మందికి పైగా గాయాలు
- నిర్వహణ లోపంతోనే జరిగింది : స్థానికులు
- బాధితుల కుటుంబాల్లో విషాదం..పోలీసులు దర్యాప్తు

2


## శాసనసభ తీరుపై పెదవి విరిచిన బీఆర్ఎస్

### అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

- కేరళ ప్రచారం కోసం 30నే అసెంబ్లీ వాయిదా
- కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :
ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృథా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమా వేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, మిగితా 2లో





## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

- లోక్‌సభలో శాశ్వత రాజధానిగా తీర్మానం.. ఆమోదం
- ఇది తెలుగు వారికి ఎంతో గర్వకారణం
- అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా రూపుదిద్దుకుంటుంది : టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు

11

## కర్నాటకలోని తుంగభద్ర డ్యామ్ గేట్ల బిగింపు

### పనులను పరిశీలించిన మంత్రి పయ్యావులు

**బళ్లారి :** కర్నాటకలోని తుంగభద్ర డ్యామ్ గేట్ల బిగింపు పనులను ఏపి మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం పరిశీలించారు. డ్యామ్ సైట్ నుంచి సిఎం చంద్రబాబుకు ఫోన్ చేసి.. కొత్త గేట్లు అమరుస్తున్న పనులను వివరించారు. గేట్ల బిగింపు ప్రక్రియ పూర్తయ్యేందుకు ఇంకా ఎన్ని రోజుల సమయం పడుతుందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఏప్రిల్ నెలాఖరుకు పనులు పూర్తికానున్నట్లు పయ్యావుల చెప్పారు. ఏపి ప్రభుత్వం చొరవతో కర్నాటక కూడా త్వరితగతిన పనులు చేపట్టిందని తెలిపారు. గేట్ల బిగింపు ప్రక్రియ పనులు పూర్తయితే కర్నూలు, అనంతపురం జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుందని సిఎం చంద్రబాబు అన్నారు. సీమ జిల్లాలకు మేలు కలిగేలా నిధులు కేటాయింపుపై ముఖ్యమంత్రికి పయ్యావుల ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజాస్వామ్యబద్ధంగానే మూసీ పునర్జీవన ప్రాజెక్టు



ముందుకు వెళ్లాలి, మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న మూసి సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రంజన్, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి. ఇవి. నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణ రెడ్డి, మన చౌదరి, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు.



# నౌకలకు టోల్ వసూలు

- హర్మూజ్‌పై ఇరాన్ పట్టు
- ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్

చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అ టోల్ వ్యవస్థను అనుసరించి ఇప్పటికే 26 నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించినట్లు తెలిపింది. ఆయా నౌకలు అవసరమైన పత్రాలు సమర్పించి అనుమతి కోడ్‌లు పొందినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి. దీనిని ఖండిస్తూ, హర్మూజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాలపై ఏకపక్ష నియంత్రణను ప్రపంచ దేశాలు అంగీకరించబోవని హెచ్చరించింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యలను వ్యంగ్యంగా విమర్శిస్తూ, అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని పేర్కొన్నారు. ఇదే సమయంలో జీ7 దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా కొనసాగేందుకు తక్షణ చర్యలు అవసరమని సూచించాయి.

# దేఖ్‌లేంగే..!

ఖర్చు చేస్తున్నది. ఇరాన్ వార్ కోసం అమెరికా ఖర్చు చేస్తున్న గణాంకాలను పరిశీలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఇరాన్ వార్ కోసం ప్రతి సెకనుకు అమెరికా సుమారు 9.8 లక్షలు అంటే 10వేల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం యుద్ధం 31వ రోజుకు చేరుకున్నది. అమెరికా పన్నుదారులకు చెందిన సుమారు 2.63 లక్షల కోట్లు ఇప్పటి వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ పరిశోధకులు ఈ విషయాన్ని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభమైన యుద్ధం ప్రస్తుతం భీకర స్థాయికి చేరుకున్నది. ఈ యుద్ధం కోసం ప్రతి రోజు అమెరికా ప్రభుత్వం దాదాపు 8455 కోట్లు(890 మిలియన్ల డాలర్లు) ఖర్చు చేస్తున్నది. పేలుడు పదార్థాలు, ఎయిర్ ఆపరేషన్స్, నేవీ డిప్లాయ్‌మెంట్, మిస్సైల్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్‌తో అన్ని ఖర్చులు లెక్కేస్తున్నారు. ఎస్ఐపీఆర్ఐ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మునిషన్స్, మిస్సైళ్లకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ప్రతి రోజు వాటి కోసం సుమారు 3040 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే మొత్తం ఖర్చులో అది 36 శాతంగా ఉంది. తోమాహాక్ క్రూయిజ్ మిస్సైళ్లు, జేడీఏఎం బాంబులు, ప్రిసిషన్ గైడెడ్ బాంబులు ఉన్నాయి. వైమానిక ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 2327.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోజు వారి ఖర్చులో ఇది 27.5 శాతంగా ఉంది. నౌకాదళ ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 1475 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యుద్ధ నౌకల మోహరింపు, డెస్ట్రాయర్లు, సబ్‌మెరైన్లు ఈ జాబితాలో ఉన్నాయి. మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ థాడ్, పాట్రియాట్, ఏజిష్ బీఎండీ కోసం ప్రతి రోజు సుమారు 902 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది రోజువారీ ఖర్చులో 11 శాతంగా ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్స్ కోసం 427 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐఎస్ఆర్ ఫాట్‌ఫామ్స్, శాటిలైట్ ఇమేజ్‌లు, సైబర్ ఆపరేషన్స్ దీంట్లో ఉన్నాయి. పర్సనల్, లాజిస్టిక్స్ కోసం ప్రతి రోజు 285 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధం ఖర్చు మితిమీరిన నేపథ్యంలో.. ఈ అంశంపై గల్ఫ్ దేశాలతో అమెరికా చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధ ఖర్చుల్లో గల్ఫ్ దేశాల సహాయాన్ని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయి. 1990లో జరిగిన గల్ఫ్ వార్ సమయంలో జపాన్, జర్మనీ దేశాలు అమెరికాకు సాయం చేశాయి. ప్రస్తుతం తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఇరాన్ కూడా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలను అమెరికా సాయం కోరే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## శ్రీశైలం నుంచి ఏపి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది

హైదరాబాద్, మార్చి 31: శ్రీశైలం నుంచి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండించారు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు. దీంతో వేసవి నీటికి కటకట ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, శ్రీశైలం ప్రాజెక్టులో పవర్ జనరేషన్ చేయొద్దని స్పష్టమైన నిబంధన ఉందని, ట్రయల్స్ చేయొద్దని జీవో కూడా ఉందని తెలిపారు. తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని సమైక్య రాష్ట్రంలో ఇచ్చిన జీవో స్పష్టంగా ఉందన్నారు. "తెలంగాణ హైకోర్టులో గతంలో పిల్ ఫైల్ చేశాము. జస్టిస్ పినాకి ఘోష్ ఇచ్చిన తీర్పు కూడా ఉంది. కరెంటు ఉత్పత్తి చేయడానికి వీలు లేదు. పాలమూరు రైతాంగం, ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు.

**వాటర్ అలకేషన్ కోర్టులో పెండింగ్**

వాటర్ అలకేషన్ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందని, 69 శాతం తెలంగాణకు, 31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని మంత్రి జూపల్లి తెలిపారు. ప్రభుత్వం మన రాష్ట్ర హక్కును కాపాడుతుందని, అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలతో ఏపీ-తెలంగాణ మధ్య నీటి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. శ్రీశైలం ప్రాజెక్టు విషయంలో రెండు రాష్ట్రాల మధ్య ఉన్న వివాదం మరింత తీవ్రమవుతోంది.



# ట్యాంక్ బండ్ శివకు సీఎం సాయం

- 5లక్షల రూపాయల ఆర్థిక సాయం
- ఉదారత చాటుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని ఆదేశాలు

**హైదరాబాద్,మార్చి31 (జనంసాక్షి) :** ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్‌కు హోంగార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్‌పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు. ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ కోరారున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల శివ, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్దఎత్తున నిర్వహించాలి

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

# ఊపందుకున్న ఎన్నికల ప్రచార జోరు



చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీ ఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడ టం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటిం చడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

**అసోంలో తాయిలాలే తాయిలాలు..**

**గౌహతి :** త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హామీల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా అన్నారు. అలాగే లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన అన్నారు. యుసిసిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల పరిధిలోకి వచ్చే ప్రాంతాల నుంచి మినహాయిస్తామని, గిరిజన వర్గాల్లో దీని అమలు చేయమని ఆయన అన్నారు. రద రహిత అస్సాంను మార్చేందుకు రాబోయే రెండేళ్లలో 18 వేల కోట్లను ఖర్చు చేస్తాం. లక్షపతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు 25 వేల రూపాయలు అందిస్తాం. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల జాబ్‌లు ఇస్తాం. ఒక జిల్లా, ఒక కళాశాల, ఒక విశ్వవిద్యాలయం, ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. అరుణోదరు పథకం కింద ఇస్తున్న రూ. 1250లను పెంచి మహిళలకు 3,000లు అందించడానికి ప్రయత్నిస్తాం అని హిమంతబిశ్వ శర్మ అన్నారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సర్బానంద సోనోవాల్, ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా హాజరయ్యారు.

**నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి : మమత**

భారతీయ జనతా పార్టీ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారం నాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ ప్రక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.

# నలందలో ఘోర తొక్కిసలాట

- 8 మంది మహిళా భక్తులు మృతి
- శీతలా మాత ఆలయం వద్ద దారుణం
- మరో 12 మందికి పైగా గాయాలు
- నిర్వహణ లోపంతోనే జరిగింది : స్థానికులు
- బాధితుల కుటుంబాల్లో విషాదం..పోలీసులు దర్యాప్తు



పాట్నా, **మార్చి 31 (జనంసాక్షి) :** బీహార్‌లోని నలంద జిల్లాలో ఘోరమైన తొక్కిసలాట జరిగి 8 మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మందికి పైగా గాయపడ్డారు. ఈ దారుణం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని ప్రసిద్ధ శీతలా మాత ఆలయంలో ఈ ప్రమాదం జరిగింది. చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళలు తరలివచ్చారు. అధిక రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగి, పలువురు స్పృహ తప్పిపోయారు. కొందరు మహిళలు నేలపై పడి తొక్కిసలాటకు గురయ్యారు. నిర్వహణ లోపం వల్లే ఈ దారుణం జరిగిందని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, రద్దీని అదుపు చేయడానికి తగిన ఏర్పాట్లు లేకపోవడం వంటి కారణాలు ఈ ప్రమాదానికి దారితీశాయని వారు చెబుతున్నారు. రద్దీగా ఉండటంతో అంబులెన్స్‌లు కూడా సులభంగా చేరుకోలేకపోయాయి. గాయపడిన వారిని స్థానికులు చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్లారు. కొందరు మహిళలు స్పృహ తప్పిపోయిన దృశ్యాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రుల్లో చికిత్స కోసం అడ్మిట్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు. తొక్కిసలాటకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన బీహార్‌లోని ప్రముఖ ఆలయాల్లో భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ లోపాలపై మరోసారి చర్చనీయాంశం చేసింది. భక్తుల రద్దీని అదుపు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ దారుణం బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నట్లు స్థానికులు తెలిపారు.

## శాసనసభ తీరుపై పెదవి విరిచిన బీఆర్ఎస్

ఒకరోజు పేనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిం. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిం. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అని అన్నారు. సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుందన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూ.50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదని అన్నారు. మీకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

## ట్రంప్ నకు షాకిస్తున్న దేశాలు



**నిన్న స్పెయిన్.. నేడు ఇటలీ**

రోమ్ (జనంసాక్షి) : ఇరాన్ పై యుద్ధం కొనసాగిస్తోన్న అమెరికాకు కొన్ని దేశాలు షాక్ ఇస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేయడానికి ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సిసిలీలోని తమ కీలక వైమానిక స్థావరాన్ని అమెరికా విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో యూఎస్ బాంబర్ విమానాలను నిలపడానికి అమెరికా.. ఇటలీ అనుమతి కోరినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఈ కథనాలు వెలువడడం గమనార్హం. ఇటీవల స్పెయిన్ సైతం ఇదే తరహా ప్రకటన చేసింది. ఇరాన్తో జరుగుతోన్న యుద్ధంలో పాలుపంచుకొనే విమానాలను తమ గగనతలంలో అనుమతించబోమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ ప్రకటించారు. ఇరాన్ పై దాడుల్లో జోక్యం చేసుకోవడానికి ఈయూ దేశాలు ఇష్టపడటం లేదు.

## తడిసిన పసుపు పంట

పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

## హర్మూజ్‌పై పన్ను కట్టాల్సిందే

ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక వీడియోలో పేర్కొంది. కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. ఇప్పటికే 26 నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించి, అవసరమైన పత్రాలు సమర్పించి అనుమతి కోడ్‌లు పొందినట్లు ఇరాన్ తెలిపింది.

ఈ నిర్ణయంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హర్మూజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాలపై ఏకపక్ష నియంత్రణను ప్రపంచ దేశాలు అంగీకరించబోవని హెచ్చరించాయి. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యలను వ్యంగ్యంగా విమర్శిస్తూ, అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని పేర్కొన్నారు. జీ7 దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టుతూ, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా కొనసాగేందుకు తక్షణ చర్యలు అవసరమని సూచించాయి. హర్మూజ్ జలసంధి ద్వారా ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం జరుగుతుంది. ఇరాన్ ఈ నిర్ణయం ద్వారా తన ఆర్థిక, వ్యూహాత్మక స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని భావిస్తోంది. అయితే ఈ చర్య అంతర్జాతీయంగా తీవ్ర వివాదాలకు దారితీసే అవకాశం ఉంది.

## ఎల్‌పీజీ గ్యాస్ కొరతను సమస్యను పరిష్కరించండి

రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవలం 20శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశార. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# 2నుంచి గ్రామసభల నిర్వహణ

- కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన
- కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు, వార్డు సభలను కచ్చితంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక అమలు, పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలియజేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధికంగా పాల్గొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సభల సందర్భంగా లబ్దిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఫీల్డ్ స్థాయిలో అమలు, ప్రజల భాగస్వామ్యం, విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని సిఎస్ పునరుద్ఘాటించారు. కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధంగా సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు. అనంతరం ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభలలో అనుసరించాల్సిన కార్యక లాపాల క్రమాన్ని కలెక్టర్లకు వివరించారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఒకే విధంగా, సమర్థవంతంగా జరగేందుకు నిర్మిత అజెండాను ఆయన వివరించారు. కాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ / అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ వార్డు సభల సందర్భంగా 100 శాతం పన్ను వసూళ్లు సాధించిన మున్సిపల్ సిబ్బందిని సత్కరించాలని సూచించారు. ఇది పట్టణ పాలనలో ఉత్తమ పనితీరును గుర్తించి ప్రోత్సహించడానికి చేపట్టిన చర్య అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు ప్రసంగిస్తూ ఏప్రిల్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న హెల్త్ వీక్ గురించి కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణిలో 405 దరఖాస్తులు

- సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది
- మంత్రి పొన్నం ప్రభాకర్, ఇంచార్జి చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 211వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 405 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 160, రెవెన్యూ శాఖకు సంబంధించి 53, ఇందిరమ్మ ఇండ్ల కోసం 114, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం ప్రజావాణిని సందర్శించారు. అన్ని డెస్క్ లను పరిశీలించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రవాసి ప్రజావాణి పని తీరును కూడా పరిశీలించారు. సీఎం ప్రజావాణి అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంచార్జ్ చిన్నారెడ్డితో చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సీఎం ప్రజావాణి కేంద్ర బిందువుగా నిలిచిందని, సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్,ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారిపై లైంగికదాడి దృశ్యాల చిత్రీకరణ

- నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఐదేళ్ల చిన్నారిపై లైంగిక అసభ్య దృశ్యాలను చిత్రీకరించిన ఉదంతంలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ... పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన దృశ్యాలను నిరోధించే 'టిప్‌లైన్' ద్వారా అందిన సమాచారాన్ని బ్యూరోలోని చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లోతుగా విశ్లేషించిందని తెలిపారు. సేకరించిన వీడియో ఆధారాలను సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించగా, ఈ నేరం స్థానికంగానే జరిగిందని, బాధితురాలి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియదని గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. లోతైన దర్యాప్తు అనంతరం గోల్కొండ, కుమ్మరివాడికి చెందిన మహమ్మద్ ఫహాద్ అలియాస్ ఆదిల్ (19) అనే డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశామని, 2026 సంవత్సరంలో బ్యూరో విజయవంతంగా చిన్నారిని రక్షించిన రెండో కేసు అని వివరించారు. బాధితురాలు నిందితుడికి అత్యంత సమీప బంధువు అని, ఆ చిన్నారి అతడిని ఎంతో ఇష్టంగా 'భయ్యా' అని పిలుస్తుండేదని డైరెక్టర్ తెలిపారు. ఆ నమ్మకాన్నే ఆసరాగా చేసుకుని నిందితుడు తరచూ బాధితురాలి ఇంటికి వెళ్లి, ఎవరూ లేని సమయంలో బాలికను ఇంటి పైకప్పు పైకి తీసుకెళ్లి అసభ్య దృశ్యాలను చిత్రీకరించేవాడని విచారణలో తేలిందని ఆమె పేర్కొన్నారు. నిందితుడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాన్ని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపామని, అతనిపై ఐటీ చట్టంలోని సెక్షన్ 67-బి తో పాటు పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద సీసీపీఎస్ లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్పష్టం చేశారు. బాధితురాలికి అవసరమైన సహాయం అందజేయడంతో పాటు, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించామని డైరెక్టర్ వివరించారు. పిల్లలపై జరిగే ఇలాంటి నేరాల్లో దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులు లేదా తెలిసిన వారే నిందితులుగా ఉంటున్నారని, ఇది సమాజంలో నమ్మకాన్ని వంచించడమేనని శిఖా గోయల్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ఎవరి సంరక్షణలో ఉంచుతున్నామనే విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. పిల్లల రక్షణ అనేది మన అందరి సామూహిక బాధ్యత అని, అధునాతన సాంకేతికతతో ఇటువంటి నేరాలను అరికట్టడానికి బ్యూరో నిరంతరం కృషి చేస్తోందని డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు.

# స్టడీ హాల్‌ను ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్, మార్చి31 (జనంసాక్షి) :** మల్కాజ్ గిరి నియోజకవర్గంలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రాధా స్టడీహాల్‌ను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఇతర ముఖ్య నేతలతో కలిసి మంత్రి రిబ్బన్ కట్ చేసి ఈ స్టడీహాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... నగరంలోని రద్దీ ప్రాంతాల్లో విద్యార్థులకు చదువుకోవడానికి ప్రశాంతమైన వాతావరణం అవసరమని, అటువంటి చక్కని వసతులతో ఈ స్టడీహాల్‌ను అందుబాటులోకి తెచ్చిన నిర్వాహకులు రాధా రవి దంపతులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్టడీహాల్‌లోని వసతులను పరిశీలించిన మంత్రి, అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం, బస్ స్టాండ్ సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, విప్లవ వీరులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు మంత్రిలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులపై ప్రత్యేక దృష్టి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా తో పాటు, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం, పేకాటను కట్టడి చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ ఫోర్స్మెంట్ ద్వారా నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాలో ఎర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని,చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా ప్రజల భాగస్వామ్యంతో కాలనీలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారి గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన ఆరైవ్ - ఆలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వినూత్న రీతిలో అవగహన కార్యక్రమాలు చేపట్టాలని, రాబోవు హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలతో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్,కవిత, జనగామ ఏ.ఎస్పీ చేతన్, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డిసిపిలు ప్రభాకర్ , రవి, బాలస్వామి, శ్రీనివాస్ తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గోన్నారు.

# మహానగరం కల్తీమయం!

- రోజుకోచోట కల్తీ వస్తువులు, ఆహార వస్తువులు బహిర్గతం
- తాజాగా వాడేసిన నూనె ప్యాకెట్లలో నింపి అమ్మకం
- ముఠాను గుర్తించి పట్టుకున్న పోలీసులు
- పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ
- దాడిచేసి సీజ్ చేసిన పోలీసులు



**హైదరాబాద్, మార్చి31 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో కల్తీ వంట నూనె దందా తీవ్ర కలకలం రేపుతోంది. హైటెక్ సిటీలో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. నాచారం ప్రాంతంలో శుద్ధి పేరుతో మళ్లీ ప్యాకెట్లలో నింపుతూ దందా చేస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు... కల్తీ నూనె సేకరిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని రెస్టారెంట్ల నుంచి వాడిన నూనెను సేకరించి.. కర్ణాటక రిజిస్ట్రేషన్ ఆటోలో వందల లీటర్లు తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 20 డబ్బాల్లో కల్తీ నూనెను గుర్తించారు. నిందితులు సరైన పత్రాలు చూపించలేక తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు వీధి వ్యాపారులకు కల్తీ వంట నూనెను అమ్ముతున్నట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ , హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు. ఈ సందర్భంగా హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. తనిఖీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ప్లాస్టిక్ డబ్బాల్లో, పరిశుభ్రతకు విరుద్ధంగా పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేస్ట్‌ను హోల్‌సేల్ కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో సుమారు రూ.22 లక్షల విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 4,032 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాసిరకం వెల్లుల్లి, 210 కిలోల నాసిరకం అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుడిని, స్వాధీనం చేసిన సామగ్రిని తదుపరి విచారణ కోసం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

# విద్యుద్ఘాతంతో తల్లి మృతి

## అనాథలైన ముగ్గురు పిల్లలు

**మంచిర్యాల, మార్చి31 (జనంసాక్షి) :** చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామంలో తీరని విషాదం నెలకొంది. సోమవారం దురదృష్టకర విద్యుత్ ప్రమాదం ఒక నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జ్యోతి అనే మహిళ ఉదయం సమయంలో ఉతికిన బట్టలు ఆరవేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురయ్యారు. కరెంట్ షాక్ బలంగా తగలడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కళ్లముందే తల్లి ప్రాణాలు విడవడం చూసి ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే, ఈ ఘటనలో అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే.. ఆ ఇంట్లోని ముగ్గురు పిల్లలు ఇప్పుడు అనాథలుగా మారారు. గతంలోనే తండ్రిని కోల్పోయిన ఆ ముగ్గురు పిల్లలకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, ఇప్పుడు తల్లి కూడా దూరమవడంతో వారి భవిష్యత్తు అంధకారంలో పడింది. అమ్మానాన్న ఇద్దరూ లేని ఆ పిల్లల రోదనలు చూసి గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ప్రమాదంతో కొమ్మెర గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అనాథలైన ఆ ముగ్గురు చిన్నారులను ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని, ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలవాలని గ్రామస్థులు , స్థానిక నేతలు డిమాండ్ చేస్తున్నారు

# తెలంగాణలో ఒక్కసారిగా మారిన వాతావరణం



- పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని సూచన

**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎండలు, వర్షాలతో కూడిన భిన్నమైన వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. హైదరాబాద్ లో వర్షం అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం, బి.ఎన్.రెడ్డి నగర్, మీర్‌పేట్, బాలాపూర్, చంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, సరూర్ నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, ఉప్పల్,నాగోల్ ఏరియాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి 31న ఉదయం నుంచే కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజాంబాద్, కరీంనగర్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పగటిపూట కూడా చీకట్లు అలుముకున్నాయి. రాబోయే 4 రోజుల పాటు రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగనుంది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల వడగళ్ల వాన పడే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండకపోయినా గాలిలో తేమ పెరగనుంది. అయితే ఈ అకాల వర్షాలు అన్నదాతలకు కన్నీరు మిగిలిస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి పంట ఈదురు గాలుల వల్ల నేలపాలయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు చోట్ల మామిడి తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# పిఆర్సీ, డీఏలు విడుదల చేయాలి

- లేకుంటే టెన్త్ స్పాట్ బహిష్కరిస్తాం
- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్

**నల్లగొండ, మార్చి31 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పీఆర్సీ, డీఏలను తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా కులగణన రెమ్యూనరేషన్ ఇవ్వలేదని, కంటి తూడుపుగా గత సంవత్సర ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యూయేషన్ డబ్బులు విడుదల చేస్తున్నారని, అలా కాకుండా పూర్తి స్థాయిలో అందజేయాలని లేని పక్షంలో పదో తరగతి స్పాట్ బహిష్కరిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండతో పాటు పలు ప్రాంతాలోని పాఠశాలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ సన్మానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళవారం రాత్రి వరకు పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కుల గణన చేసిన సర్వే రెమ్యూనరేషన్స్ సహితం ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికి అమలు చేయకపోవడంతో తీవ్ర మనోవేదనలో ఉన్నారన్నారు.

# ప్రేమించి పెళ్లి..కుటుంబ తగాదాలతో ఆత్మహత్య

**సిద్దిపేట, మార్చి31 (జనంసాక్షి) :** ప్రేమించుకుని పెళ్లి చేసుకున్న ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. పెద్దలకు చెప్పకుండా నామమాత్రంగా పెళ్లి చేసుకున్నారు. వేర్వేరు సామాజికవర్గాలు కావడంతో పెద్దలు అంగీకరించలేదు. ప్రియుడి సోదరి వివాహం పేరు చెప్పి వారిని దూరంగా ఉంచారు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. పెద్దలు ఇద్దరినీ కలవనివ్వడం లేదని ప్రియుడు ఆత్మహత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ అతను మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ముస్త్యాలకు చెందిన అనుముల రాకేశ్(30) కారు డ్రైవర్. అదేగ్రామానికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కొంతకాలంగా వీరు ప్రేమించుకున్నారు. రహస్యంగా నామమాత్రపు పెళ్లి చేసుకున్నారు. తీరా విషయం బయటకు పొక్కడంతో రాకేశ్ కుటుంబీకులు ససేమిరా అన్నారు. అతడి సోదరి వివాహం చేసేంత వరకు కొంతకాలం గడువు కావాలని, పెద్దలసమక్షంలో వివాహం జరుపుతామని హామీ ఇవ్వడంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

## అంగన్వాడీ కేంద్రాలకు
# నేటి నుండి హాఫ్‌డే

**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని అంగన్వాడి కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2026 నెలలో అంగన్ వాడీ కేంద్రాలను హాఫ్‌డే పద్ధతిలో నిర్వహించేందుకు అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 30 వరకు అంగన్ వాడీ కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయి. అలాగే, మే 1 నుంచి మే 31 వరకు అంగన్ వాడీ పిల్లలకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. ఇదే కాలంలో అంగన్ వాడీ టీచర్లు హెల్పర్లకు సెలవులు మంజూరు చేశారు. అయితే, సెలవుల సమయంలో అంగన్ వాడీ సిబ్బంది కొన్ని బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటిలో భాగంగా పిల్లలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయాలి. 0-5 సంవత్సరాల పిల్లల్లో అభివృద్ధి లోపాలను ముందుగానే గుర్తించేందుకు ఇంటింటా సర్వేలు నిర్వహించాలి. ప్రీ-స్కూల్‌లో పిల్లల నమోదు, డ్రాప్‌ఔట్ అయిన పిల్లలను మళ్లీ అంగన్వాడి కేంద్రాల్లో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలి. వేసవి సెలవుల్లో అంగన్వాడీ సిబ్బంది తాము నిర్వహించిన కార్యకలాపాలపై సమగ్ర నివేదిక సమర్పించాలి. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు జరిగే 'చైల్డ్ సేఫ్టీ వీక్', మే 25 నుంచి మే 30 వరకు నిర్వహించే 'వుమెన్ థీమ్ వీక్' కార్యక్రమాల్లో అంగన్ వాడీ సిబ్బంది పాల్గొనాలని మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మార్క్సిజం ఆధునిక రాజకీయాల్లో ప్రాసంగికతను కోల్పోయిందా?

పందొమ్మిదవ శతాబ్దపు మధ్యకాలంలో ఐరోపా పారిశ్రామిక విప్లవపు చీకటి కోణాలను చూసి చలించిన కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ ప్రతిపాదించిన సిద్ధాంతం 'మార్క్సిజం'. ఈ "ప్రపంచ కార్మికులారా ఏకం కండి.. పోయేదేమీ లేదు మీ సంకెళ్లు తప్ప" అన్న నినాదం ఒకప్పుడు ఖండఖండాలను కుదిపేసింది. రష్యాలో లెనిన్ నాయకత్వంలో వచ్చిన అక్టోబర్ విప్లవం మొదలుకొని, చైనాలో మావో జెడాంగ్ నేతృత్వంలో సాగిన సుదీర్ఘ పోరాటం వరకు.. మార్క్సిజం ప్రపంచ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది. అయితే, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం (1991) తర్వాత, పెట్టుబడిదారీ దేశాలు 'చరిత్ర ముగిసింది' (End of History) అని ప్రకటించాయి. నేటి కృత్రిమ మేధ (AI), గ్లోబలైజేషన్ మరియు మారుతున్న సామాజిక సమీకరణాల నేపథ్యంలో మార్క్సిజం 'అవుట్ డేటెడ్' (కాలం చెల్లినది) అనే వాదనపై ఇప్పుడు లోతైన విశ్లేషణ అవసరం.

**1. శ్రమ స్వరూపం -- మారిన వర్గ సిద్ధాంతం**

మార్క్స్ కాలంలో సమాజం స్పష్టంగా 'పెట్టుబడిదారులు' (Bourgeoisie) మరియు 'కార్మికులు' (Proletariat) అని రెండు వర్గాలుగా ఉండేది. ఫ్యాక్టరీల్లో చెమటోడ్చే శ్రామికులే విప్లవానికి చోదక శక్తులు. కానీ నేటి 21వ శతాబ్దంలో 'శ్రమ' స్వరూపం పూర్తిగా మారిపోయింది.

జ్ఞాన సమాజం (Knowledge Society): నేడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, మేనేజ్మెంట్ నిపుణులు ఒక కొత్త వర్గంగా అవతరించారు. వీరు శారీరక కష్టం కంటే మేధో సంపత్తిని పెట్టుబడిగా పెడుతున్నారు. వీరు తమను తాము 'శ్రామికులు'గా గుర్తించుకోవడానికి సిద్ధంగా లేరు.

గిగ్ ఎకానమీ (Gig Economy): అమెజాన్, జొమాటో, ఉబెర్ వంటి సంస్థల్లో పనిచేసే డెలివరీ బాయ్స్ లేదా ఫ్రీలాన్సర్లు సాంప్రదాయ కార్మిక సంఘాల పరిధిలోకి రారు. వీరిని ఏకం చేయడం మార్క్సిస్ట్ పార్టీలకు ఒక పెద్ద సవాలుగా మారింది.

టెక్నాలజీ మరియు AI: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల మానవ శ్రమ ప్రాధాన్యత తగ్గుతోంది. యంత్రాలే సంపదను సృష్టిస్తున్న తరుణంలో 'శ్రమ విలువ సిద్ధాంతం' (Labor Theory of Value) పునఃసమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**2. మధ్యతరగతి ఎదుగుదల మరియు కన్స్యూమరిజం**

పెట్టుబడిదారీ విధానం తనను తాను నిరంతరం సంస్కరించుకుంటూ వచ్చింది. మార్క్స్ ఊహించినట్లుగా కార్మికులు మరింత పేదవారిగా మారి విప్లవం వైపు వెళ్లలేదు. బదులుగా, పెట్టుబడిదారీ దేశాలు 'సంక్షేమ రాజ్య' (Welfare State) నమూనాను తీసుకొచ్చాయి. అధిక వేతనాలు, బీమా, పెన్షన్లు, మరియు సులభంగా లభించే అప్పుల (Credits) వల్ల కార్మికులు కూడా 'వినియోగదారులు'గా మారిపోయారు. సొంత ఇల్లు, కారు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఉన్న వ్యక్తి వ్యవస్థను కూల్చడానికి ఇష్టపడడు. ఈ 'మధ్యతరగతి ఆకాంక్షలు' మార్క్సిజం విప్లవ స్ఫూర్తిని నీరుగార్చాయి.

**3. భారతీయ రాజకీయాల్లో కులం - ఒక పెద్ద శక్తి:**

భారతదేశం వంటి దేశాల్లో మార్క్సిజం విఫలమవడానికి ప్రధాన కారణం అది 'కులం' అనే వాస్తవికతను , కులం ప్రాతిపదికన ఉత్పత్తి. సంబంధాలను, అసమానతల వర్ణ కుల వివక్ష వెలివేత అణిచివేతలను, ఆర్థిక సామాజిక దోపిడీని సరిగ్గా అర్థం చేసుకోకపోవడం. విశ్లేషించే పోవడం, రాజకీయాల్లో వాటిని పరిష్కరించే నినాదాలు, కార్యక్రమాలు తీసుకోకపోవడం, సోషలిస్టు రామ్ మనోహర్ లోహియా వలె , బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల నుండి నాయకులను ఎదిగించలేకపోవడం, మెజారిటీ టికట్లు పార్టీ స్థానాల్లో వారిని మెజారిటీ గా తీసుకోకుండా అగ్రకులాల చేతుల్లో పట్టు బిగించడం వల్ల రోజు రోజుకు ప్రజలకు దూరమై పోయారు . లోహియా వీటిని పట్టించుకోవడం వల్ల 1967 నుండే ఉత్తరాన అధికారంలోకి వస్తున్నారు.

భారతదేశంలో దోపిడీ కేవలం ఆర్థికపరమైనదే కాదు, సామాజికమైనది కూడా. మార్క్సిస్టులు 'వర్గం' (Class) గురించి మాట్లాడితే, భారతీయ సమాజం 'కులం' (Caste) ప్రాతిపదికన విడిపోయింది. అణగారిన వర్గాల ఓట్లు అంబేద్కరిస్ట్‌లు లేదా లోహియా సోషలిస్టు లు, ద్రవిడ పార్టీలు. , ప్రాంతీయ పార్టీల వైపు మళ్లాయి తప్ప, కమ్యూనిస్ట్ పార్టీల వైపు కాదు. కేరళలో తప్ప మిగిలిన చోట్ల మార్క్సిజం తన ఉనికిని కోల్పోవడానికి ఈ సామాజిక అవగాహన లోపమే కారణం.

**4. ప్రాంతీయవాదం మరియు జాతీయవాదం**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'గ్లోబల్ సోషలిజం' కంటే 'నేషనలిజం' (జాతీయవాదం) బలంగా ఉంది. మార్క్సిజం "కార్మికులకు దేశం లేదు" అని చెబుతుంది. కానీ నేటి రాజకీయాలు మతం, భాష, మరియు ప్రాంతీయ అస్తిత్వాల



చుట్టూ తిరుగుతున్నాయి. రష్యా విప్లవం నాటికే కార్మికులకు దేశం, జాతీయత, ప్రాంతీయత భావాలు స్పష్టంగా ఉంటాయని తేలి పోయింది. దానికి తోడు ఇండియా లో జాల సమస్య లాగా కుల సమస్య లాగా కొనసాగుతున్నది. హిందూత్వ రాజకీయాలు లేదా ప్రాంతీయ పార్టీల సెంటిమెంట్ల ముందు మార్క్సిస్ట్ అంతర్జాతీయ భావజాలం సామాన్య ఓటర్లను ఆకట్టుకోలేకపోతోంది.

**5. ప్రజాస్వామ్యం మరియు ఎన్నికల రాజకీయం**

మార్క్సిజం మూలాల్లో 'శ్రామిక వర్గ నియంతృత్వం' ఉంది. కానీ ఆధునిక ప్రపంచం 'లిబరల్ డెమోక్రసీ' (ఉదారవాద ప్రజాస్వామ్యం) వైపు మొగ్గు చూపింది. ఏక పార్టీ వ్యవస్థ ను ప్రజలు అంగీకరించడం లేదు. బహుళ పార్టీ వ్యవస్థలో భారత రాజ్యాంగం లో పొందుపరిచిన ఇండియన్ సోషలిజంపై మొగ్గు చూపుతున్నారు.

ప్రజలు రక్తపాత విప్లవం కంటే ఐదేళ్లకోసారి ఓటు ద్వారా ప్రభుత్వాన్ని మార్చుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 34 ఏళ్ల పాలన తర్వాత కమ్యూనిస్టుల పతనం ఒక విషాదకరమైన పాఠం. సుదీర్ఘకాలం అధికారంలో ఉండటం వల్ల పార్టీలో ఏర్పడిన స్తబ్దత, ప్రజలతో తెగిపోయిన సంబంధాలు ఆ సిద్ధాంతానికి తీరని నష్టం చేశాయి.

**6. ఆచరణాత్మక వైఫల్యాలు - చైనా, రష్యా ఉదాహరణలు**

మార్క్సిజం ఆచరణలో విఫలమైందనడానికి రష్యా పతనం ఒక ఉదాహరణ అయితే, చైనా మార్పు మరొక ఉదాహరణ. చైనా నేడు ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందంటే దానికి కారణం మార్క్సిజం కాదు, అది అనుసరిస్తున్న 'స్టేట్ క్యాపిటలిజం' (ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం).

పేరుకు కమ్యూనిస్ట్ పార్టీ పాలన ఉన్నప్పటికీ, అక్కడ స్వేచ్ఛా విపణి (Free Market), బిలియనీర్ల సంఖ్య పెరుగుతోంది. ఇది సిద్ధాంతపరంగా మార్క్సిజానికి ఒక పెద్ద దెబ్బ. ఆర్థిక దోపిడీ రూపాలు రూపాంతరం చెందాయి. క్రోనీ క్యాపిటలైజేషన్, లాభాలు మాకు నష్టాలు , ప్రజలకు ,ప్రకృతికి , అనేదే విధానం గా మారింది.

**7. అయినా మార్క్సిజం ఇంకా ఎందుకు అవసరం? (ప్రాసంగికత)**

ఇన్ని విమర్శలు ఉన్నప్పటికీ, మార్క్సిజం పూర్తిగా 'అవుట్ డేటెడ్' అని కొట్టిపారేయలేం. ఎందుకంటే పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తున్న సంక్షోభాలకు మార్క్సిస్టు అర్థశాస్త్రం నేటికీ సరైన విశ్లేషణను ఇస్తోంది. అది రాజకీయ సామాజిక సమస్యల విశ్లేషణకు కొంత ఉపయోగపడుతుంది. కానీ రాజకీయ అది పార్టీలకు చాలదు. అది సిద్ధాంతంగా మిగిలిపోయింది. తద్వారా పార్టీలు కుదింపుకు లోనయ్యాయి.

**ఆర్థిక అసమానతలు:** ఆక్స్‌ఫామ్ నివేదికల ప్రకారం, ప్రపంచ సంపదలో 50% కంటే ఎక్కువ కేవలం 1% మంది చేతుల్లోనే ఉంది. ఈ సంపద కేంద్రీకరణను మార్క్స్ 150 ఏళ్ల క్రితమే హెచ్చరించారు.

**పర్యావరణ సంక్షోభం :** లాభాపేక్ష కోసం ప్రకృతిని ధ్వంసం చేసే పెట్టుబడిదారీ పద్ధతే నేడు వాతావరణ మార్పులకు (Climate Change) కారణం. దీనికి పరిష్కారం 'ప్రత్యామ్నాయ ఆర్థిక నమూనా'లోనే ఉంది.

**సామాజిక భద్రత :** కరోనా వంటి సంక్షోభ సమయాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని చూశాక, ప్రభుత్వ రంగం (గాబఎశ్రీఅఏ ావఙ్శీశీ) యొక్క ప్రాముఖ్యత అందరికీ అర్థమైంది. ఇది మార్క్సిస్ట్ సోషలిజం చెప్పే ప్రాథమిక సూత్రం.

8. మార్క్సిజం 2.0 – భవిష్యత్తు దిశగా మార్క్సిజం మనుగడ సాగించాలంటే అది తన పాత చట్రం నుండి బయటకు రావాలి. అంబేద్కర్ వాదంతో, లోహియా, కాన్సీరాం. ద్రవిడ వాదాలు, ఫెమినిజం లను కలుపుకొని సాగాలి.


**సామాజిక సమానత్వం లేని ఆర్థిక సమానత్వం అసంపూర్ణం.**

**టెక్నాలజీ స్వీకరణ:** డిజిటల్ యుగంలో డేటా దోపిడీని అరికట్టేలా, 'డిజిటల్ శ్రామికుల' హక్కుల కోసం పోరాడాలి. ఆర్థిక పోరాటాల కన్నా రాజకీయ పోరాటాలు ఎంతో ముఖ్యం.

**పర్యావరణ మార్క్సిజం** (Eco-Marxism): పర్యావరణ పరిరక్షణను పార్టీ ప్రధాన అజెండాగా మార్చుకోవాలి. అన్ని కులాల, సామాజిక వర్గాల ఎదుర్కొంటున్నసమస్యలను పట్టించుకోవాలి.

సిద్ధాంతం చావదు.. అది రూపాంతరం చెందుతుంది. ఏ సిద్ధాంతమైనా కాలానికి అనుగుణంగా మారకపోతే అది మ్యూజియంలో ప్రదర్శన వస్తువుగా మిగిలిపోతుంది. మార్క్సిజం ప్రస్తుతం అటువంటి క్లిష్ట పరిస్థితినే ఎదుర్కొంటోంది. రాజకీయ పార్టీలుగా అవి బలహీనపడి ఉండవచ్చు, కానీ ఒక విశ్లేషణా పద్ధతిగా మార్క్సిజం అజేయం. దోపిడీ ఉన్నంత కాలం మార్క్స్ ఆలోచనలకు మరణం ఉండదు. అయితే, 19వ శతాబ్దపు మానిఫెస్టోను నేటి 21వ శతాబ్దపు స్మార్ట్‌ఫోన్ యుగానికి అన్వయించడంలోనే ఆ సిద్ధాంతం భవిష్యత్తు ఆధారపడి ఉంది. రాజకీయాల్లో మార్క్సిజం 'అవుట్ డేటెడ్' కావచ్చు కానీ, సామాజిక న్యాయం మరియు సమానత్వం కోసం జరిగే పోరాటాల్లో అది ఎప్పటికీ ఒక దిక్సూచిగానే ఉంటుంది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో బహుళ పార్టీ వ్యవస్థలో అణగారిన వర్గాల నాయకత్వంలో సోషలిజం వేటి అవసరం.

బిఎస్ రాములు
సామాజిక తత్వవేత్త
ఫోన్: 8331966987




---

## జీతాల కోసమా జీవితాల కోసమా...

# ఆఖరి పోరాటంగా ఆర్టీసీ

అన్నం పెడుతున్న అమ్మలాంటి సంస్థను కాపాడుకోవడం కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. తెలంగాణ ఆర్టీసీ సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా సంస్థను పరులపాలు చేసే పన్నాగాలను ప్రతిఘటించడం, దశాబ్దాలుగా ఆర్టీసీ పై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు జీతాల కోసం కాకుండా జీవితాల కోసం అనే విధంగా చావో రేవో తేల్చుకోవడానికి సమాయత్త మవుతున్నారు. సంస్థను కాపాడుకోవడం, కోసం హక్కుల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన ఆర్టీసీ కార్మికులకు పోరాటాలు కొత్త కాకపోయినా ప్రస్తుత ప్రభుత్వంలో తీసుకుంటున్న సమ్మె పోరాటం సంస్థకు కార్మికులకు ఇదే ఆఖరిదిగా పలువురు భావిస్తున్నారు. గత పాలకుల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్టీసీకి పెను ప్రమాదంగా విధాన నిర్ణయాలు ఉన్నాయని ఆరోపిస్తూ ఆర్టీసీ సంస్థను కాపాడుకోవడానికి తమ ఉద్యోగాలను రక్షించుకోవడానికి ఇదే చిట్ట చివరి పోరాటంగా తీసుకుంటున్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, రెండు పీఆర్సీలు ఇస్తామని, పాత బకాయిలు చెల్లిస్తామని, 2021 పి ఆర్ సి ని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చెల్లిస్తామని, కొత్త బస్సులతో ఆర్టీసీని ఆధునీకరణ చేస్తామని తదితర వాగ్దానాలను చేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టో పుస్తకంలోని 14వ పేజీలో పొందుపరిచిన హామీలు అమలు చేయకపోగా ఆర్టీసీని నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండడాన్ని కార్మికులు జీర్ణించుకోలేకపోవడమే ఈ పోరాటానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న నాయకుడే ఆర్టీసీ విలీనం కోసం కార్మికుల పక్షాన వాగ్దానం చేయడంతో నమ్మిన సంస్థ ఉద్యోగులు మద్దతు పలికారు. నమ్ముకున్న నేతలు చేసిన వాగ్దానాలు అమలు చేయకపోగా ఉద్యోగులను వీధుల పాలు చేసే చర్యలు ఖండిస్తూ సంస్థ రక్షణ కోసం నడుం బిగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగులు వారియర్స్ గా పనిచేసి గెలిపించారని గుర్తు చేశారు. ఆర్టీసీ విలీనం కోసం, డిమాండ్ల సాధనకు కొంత టైం ఇవ్వాలని స్వయంగా సీఎం ప్రకటించారు. ఎప్పటికైనా ముఖ్యమంత్రి హామీలు అమలు జరుగుతాయని కొండంత ఆశతో కళ్ళల్లో వత్తులు వేసుకుని కార్మికులు ఎదురు చూశారు.రెండున్నర సంవత్సరాలైనా హామీల అమలులో ఎలాంటి పురోగతి లేకపోగా ఆర్టీసీని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్నట్లు కార్మికులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలుగా కొన్ని నిర్ణయాలను పరిశీలిస్తే కొంత అవుననే చెప్పక తప్పట్లేదు. బడ్జెట్లో వాటాదనం పెట్టకపోవడం, రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఏ మాత్రం పట్టించుకోకపోవడం, పిఆర్సి అమలు చేయకపోవడం లాంటి హామీల అమలు చేయకపోగా కొత్త బస్సుల పేరుతో సంస్థ ఆస్తులను ఇతరులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేయడం లాంటి ప్రభుత్వ నిర్ణయాలు కార్మికులు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరుతున్నది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మహాలక్ష్మి పథకం ఆరంభించిన 48 గంటల్లోనే ఆర్టీసీ కార్మికులు విజయవంతం చేయడం, ప్రభుత్వ ప్రతిష్ట పెరగడం కళ్ళ ముందు కనిపిస్తున్న నగ్న సత్యం. మరి ఆ పథకానికి ఇస్తామన్న 320 కోట్ల రూపాయలు ఇవ్వకపోవడం, బకాయిలు పేరుకపోవడం, ఆర్టీసీకి రావలసిన మహాలక్ష్మి డబ్బులైన ఇవ్వాలని వేడుకుంటున్న చెల్లించకపోవడం, మహాలక్ష్మి పథకం కింద జీరో టికెట్లు ఇప్పటివరకు ఎన్ని కట్ అయ్యాయి, ఎంత డబ్బు సంస్థకు ఇవ్వాల్సి ఉంది? ఎప్పుడెప్పుడు ఎంత ఇచ్చారు? ఇవ్వాల్సింది ఎంత అనే అంశాలను అడుగుతున్న కూడా పట్టించుకోవడం లేదు.సంస్థకు దాదాపు 2,700 కోట్లు రావలసి ఉన్నట్లు కార్మికులు అంచనా వేస్తున్నారు. దీనిపై కనీసం శ్వేతపత్రం అడుగుతున్న ప్రభుత్వం నుంచి స్పందన లేనట్టుగానే తెలుస్తుంది. గత ప్రభుత్వంలో కూడా ఆరు డిమాండ్లతో సమ్మె చేస్తే ఐదింటిని అమలు చేసిన కెసిఆర్ ప్రభుత్వం ఆర్టీసీ విలీనంపై అసెంబ్లీలో తీర్మానం చేయడమే కాకుండా గవర్నర్ సంతకానికి ఫైల్ వెళ్లిందని అపాయింట్మెంట్ దే సందర్భంగా ఎన్నికల కోడ్ వచ్చి ఆగిపోయిందని చెప్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన గతంలో ఇచ్చిన హామీలలో యూనియన్ల పునరుద్ధరణ ఆర్టీసీ విలీనం లాంటి హామీలు అమలు కాకపోవడం వల్లే ఈనెల 13వ తేదీన సమ్మె నోటీసు జారీ చేశారు. దీనిపై కూడా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఇక కార్మికులు ప్రభుత్వంతో తేల్చుకునే పరిస్థితి ఏర్పడింది. ఆకలి ఆరాటం.. జీవనపోరాటంగా ఆఖరి యుద్ధానికి సిద్ధమవుతున్నారు.

**ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తించడంలో ప్రభుత్వానికి నష్టం ఏమిటి?** : టీజీఎస్ఆర్టీసీకి ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 50 వేల మంది సుశిక్షితులైన ఉద్యోగ కార్మికులు ఉన్నారు. కోట్లాది రూపాయల ఆస్తులు కలిగిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ను ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తించడంలో




నష్టం లేదనేది నిర్వివాదాంశం, దీన్ని అంచనా వేసే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దీనిపై ప్రధాన హామీని ఇచ్చిందన్నది వాస్తవం. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సంఖ్య కొద్ది అయినప్పటికీ ప్రజా జీవితంతో ముడిపడి ఉన్న ఈ సంస్థతో లక్షలాదిమంది ప్రభావితం అవుతున్నారు. హామీల అమలు కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటీస్ ఇవ్వడంపై రాష్ట్రమంతా హామీలు ఆశలు ఆవేదనలు అంశాలపైనే చర్చ సాగుతున్నది.టీజీ ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరగాలని సర్వత్రా కోరుకుంటున్నారు.

**విలీన హామి అమలైతే అధికార పార్టీకి కలిసి వచ్చే అవకాశం**

వేలాదిమంది ఆర్టీసీ కార్మికులు తో పాటు లక్షలాది మంది ప్రజల జీవనాధారమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా మరోసారి కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే అవకాశం గా భావించాల్సి వస్తుంది. దీనివల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న నాయకుడిగా కార్మికుల హృదయాల్లో నిలిచిపోతారు. ఆర్టీసీని విలీనం చేయడం ద్వారా వచ్చే ఎన్నికలకు బలమైన ప్రచార సాధనంగా మారి కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే అవకాశం ఉంది. ఇచ్చిన హామీలలో ప్రస్తుతం మహాలక్ష్మి పథకం అమలుతో అట్టడుగు స్థాయి వరకు ముఖ్యమంత్రి చరిష్మా వెళ్ళిన విషయం కొట్టి పారేయలేనిది. మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని పొందుతుండడంతో ఆర్టీసీ సంస్థకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటికే కలిసొచ్చిందనే చెప్పొచ్చు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయని చెప్పవచ్చు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడం వల్ల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలకు తోడు హామీలు నిలబెట్టుకున్న వారుగా ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసుకునే అవకాశం ఉంది.

**టీజీఎస్ఆర్టీసీ సమ్మె తప్పదా?**

ఇచ్చిన హామీ అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు సమ్మె సైరన్ మోగిస్తున్నారు. ఇదే జరిగితే తెలంగాణ ప్రజా జీవితంపై పెద్ద ప్రభావమే పడనున్నది. పదేళ్ల తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రతికూలత ఎదుర్కోక తప్పని పరిస్థితి. హైదరాబాద్ రోడ్లపై బస్సులు ఆగిపోతే... లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడతారు. ఇది కేవలం ఒక సమ్మె కాదు... ఇది హామీల మీద ఆగ్రహం, ఉద్యోగ భద్రత కోసం పోరాటం. మార్చి 2026లో ఆర్టీసీ కార్మికుల జేఏసీ చాలా సీరియస్‌గా ఉంది. మార్చి 13న ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి, లేబర్ కమిషనర్‌కి సమ్మె నోటీసు ఇచ్చారు.డిమాండ్లు తీర్చకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

**ప్రధాన డిమాండ్లు ఏంటంటే?**

ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలి. వేతన సవరణ చేపట్టాలి. ఉద్యోగ భద్రత ఇవ్వాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కార్మికులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదు. మా కుటుంబాలు బతకాలంటే ఇవి తప్పనిసరి. హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద దీక్షలు, డిపోల వద్ద నిరసనలు... ఇప్పటికే ఉద్యమం మొదలైంది. ఒకవేళ సమ్మె జరిగితే రాష్ట్రవ్యాప్తంగా వేలాది బస్సులు ఆగిపోతాయి. రోజుకు 60 లక్షల మంది ప్రయాణికులు ముఖ్యంగా సాధారణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడతారు. ప్రభుత్వం వైపు నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. చర్చలు జరిగితే సమ్మె వాయిదా పడవచ్చు... లేకపోతే రోడ్లు ఖాళీ అవుతాయి.

**ఎలక్ట్రిక్ బస్సులపై మరో కీలక చర్చ**

కాలుష్యం సాకు చూపి ఆర్టీసీ ఆస్తులను కొల్లగొట్టే ప్రణాళికకు తెరలేపినట్లు టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ బస్సులు, ప్రయివేట్ బస్సులు ఆర్టీసీ డిపోలు, బస్టాండ్లు, పార్కింగ్ స్థలాలు వాడకూడదని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశం కేవలం స్థల వినియోగం గురించి కాదు, ప్రభుత్వ రవాణా రంగ భవిష్యత్తు గురించి పెద్ద చర్చగా మారింది. ఆర్టీసీ కార్మికుల తాజా డిమాండ్ వెనుక ఉన్న ఆవేదనను అర్థం చేసుకోవాల్సి ఉంది. సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంస్థకు చెందిన డిపోలు, బస్టాండ్లు, వర్క్‌షాపులు అన్నీ ప్రజా ధనంతో నిర్మితమైనవి. ఇప్పుడు విద్యుత్ బస్సులు లేదా ప్రయివేట్ ఆపరేటర్లు అదే మౌలిక వసతులను వినియోగిస్తే, ఆర్టీసీకి అన్యాయం జరుగుతోందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటివ్కు ఆశపడి థర్డ్ పార్టీ కొనుగోలు చేసే ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు పై రాష్ట్ర ప్రభుత్వం 36 లక్షల రూపాయల సబ్సిడీని అందజేస్తున్నదని అలాంటిది రాష్ట్రంలో దాదాపు 3500 బస్సులకు ఎన్ని కోట్లు అవుతాయో అంచనాలకు అందని తెలుస్తుంది. వేల కోట్ల రూపాయలు ఇతరులకు ఇస్తున్న ప్రభుత్వం అవే డబ్బులు ఆర్టీసీకి ఇస్తే ఎలక్ట్రిక్ బస్సులను తామే తయారుచేసి నడిపించే సత్తా ఉందని ఉద్ఘాటిస్తున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏపీ 11 జెడ్ 72 82 నంబర్ గల ఎలక్ట్రిక్ బస్సును తయారుచేసి ఉప్పల్ రూట్ లో నడుపుతున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.


**వాదన ప్రకారం** ఆర్టీసీ సంస్థల ఆస్తులతో ప్రయివేట్ బస్సులకు సదుపాయాలు ఇవ్వడం సరైంది కాదు. విద్యుత్ బస్సులు ప్రభుత్వం లేదా ఇతర ఏజెన్సీల ద్వారా నడపబడితే, వాటికి ప్రత్యేక డిపోలు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ స్థలాలు వాడటం అంటే సంస్థను బలహీనపర చడమే. సమ్మెను నివారించి, ఆర్టీసీ బలోపేతంతో పాటు ఆధునిక రవాణా విధానాన్ని అమలు చేయడం ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. సమన్వయం సాధిస్తే స్థిరత్వం; విఫలమైతే అస్థిరత.. ఇదే ప్రస్తుత పరిస్థితి.

జి. మధు గౌడ్
జర్నలిస్ట్
9533551188

---

# పోలింగ్ శాతం పెంచే ఇ-ఓటింగ్ విధానం

*దేశ ఎన్నికల ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఇప్పటివరకు ప్రధానంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌ల వరకే పరిమితమైంది. అయితే ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తరింపచేందుకు, ప్రతి ఓటరికి సులభంగా ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించేందుకు డిజిటల్ మార్గాలు అన్వేషించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ దిశగా బిహార్ రాష్ట్ర ఎన్నికల కమీషన్ చేపట్టిన కృత్రిమ మేధ ఆధారిత ఇ-ఓటింగ్ విధానం దేశవ్యాప్తంగా చర్చగా మారింది.*




ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో ప్రదర్శించిన ఈ విధానం కేవలం సాంకేతిక ప్రదర్శన మాత్రమే కాదు, ప్రజాస్వామ్యాన్ని సరికొత్త దశలోకి తీసుకెళ్లే సంకేతం. ఇప్పటికే కొన్ని మున్సిపల్ ఉపఎన్నికల్లో అమలు చేసిన ఈ వ్యవస్థను రాబోయే శాసనసభ ఎన్నికలకు విస్తరించాలన్న ప్రయత్నం కొనసాగుతోంది. ఇది విజయవంతమైతే, ఇతర రాష్ట్రాలు కూడా ఇదే మార్గాన్ని అనుసరించే అవకాశముంది.

నేటి సమాజంలో వలస జీవనం సాధారణమైంది. లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. విద్యార్థులు తమ నియోజకవర్గాలకు దూరంగా చదువుకుంటున్నారు. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులకు పోలింగ్ బూత్‌కు చేరుకోవడం సవాలే. ఓటు వేయాలన్న చిత్తశుద్ధి ఉన్నప్పటికీ పరిస్థితులు అడ్డంకిగా మారుతున్నాయి. ఇలాంటి వర్గాల కోసం ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ఓటు నమోదు నుంచి ఓటు వేయడం వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ రూపంలో నిర్వహించేలా రూపొందించిన విధానం ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా మార్చే ప్రయత్నం.

ఇ-ఓటింగ్ వ్యవస్థలో భద్రతా ప్రమాణాలు అత్యంత కీలకం. ఆధార్ లింకేజీకి బదులుగా ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డు డేటాబేస్‌ను ఉపయోగించడం ద్వారా ఓటరును ధ్రువీకరిస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్, ప్రత్యక్ష గుర్తింపు, పరికర స్థాయి ధ్రువీకరణ, బ్లాక్‌చెయిన్ ఆధారిత ఎన్‌క్రిప్షన్ వంటి బహుస్థాయి రక్షణ వ్యవస్థలను సమన్వయం చేశారు. ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ అవుతూ బ్లాక్‌చెయిన్‌లో నమోదవుతుంది. దీంతో ఓటును మార్చే అవకాశం లేకుండా చేస్తుంది. స్మార్ట్ కాంట్రాక్ట్ విధానం డిజిటల్ ఈవీఎంలా పనిచేస్తూ లెక్కింపులో సహకరిస్తుంది. డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు, ద్విదశ ధ్రువీకరణ, హ్యాష్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియల అనంతరమే డీక్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఓటు రహస్యాన్ని కాపాడటంతో పాటు పారదర్శకతను కూడా నిర్ధారిస్తుంది.

సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, ప్రజాస్వామ్యంలో విశ్వాసం అత్యంత కీలకం. పాత ఎపిక్ ఫొటోలు, తక్కువ నాణ్యత గల కెమెరాలు, అంతర్జాల సమస్యలు వంటి అంశాలు ఫేషియల్ రికగ్నిషన్‌లో ఆటంకాలు కలిగించవచ్చు. వృద్ధులు, తొలిసారి ఓటు వేసేవారికి యాప్ వినియోగంపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ అవసరం. అయితే ఈ సవాళ్లను ముందుగానే అంచనా వేసి నమూనా ఓటింగ్‌లు, పారదర్శక విధానాల ద్వారా ప్రజల నమ్మకాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం గమనార్హం. ప్రారంభంలో రాజకీయ వర్గాల నుంచి అనుమానాలు రావడం సహజమే. కానీ సాంకేతిక ధృవీకరణ, ఆడిట్ ట్రయిల్స్, వీడియో రికార్డుల ద్వారా పారదర్శకతను నిరూపించగలిగితే విశ్వాసం పెరుగుతుంది.

ఓట్ల లెక్కింపులో కృత్రిమ మేధ ఆధారిత ఓసీఆర్ వ్యవస్థను వినియోగించడం మరో విశేషం. ఈవీఎం డేటాను వెంటనే సంగ్రహించి ధ్రువీకరించే ఈ విధానం మానవ తప్పిదాలను తగ్గిస్తుంది. సమయంతో కూడిన ఆడిట్ లాగ్స్ ద్వారా ఏ దశలోనైనా ధృవీకరణ సాధ్యమవుతుంది. ఫలితాల ప్రకటన వేగవంతమవుతుంది. ఇ-ఓటింగ్ కేవలం సాంకేతిక మార్పు కాదు; ఇది ప్రజాస్వామ్యాన్ని భౌతిక పరిమితుల నుంచి విముక్తి చేసే ప్రయత్నం. ఓటు శాతం తగ్గుతున్న పట్టణ ప్రాంతాల్లో ఇది మార్పు తేవచ్చు. ప్రజాస్వామ్యం అందరికీ అందుబాటులో ఉండాలంటే కాలానుగుణ మార్పులు అవసరం.

డిజిటల్ ఓటింగ్ వ్యవస్థను విస్తరించాలంటే కేవలం సాంకేతిక సన్నాహాలు సరిపోవు; చట్టపరమైన, రాజ్యాంగపరమైన స్పష్టత కూడా అవసరం. ప్రస్తుత ఎన్నికల చట్టాలు భౌతిక పోలింగ్ కేంద్రాల ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. ఇ-ఓటింగ్‌ను అమలు చేయాలంటే ఎన్నికల నిబంధనల్లో మార్పులు, డేటా రక్షణకు ప్రత్యేక మార్గదర్శకాలు, సైబర్ భద్రతా ప్రమాణాలపై స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థ అవసరం. ముఖ్యంగా ఓటు రహస్యాన్ని కాపాడటం, ఓటరుపై ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయగల వాతావరణాన్ని సృష్టించడం కీలకం. ఇంటి నుంచే ఓటు వేయడం సౌకర్యమే అయినా, అక్కడ గోప్యత భంగం కలగకూడదు.

ఇక డిజిటల్ విభేదం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం అందరికీ సమానంగా లభ్యం కాదు. గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యలు ఉన్నచోట ఇ-ఓటింగ్ అందుబాటులోకి రావాలంటే మౌలిక సదుపాయాల పెంపు అవసరం. సైబర్ దాడుల భయం, డేటా దుర్వినియోగం వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన హామీలు ఇవ్వాలి. అందువల్ల ఇ-ఓటింగ్‌ను ఒకేసారి దేశవ్యాప్తంగా అమలు చేయకుండా, దశలవారీగా, పారదర్శక పరిశీలనలతో ముందుకు తీసుకెళ్లడం సముచితం. ప్రజాస్వామ్యంలో ప్రతి మార్పు ప్రజల విశ్వాసాన్ని బలపరచాల్సిందే గానీ, సందేహాలకు తావివ్వకూడదు. వేగం కంటే విశ్వాసం ముఖ్యం. భద్రతా ప్రమాణాలు, పారదర్శకత, ప్రజల అవగాహన – ఈ మూడు స్థంభాలపై ఇ-ఓటింగ్ విజయవంతమవుతుంది. బిహార్ చేసిన ఈ ప్రయోగం దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలుస్తుందా అన్నది సమయం నిర్ణయిస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం – డిజిటల్ యుగంలో ప్రజాస్వామ్యానికి సరికొత్త నిర్వచనం రాస్తున్న దిశగా అడుగులు పడుతున్నాయి.

సిద్ధగోని సుదర్శన్
సెక్రటరీ, తెలంగాణ జరలిస్టల ఫోరమ్
97017 03684



# అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా కృషి

- **టీయూడబ్ల్యూజే (హెచ్ 143) నియోజకవర్గ సర్వ సభ్య సమావేశం**
- **రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉప్పర శేఖర్ సాగర్**

**ఇబ్రహీంపట్నం, మార్చి 31 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైష్ణవి గార్డెన్ లో టీయూడబ్ల్యూజే (హెచ్ 143) ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నియోజకవర్గ అధ్యక్షులు సురమోని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, ప్రధాన కార్యదర్శి గాదం రమేష్ లు హాజరయ్యారు. ముందుగా నూతన నియోజకవర్గ తెంజు అధ్యక్షుడిగా వరికుప్పల అశోక్ ను, టీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీగా మోలుగు శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా అప్పుడున్నటువంటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ అప్పటి 10 జిల్లాలలో రంగారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి టియుడబ్ల్యూజే జర్నలిస్టుల పాత్ర నెంబర్ వన్ స్థానం ఉందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి వాళ్ళ యొక్క పత్రికలకు, వారి యొక్క ఛానల్ లకు రేటింగ్ పెంచుకుంటున్నారని




రాజ్యాంగబద్ధమైనటువంటి హోదాలో బాధ్యత కలిగినటువంటి ఒక నాయకుడు ఒక యూనియన్ నాయకులను చెప్పుకుంటూ తన యూనియన్ నాయకులను పక్కన కూర్చోబెట్టుకుని మీరు స్వప్రయోజనాలకు ఇచ్చేటువంటి ప్రాధాన్యత జర్నలిస్టు నాయకునిగా మీడియాకు చైర్మన్‌గా ఈ ప్రభుత్వంలో కీలకమైనటువంటి ఒక క్యాబినెట్ హోదాలో ఉన్నటువంటి నాయకుడిగా మీరు ఏం చేశారో చెప్పాలని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మొట్టమొదటి ప్రభుత్వం 100 కోట్ల రూపాయల బడ్జెట్ ప్రకటన చేసి 42 కోట్ల రూపాయల నిధులను విడుదల చరిత్ర ఈ యూనియన్ ఇది అన్నారు. 250 జీఓకు వ్యతిరేకంగా డిసెంబర్ 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చి వేలాది మంది జర్నలిస్టులు రోడ్డు మీదకు వచ్చి జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో కలెక్టర్లకు మెమొరండం ఇస్తే తప్పని పరిస్థితుల్లో దిగి వచ్చినటువంటి ప్రభుత్వము ఐ.ఎన్.పి.ఆర్ ఏదైతే అధికారులు సమాచార శాఖ మంత్రి యొక్క ఆదేశానుసారం దిగివచ్చి ఆ జీవోను మళ్లి మార్పులు చేశారో అందరికీ తెలుసు అన్నారు. మెజారిటీ జర్నలిస్టులు ఇబ్రహీంపట్నంలో మన యూనియన్ సభ్యులుగా ఉన్నారు. జర్నలిస్ట్‌లకు ఏ ఆపద వచ్చిన అర్ధరాత్రి రెండు గంటలకు సమాచారం అందించిన అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బిరుదు చందర్, జిల్లా కోశాధికారి పి.వెంకటేష్, జిల్లా సంముక్త కార్యదర్శి పల్లె వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు రాఘవేంద్ర చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు దెంది హరికృష్ణ రెడ్డి, చెరుకూరి మహేందర్, చెరుకూరి రాజు, సీనియర్ జర్నలిస్టులు ఆర్ కే.యాదవ్, పగడాల నరేందర్ రెడ్డి,హనుమంతు సుదర్శన్, సురమోని బాబు, చెరుకూరి మల్లేష్, సంతోష్, సురేష్, వెంకటేష్, రాజు, భూ చక్రం గౌడ్, గోవర్ధన్, మహేష్ చారీ, విజయ్, గిరి, నరేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను అన్యాయం చేయొద్దు



**షాబాద్, మార్చి 31 (జనం సాక్షి) :** బుక్కెడు బువ్వ పెట్టే మా భూములను లాక్కొని వ్యవసాయమే ప్రాణంగా బ్రతికే రైతుల జీవితాలను అన్యాయం చేయొద్దని రేడియల్ రోడ్డు భూ బాధితులు అన్నారు. మంగళవారం మాచనపల్లి, నగర కుంట, బోనగిరి పల్లి గ్రామాలకు చెందిన రైతులు షాబాద్ తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దారును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... రేడియల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా మా పొలాలపై సర్వే నిర్వహిస్తున్న క్రమంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులమని అన్నారు. నేల తల్లిని నమ్ముకొని పిల్లాపాపలతో జీవిస్తున్నామని మా భూములు లాక్కుంటే రోడ్డున పడి మా బ్రతుకులు నాశనమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, సైదులు, సత్తయ్య, శేఖర్, జంగయ్య, రాజ్ కుమార్, శ్రీనివాస్, జంగయ్య, రామయ్య, నర్సింలు, సురేష్, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, అంజయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**
- **చౌదరిగుడలో రూ.29 లక్షలతో సి.సి రోడన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే**



**శంషాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు మంగళవారం శంషాబాద్ మండలం చౌదరిగుడ గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా నిర్మించిన సి.సి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సి.ఆర్.ఆర్ నిధుల కింద రూ.29 లక్షల వ్యయంతో ప్రధాన వీధుల్లో ఈ రోడ్లు నిర్మించబడ్డాయి. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోవడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి లింగం, మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజ్ ముదిరాజ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రేమ వివాహంతో విషాదం

- **ప్రియుడి ఆత్మహత్య**
- **కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో పురుగుల మందు తాగి మృతి**

**చేర్యాల, మార్చి 31 (జనంసాక్షి) :** ఒకే గ్రామంలో ప్రేమ రెండు మనసులను కలిపింది. ఇద్దరు జీవితంపై ఎన్నో కలలు కన్నారు. ప్రేమ విషయం బయటకు తెలిస్తే పెద్దలు అంగీకరించారేమోనని, విడిగా ఉండలేక రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. కొద్ది రోజులు అలా సాఫీగా సాగుతున్న తరుణంలో కులాలు వేరు కావడం, వివాహ విషయం ప్రియుడి తల్లిదండ్రులకు తెలియడంతో అబ్బాయిని వారి ఇంటికి బలవంతంగా తీసుకువచ్చారు. ప్రేమించిన ప్రియుడు ఎక్కడ దూరమవుతాడో అనే బాధలో అమ్మాయి ఆత్మహత్య ప్రయత్నం చేసి కోలుకున్న అనంతరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ప్రియుడి తల్లిదండ్రులను పిలిచి స్థానిక పోలీసులు మాట్లాడగా కొద్ది రోజులు సమయం ఇస్తే పెద్దల సమక్షంలో పెళ్లి చేస్తామని మాట ఇవ్వడంతో అందుకు ఇరువురు ఒప్పుకున్న కొద్ది రోజులలోనే కుటుంబంలో జరిగిన చిన్న గొడవలతో అబ్బాయి పురుగుల మందు తాగడంతో హుటా హుటిగా సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడ నుండి హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం




ప్రియుడు అనుముల రాకేష్ రెడ్డి(25) మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషయంపై స్థానిక ఎస్సై గూడ అపూర్వరెడ్డిని సంప్రదించగా అబ్బాయి అమ్మాయి రహస్యంగా పెళ్లి చేసుకున్న మాట వాస్తవమని, అనంతరం ఇరువురు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామని, జరిగిన విషయంపై దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. యువకుడి మృతితో ముస్త్యాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## విద్యార్థులకు కోచింగ్ సెంటర్లు ఎంతగా దోహదపడుతాయి..



కాప్రా, మార్చి 31 (జనం సాక్షి) : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కోచింగ్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతుందని కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ పేర్కొన్నారు. ఈసీఐఎల్ పరిధిలో గ్రీన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన రాధా స్టడీ హాల్స్ గ్రాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటి స్టడీ హాల్స్ ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రశాంత వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి విజయానికి ఇది దోహదపడుతుందని అన్నారు. అనంతరం మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ, యువతకు విద్యా వనరులు అందుబాటులో ఉండడం చాలా అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, గొల్లూరి అంజయ్య బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంటనే నీటిని విడుదల చేయాలి

- **నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**కొల్చారం, మార్చి 31, (జనం సాక్షి) :** పంటలు పొట్ట దశలో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని రైతుల గోడును అర్థం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుక్కాపూర్ మంజీరా పరివాహ ప్రాంతంలో పంట పొలాలను అలాగే మంజీరా ఎండిపోయిన దృశ్యాలను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. మంజీరా నదిలో చుక్కనీరు లేకపోవడంతో ఎడారి ప్రాంతాన్ని తలపిస్తుంది సింగూరు ప్రాజెక్టు నుండి ఘనాపూర్ ఆయకట్టుకు 0.3 టి యం.సి ల నీటిని విడుదల చేసి సుమారు లక్ష ఎకరాలలో పంటలను కాపాడి ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తుక్కాపూర్ వాగులో మండల పార్టీ నాయకులతో కలిసి మంజీరా నదిని పరిశీలించారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంవత్సరం రైతులకు అవసరనుగుణంగా నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించే అవకాశం కల్పించారన్నారు. ఈ రబీ సీజన్లో ప్రభుత్వం సింగూరు నీటిని విడుదలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో



రైతులు పంటలు సాగు చేశారన్నారు. తీరా నీరు లేక ఇప్పుడు పంటలు ఎండిపోతున్నాయన్నారు. తాను అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించడంతో నీటిని విడుదల కోసం జీవో ఈనెల 23వ తేదీన విడుదలైనప్పటికీ నీటిని విడుదల చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సీజన్లో సింగూరు నుండి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే నీటిని విడుదల చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకోలు చేపడతామని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు.


## జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి



**మక్తల్, మార్చి 31 (జనంసాక్షి) :** జనసేన పార్టీ వాల్ పోస్టర్ ను మక్తల్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పిఓసి తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్రయువజన విభాగం ఆడ్ హాక్ కమిటీ సభ్యులు డాక్టర్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యం లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు ఆలోచనలు ముఖ్యంగ ఆయన యువత రాజకీయలోకి రావాలని ఎలాంటి లాభాపేక్ష లేకుండ ఒక మంచి యువతరాన్ని సమాజం కోసం సేవ చేయాలని ఆయన ఎంతో కష్టపడుతున్నారు. అందులో భాగంగా ఆయన అడుగు జాడల్లో నడవాలని జనసేన పార్టీ బలోపేతం దిశగా గ్లాస్ గుర్తు, పార్టీ సిద్ధాంతాలను ఇక్కడ స్థానికంగా ఉండే జనసేన పార్టీ ప్రతినిధిని కూడా గ్రామ గ్రామాన అందరికీ తెలియజేసే విధంగా రానున్న స్థానిక ఎన్నికలు కావొచ్చు సార్వత్రిక ఎన్నికలు కావొచ్చు జనసేన పార్టీ బలోపేతం అయ్యి జనసేన పార్టీ అభ్యర్థుల గెలుపు దిశగా తీసుకెళ్ళి సమాజానికి సేవ చేయడమే గ్లాస్ గుర్తు ను జనసేన పార్టీ సిద్ధాంతాలను నియోజకవర్గ లోని ప్రతి మండలశీ లో ప్రతి గ్రామం లో తీసుకెళ్లాలని వాల్ పోస్టర్‌ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి హన్మంతు, రామన్ గౌడ్, గౌడి బాల్ రెడ్డి, భీంషేన్, ఉమేష్, గౌడి రవీంద్ర రెడ్డి, కావాలి ప్రవీణ్, విజయ్ కుమార్, టీ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా నిమ్స్‌లో వయోవృద్ధుల ఆరోగ్య శిబిరం

**ఖైరతాబాద్, మార్చి 31 (జనం సాక్షి) :** పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక హెల్త్ మిషన్-100 కార్యక్ర మంలో భాగంగా వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ ను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఉచిత సమ గ్ర ఆరోగ్య పరీక్షల శిబిరం విజయవంతంగా ముగి సింది. ఈ శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప గారు ప్రారంభించారు. ఈ శిబిరాన్ని నిమ్స్ జెరియాట్రిక్ మెడిసిన్ ప్రొ.వై.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభా గం సమన్వయం చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమం నిమ్స్ నెఫ్రాలజీ సెమినార్ హాల్, నిమ్స్ వెల్ నెస్ సెంటర్‌లో నిర్వహించారు. మొత్తం 100 మం ది వయోవృద్ధులు ఈ శిబిరంలో నమోదు చేసుకు న్నారు. వారికి కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీపీ), రాండమ్ బ్లడ్ షుగర్, సీరమ్ క్రియేటినిన్, ఈసీజీ వంటి ముఖ్యమైన వైద్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. అదనంగా అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవలు, ప్రొఫెషనల్ కౌన్సెలింగ్‌ను ఉచితంగా అందించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ వయోవృద్ధుల ఆరో గ్యం పరిరక్షణ సమాజానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ తరహా ఉచిత సమగ్ర ఆరోగ్య శిబిరాలు వృద్ధులలో వ్యాధులను ప్రారంభ దశ లోనే గుర్తించి, సరైన చికిత్స అందించడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా నిమ్స్ ఆసుపత్రి ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆయన వెల్ల డించారు. నిమ్స్ జెరియాట్రిక్ మెడిసిన్ ప్రొ.వై. సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, వయో వృద్ధులలో సాధారణంగా కనిపించే వ్యాధులను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యమని తెలి పారు. ఈ శిబిరం ద్వారా వారికి అవసరమైన ప్రాథ మిక ఆరోగ్య పరీక్షలు, సలహాలు ఒకే వేదికపై అం దించగలిగామని పేర్కొన్నారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో నియమిత పరీక్షలు,



సరైన ఆహారం, జీవన శైలి మార్పులు కీలకమని ఆయన సూచిం చారు. ఇలాంటి శిబిరాలు వారికి ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు, మంచి జీవన ప్రమాణా లను సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు.

## అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**కల్వకుర్తిరూరల్, మార్చి 31 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిమున్సిపాలిటీ పరిధిలోని ఐపిడిఎస్ విద్యుత్ ఉపకేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన 5 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,నాగర్ కర్నూల్ జిల్లా విద్యుత్ ఎస్ఈ వెంకట నరసింహారెడ్డి తో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ,,కల్వకుర్తి పట్టణ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అదనంగా పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశామని తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి

- **ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి**
- **గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాభితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి




వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మంగళ వారం ఒక ప్రకటన తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 ఏప్రిల్ 2026

# ఏప్రిల్ 1-3 వరకు నల్లమల సలేశ్వరం ఉత్సవాలు

- వస్తున్నామ్.. వస్తున్నామ్ లింగమయ్యా అంటూ కొనసాగే యాత్ర
- భారీగా తరలిరానున్న వివిధ రాష్ట్రాల భక్తులు



**అచ్చంపేట, మార్చి 31 (జనం సాక్షి) :** నల్లమల పకృతి అందాలకు నిలయం. పచ్చదనంతో కూడిన అడవి చూపరులను ఇట్టే మంత్రముగ్ధులను చేస్తుంది. దేశంలోనే రెండో అతిపెద్దదైనా అమ్రాబాద్ పులుల అభయారణ్యం కలిగిన ప్రాంతం. అడవిలో అడుగుపెడితే పక్షుల కిలకిలరావాలు.. పెద్ద పులుల ఫీంకారాలు.. కొండలపై నుంచి జాలువారే నీటిచుక్కల సవ్వడితో ప్రతీ ఒక్కరిని సంభ్రమశ్చర్యంలోకి తీసుకెళ్తాయి. ఇంతటి ఆహ్లదకర నల్లమల అభయారణ్యంలో మహాశివుడు కొలువుదీరిన సలేశ్వర క్షేత్రం ఉంది. కేవలం ఏడాదిలో మూడు రోజుల పాటు భక్తులకు దర్శనభాగ్యం కలిగే ఆలయంలో ఆదిమజాతి చెంచులే పూజారులు. పులుల అభయారణ్యం పరిధిలో ఉండటంతో అటవీశాఖ అనుమతితోనే భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. ఎత్తైన కొండలను ఎక్కుతు దిగుతూ.. చెట్లను దాటుకుంటూ వెళ్లి.. అగాధంగా ఉన్న లోయాలో కొలువైన శివలింగానికి పూజలు చేస్తారు. అందుకే ఆలయాన్ని తెలంగాణ అమరనాథ్ గా భక్తులు పిలుస్తారు. తెలుగు తొలి పర్వదినం ఉగాది తర్వాత వచ్చే చైత్ర పౌర్ణమి సందర్భంగా ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 3 వరకు సలేశ్వరం ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ విశిష్టత గురించి ప్రత్యేక కథనం..

### అభయారణ్యంలో సలేశ్వర క్షేత్రం

నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామం పరిధిలోని నల్లమల పరిధిలోని అమ్రాబాద్ పులుల అభయారణ్యం పరిధిలోని కొండల్లో సలేశ్వర మల్లిఖార్జున స్వామి ఆలయం ఉంది. చుట్టూ కొండలు ఉండటం వలన శైలాలు (కొండలు) పేరు మీదుగా శైలేశ్వరంగా పిలిచేవారు. కాలక్రమేణా సలేశ్వరంగా స్థిరపడింది. శివదేవుడు ప్రకృతి ప్రేమికుడు, ధ్యాన సంపన్నుడు కావటంతో ఆయన వెలసిన క్షేత్రాలన్ని దట్టమైన అడవులు, కొండలు,జలపాతాలు,ప్రశాంత వాతావరణం లోనే వెలుస్తారు. సలేశ్వర యాత్ర అతి కఠినమైనది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గ మధ్యలో మన్ననూర్ సమీపంలోని 150 మైలు రాయి వద్ద నుంచి అటవీ మార్గం ద్వారా 15 కిలోమీటర్లు వాహనాలపై ప్రయాణిస్తే సలేశ్వరం వెళ్లే మార్గానికి చేరుకుంటాము. మిగతా 18 కిలో మీటర్లు మట్టిరోడ్డు కావటంతో అక్కడికి చేరుకోవటానికి 4-5 గంటల సమయం పడుతుంది. దట్టమైన అభయారణ్యం కావడంతో ఈ ప్రాంతం అటవీ శాఖ పరిధిలో ఉంటుంది. కేవలం చైత్ర శుద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు మూడు రోజులు స్వామి వారి వార్షిక ఉత్సవాల సమయంలో మాత్రమే భక్తులను ఆలయానికి అనుమతిస్తారు. మిగిలిన రోజుల్లో ఆలయానికి వెళ్లటం అసాధ్యం. ఆలయానికి సమీపంలో గంగా మాత, కాలభైరవుడు, వీరభద్రస్వామి, స్వయంగా వెలసిన పుట్ట సుబ్రమణ్య స్వామి ఆలయాలు ఉన్నాయి. ఆలయ ప్రస్తావన 13 వ శతాబ్దంలోని ప్రముఖ శివ భక్త పండితుడు పాల్కురి సోమనాధుడు రచించిన పండితారాధ్య చరిత్ర, శ్రీ పర్వత క్షేత్రం గ్రంథాలలో ఉంది. 17వ శతాబ్దంలో శ్రీశైలం దర్శించిన చత్రపతి శివాజీ అడవుల వెంబడి ప్రయాణించి సలేశ్వరం చేరుకుని స్వామి వారిని ఆరాధించినట్లు చారిత్రక కథనాలు ఉన్నాయి.

### నిండు పౌర్ణమిలో సాహస యాత్ర

ట్రెక్కింగ్, సాహసాలు చేసే వారికి సలేశ్వర దర్శణ యాత్ర అద్భుత ప్రపంచంలా అనుపిస్తుంది. కొండ అంచులు, జలపాతాలు, దట్టమైన అడవీ, కొండలు దాటుతూ సలేశ్వర మల్లిఖార్జున స్వామిని దర్శించటం గొప్ప అనుభూతి. గతంలో అయిదు రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించేవారు. కానీ కరోనా తర్వాత కేవలం మూడు రోజుల పాటు వేడుకలు పరిమితం చేశారు. ఉగాది పర్వదినం తర్వాత వచ్చే ఛైత్ర పౌర్ణమి సందర్భంగా జాతర నిర్వహిస్తారు. నిండు పౌర్ణమి వెలుగులో సహాస యాత్రలో పాల్గొనే భక్తులు పరవసించిపోతారు. సలేశ్వర యాత్రకు తెలంగాణా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలోని నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని అభయారణ్యంలో ఆలయం ఉంది. భక్తులు అచ్చంపేట, మన్ననూరు మీదుగా పులిబొమ్మ వరకు, అక్కడి నుంచి పుల్లాయిపల్లి పెంట మీదుగా రాంపూర్ పెంట వరకు వాహానాలు వెళ్తాయి. అక్కడి నుంచి కాలినడక ఆలయానికి చేరుకోవాలి.

### ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆలయానికి సమీపంలోని రాంపూర్ చెంచుపెంట వరకు ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అలాగే దాతలు భక్తుల కోసం అన్నధాన, నీటి వసతి సౌకర్యాలు కల్పిస్తారు. ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతర నీటి వసతిని ఏర్పాటు చేస్తారు. వైద్యాధికారులు 24 గంటల ఉచిత వైద్య సేవలు అందిస్తారు. పోలీసులు, అటవీశాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో వేడుకలను నిర్వహిస్తారు. అడవిలో కిందకు దిగడం, ఇతర చెడు పనులను చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రధానంగా సంపూర్ణ ఆరోగ్యవంతులే యాత్రకు వెళ్లాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మొత్తానికి సలేశ్వరం సహాసయాత్ర భక్తులకు మరుపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుందనడంలో అతిశయోక్తి కాదు.

## సలేశ్వరం జాతరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు

- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్




**నాగర్‌కర్నూల్, మార్చి 31 (జనంసాక్షి) :** జిల్లాలో దక్షిణ అమర్నాథ్ యాత్రగా పేరుపొందిన. సలేశ్వరం జాతరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ తెలియజేశారు. భక్తుల సౌకర్యార్థం నీటి సౌకర్యం, ఆహార వితరణ, క్యూ లైన్ దర్శనం, మెడికల్ ఎమర్జెన్సీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ గురించి ట్రాఫిక్ పాయింట్లు ఏర్పాటు వంటి అంశాల గురించి సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచనలు, సలహాలు ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సలేశ్వర దైవ దర్శనానికి వచ్చే భక్తులు పోలీసు వారు సూచనలు, అటవీ శాఖ వారి సూచనలు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ మీ యాత్ర కొనసాగించాలని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కొల్చారం, మార్చి 31 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన ఐదు లక్షల రూపాయలతో నూతన ఇంటి నిర్మాణం చేపట్టుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఉపసర్పంచ్ ఆరే రవీందర్ వార్డు సభ్యులతోకలిసి ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి ద్వారా నిధులు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాల అదనపు గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**గద్వాల టౌన్, మార్చి 31 (జనంసాక్షి) :** మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 27 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కొత్తగా నిర్మించిన తరగతి గదులు మరియు ప్రధాన గేటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పాఠశాలకు 40 సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందని ఇక్కడ చదువుకున్న అనేక మంది విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల్లో ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గద్వాల ప్రాంతంలోనే అన్ని రకాల విద్యా అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. గతంలో విద్యా సౌకర్యాల లోపంతో వెనుకబడిన ప్రాంతంగా ఉన్న గద్వాల,ప్రస్తుతం విద్యా రంగంలో అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. ఇటీవల గద్వాల ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. అలాగే పోలీసులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా స్థానిక విద్యార్థులు విజయాలు సాధిస్తున్నారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి యాదవ్,వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు నాగులు యాదవ్ తదితరులు,జిల్లా విద్యాధికారి,యువ నాయకులు సాయి శ్యాంరెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భావోజీ జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా, కొత్త పల్లి మండలం, తిమ్మారె డ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి 4 వ తేదీ వరకు నిర్వహించబడుతున్న ప్రసిద్ధ భావోజి జాతర సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యం లో భద్రతా ఏర్పాట్లు చేపట్టి నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మంగళ వారం రోజు జాతర నిర్వహ ణను సమగ్రంగా పరిశీలించి న ఎస్పీ, పోలీస్ అధికారుల కు పలు కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమ ని పేర్కొన్నారు. తేరు కార్యక్ర మం ఎటువంటి అవాంఛనీ య సంఘటనలు లేకుండా నలుగు దిక్కుల రోప్ పార్టీలు ఏర్పాటు చేయాలని, ముం దస్తు బందోబస్తు ప్లాన్ ఏర్పా టు చేయడం జరిగిందని తెలిపారు. భక్తుల రాకపో కలు సజావుగా సాగేందుకు ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేయబడినట్లు, వాహానాల పార్కింగ్ కోసం వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వివరిం చారు. జాతరలో భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ,దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి సంఘట నలను అరికట్టేందుకు మఫ్టీలో (సివిల్ డ్రెస్సులో) పోలీసులను మోహరించా మని తెలిపారు. అదనంగా, మహిళలు మరియు పిల్లల భద్రత కోసం ప్రత్యేక బృందా లు ఏర్పాటు చేయడం జరి గిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందిం చేందుకు క్యూఆర్టి టీం ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణంలో ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, భక్తులు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జాతర సమయంలో ప్రజలు పోలీస్ అధికారులతో సహకరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్, ఎస్బి ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రాల తనిఖీ



**సంగారెడ్డి, మార్చి 31 (జనం సాక్షి) :** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర మార్గదర్శకత్వంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మంగళవారం సంగారెడ్డిలోని గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్ మరియు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... భరోసా కేంద్రాన్ని సందర్శించే బాధితులకు తక్షణమే న్యాయపరమైన సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. పోక్సో చట్టం, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి, వారి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చే బాధితుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎవరికైనా న్యాయ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యాలయాన్ని సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం అధికారులు, ఓల్డ్ ఏజ్ హోమ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జంగరాయి లో ఎస్పీ పరామర్శ 48గంటల్లో దోపిడీ కేసు చేదన



**మెదక్, మార్చి 31 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలోని జంగారాయి గ్రామంలో వృద్ధ దంపతులపై జరిగిన దోపిడీ ఘటనను పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు బాధితులు సావిత్రి, అంజయ్యలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని వేగంగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కేసు ఛేదనలో పోలీసుల పనితీరును గ్రామ ప్రజలు ప్రశంసిస్తూ ఎస్పీని శాలువాతో సన్మానించారు. గ్రామ ప్రజల సహకారంతోనే నిందితుడిని త్వరగా పట్టుకోవడం సాధ్యమైందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్లూస్ అందించిన గ్రామస్థులను కూడా సన్మానించారు. ప్రజలు--పోలీసుల సమన్వయంతో నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్పీ అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని సూచిస్తూ, అనుమానితులపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఎస్ఐ నారాయణ, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్‌ను విజయవంతం చేయాలి



**ఉర్కొండ, మార్చి 31 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని మండల క్రీడాకారులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రధానమంత్రి సంసద్ ఖేల్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రీడ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశపు అతిపెద్ద క్రీడా వేదిక ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం అని పాలమూరు పార్లమెంటు పరిధిలో ఏప్రిల్ 9 నుండి 24 వరకు నిర్వహిస్తున్నామని అతిపెద్ద క్రీడా వేదికగా నిర్వహిస్తున్న ఈ యొక్క కార్యక్రమంలో పార్లమెంటు పరిధిలోని అన్ని మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో చివరగా పార్లమెంటు స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించబడుతాయని క్రీడాకారులు మరియు యువత ఈ పోటీలలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, బవండ్ల మధు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అతివల ఉచిత బస్ ప్రయాణంతో అభివృద్ధి దిశగా ఆర్టీసీ

- 290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు
- 10 వేల కోట్లు మహిళలకు అదా..



**మక్తల్, మార్చి 31 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రారంభించిన తొలి పథకం మహాలక్ష్మి పథకమే అని, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేసిన వెంటనే మహిళలకు ఉచిత ప్రయాణ బస్‌ను సీఎం ప్రారంభించారని, 2023 డిసెంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 290 కోట్లకు పైగా మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయడంతో రూ. 10 వేల కోట్లకు పైగా అదా అయిందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 290 కోట్ల మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించిన సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మక్తల్ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మంత్రికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మహిళల గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఉచిత బస్ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. పుట్టింటికి వెళ్ళాలంటే భర్త, కొడుకు తో మహిళలు డబ్బు అడిగే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మహిళలు నయా పైసా ఖర్చు పెట్టకుండా రాష్ట్రంలో ఏ పుణ్యక్షేత్రానికైనా వెళ్లి రావచ్చని, విద్యార్థినిలు, యువతులు పాఠశాలల,కళాశాలకు వెళ్లవచ్చనీ ఆయన స్పష్టం చేశారు. గతంలో ఆర్టీసీ కార్మికులు 56 రోజుల పాటు నిరసన చేసినా, 50 మంది కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని మంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ నీ ఆడుకోవాలని, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని సీఎం సంకల్పిశీచి మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో నాడు నష్టాల్లో ఉన్న ఆర్టీసీ నేడు ఆదాయం దిశగా దూసుకెళ్తోందని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం చేసిన మహిళల డబ్బు ప్రభుత్వమే చెల్లించి ఆర్టీసీ కి జీవం పోసిందని స్పష్టం చేశారు. నారాయణపేట లో ఇప్పటివరకు 123 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీ కి చెల్లించిందని వెల్లడించారు. దీంతో నారాయణ పేట జిల్లా మహిళలు రోజుకు 12 లక్షలు ఆదా చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి గొప్ప పథకం అన్నారు. మహిళల చేతుల్లోనే డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ పథకంతో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల కోట్లు ఆదా అయిందన్నారు. మహిళల ఉచిత బస్ ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కొత్త కొత్త పథకాలు తీసుకువచ్చే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ మొగులప్ప, మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మా రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనకు రాజకీయ పార్టీల సహకారం అవసరం



- జిల్లా ఎన్నికల రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో త్వరలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయి అధికారి ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి ఓటర్ల వివరాలను సరిచేయనున్నారని తెలిపారు. ఎన్నికల సంఘం ఎస్ ఐ ఆర్ నిర్వహణ తేదీలు ప్రకటించగానే షెడ్యూల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం ఇస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆయన తెలిపారు. ముసాయిదా నమూనా తదుపరి ఓటరు జాబితా ప్రకటించి తదుపరి అభ్యంతరాలు తీసుకుంటామని, తరువాత తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి, బీఎల్ఓలకు సహకరించి, ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా శుద్ధి ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలక భాగమని, అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకొని, అవసరమైన సవరణలు చేయించుకోవాలని కూడా ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు, రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మీ పథకం చారిత్రక మైలురాయి

- నగర మేయర్ గుండు సుధారాణి
- 290 కోట్ల ఉచిత ప్రయాణాలతో రూ.10 వేల కోట్ల చార్జీల ఆదా నేపథ్యంలో విజయోత్సవం
- అత్యధికంగా ప్రయాణాలు చేసిన మహిళలకు సత్కారం




**వరంగల్ బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** మహాలక్ష్మి పథకం రాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలవుతున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈ నెల 29 నాటికి మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు జరిగి సుమారు రూ.10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా అయిన సందర్భంగా వరంగల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వరంగల్ బస్ స్టేషన్ ఆవరణలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారదతో కలిసి మేయర్ హాజరైనారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మార్చి నెల మహిళల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల మహిళలు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకుని, తమ ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకునే అవకాశం పొందుతున్నారని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలు పట్టణాలకు వచ్చి వ్యాపారాలు నిర్వహించడం, తమ ఉత్పత్తులను విక్రయించడం సులభమవుతోందని, దీని ద్వారా వారి ఆదాయం పెరుగుతోందని వివరించారు. అదేవిధంగా, టెక్స్టైల్ పార్క్‌లో కేటెక్స్, యంగ్ వన్ వంటి ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయని, మహిళలకు అవసరమైన శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10 వేల కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా కావడం ఒక విశేషమని అన్నారు. వరంగల్ జిల్లాలో సుమారు 6 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదై రూ.270 కోట్ల ఆదా సాధించామని తెలిపారు. ఈ పథకం పట్ల మహిళల్లో పెరుగుతున్న స్పందనను టికెట్ల వినియోగం స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో గీసుగొండ, సంగెం మండలాలకు ఒక్కో ఎలక్ట్రిక్ బస్సును కేటాయించి మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదనంగా రూ.200 కోట్ల వ్యయంతో ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆధునిక ఛార్జింగ్ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అనంతరం అత్యధికంగా బస్సు ప్రయాణాలు చేసిన వివిధ రంగాలకు చెందిన మహిళలను కలెక్టర్, మేయర్ లు శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ రామ్ రెడ్డి, డిపో మేనేజర్ ధరం సింగ్, అసిస్టెంట్ మేనేజర్ నజియా సుల్తానా, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మహిళల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో 290 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసి, సుమారు పదివేల కోట్ల రూపాయల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న రాష్ట్ర మహిళా సోదరీమణులను అభినందిస్తూ భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా మహిళలపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, వారి స్వేచ్ఛాయుత ప్రయాణాలకు మరింత సౌలభ్యం కలిగిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్యా అవకాశాలను సులభంగా పొందగలుగుతున్నారని వివరించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ సేవలను వినియోగించడం వల్ల సంస్థకు కూడా ఆదాయం పెరిగిందని, ఇది ప్రభుత్వం, ప్రజలకు రెండింటికీ లాభదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మహిళలకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా ప్రయాణికులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గ్యాస్ట్రిక్ సమస్యలకు మంచి ఆహారపు అలవాట్లే పరిష్కారం

- గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శ్రీరామ్




**మంచిర్యాల ప్రతినిధి మార్చి 31 (జనంసాక్షి) :** గ్యాస్ట్రిక్ సమస్యలకు మంచి ఆహారపు అలవాట్లు అలాగే నిత్యం వ్యాయామం చేయడమే పరిష్కారమని యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల ప్రాంతానికి చెందిన పేషేంట్లు సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్లో అత్యాధునిక గ్యాస్ట్రోఎంటరాలజీ చికిత్సలను పొందుతున్నారు. ప్రతి నెలా గణనీయమైన సంఖ్యలో పెసెంట్లు ప్రత్యేక చికిత్స కోసం ఇక్కడికి వస్తున్నారని నిపుణులైన వైద్య బృందం, మల్టీడిసిప్లేనరీ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో, వేగవంతమైన వ్యాధి నిర్ధారణ, సమయానుకూల చికిత్సను యశోద హాస్పిటల్ అందిస్తోందని తెలిపారు. సమయానుకూలమైన మరియు నిపుణుల వైద్య సంరక్షణ వల్ల ఇక్కడ అనేక విజయవంతమైన ఫలితాలు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు .ఒక కేసులో, క్రానిక్ పాంక్రియాటైటిస్తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలిక గత కొన్నేళ్లుగా తీవ్రమైన, తరచుగా వచ్చే కడుపు నొప్పితో ఇబ్బంది పడుతోంది. పూర్తిస్థాయి పరీక్షల తర్వాత, ఆమెకు ఈఆర్‌సీపీ ప్రక్రియ ద్వారా పాంక్రియాటిక్ స్టెంటింగ్ చేశారు. ఈ చికిత్స తర్వాత, గత ఆరు నెలలుగా ఆమెకు నొప్పి లేదు మరియు ఎలాంటి అసౌకర్యం లేకుండా తన పరీక్షలను పూర్తి చేయగలిగిందని అన్నారు. మరో కేసులో, పోర్టల్ హైపర్‌ఆన్షన్ మరియు పెరిగిన ప్లీహం కారణంగా ఒక మధ్యవయస్కురాలి రక్తకణాలు ప్రమాదక రంగా పడిపోయాయి. స్థానికంగా పలు చికిత్సలు చేయించుకున్నా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. యశోద హాస్పిటల్స్లో ఆమెకు స్ప్లెనెక్టమీ శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స. అనంతరం ఆమె రక్త కణాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఆమె ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతుందని తెలిపారు. సంక్లిష్టమైన గ్యాస్ట్రోఎంటరాలజీ సమస్యలను పరిష్కరించడంలో సమయానుకూల చికిత్స మరియు మల్టీడిసిప్లినరీ విధానం చాలా ముఖ్యం. రోగులకు కేవలం చికిత్స అందించడమే కాకుండా, వారి దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని మరియు జీవన ప్రమాణాలను పెంపొందించడమే మా లక్ష్యం అన్నారు. మంచిర్యాల వంటి ప్రాంతాల్లో ఫాలో-అప్ సేవలను అందించడం ద్వారా అత్యాధునిక వైద్యాన్ని రోగులకు మరింత అందుబాటులోకి తెస్తున్నామని డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. ఈ సమావేశంలో పొన్నాల రాజు సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

# పదో తరగతి మూల్యాంకన విధులు తప్పనిసరి

- గైర్హాజరు అయితే చర్యలు
- జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం బోజన్న



**నిర్మల్ బ్యూరో, మార్చి31 (జనంసాక్షి):** నేటి నుండి నిర్మల్‌లోని సెయింట్ థామస్ హై స్కూల్‌లో నిర్వహించబడుతున్న పదో తరగతి మూల్యాంకన శిబిరానికి విధులు కేటాయించబడిన ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా ఉదయం 9 గంటలకు స్పాట్ క్యాంప్‌కు హాజరై రిపోర్ట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం బోజన్న తెలిపారు. ఈ మూల్యాంకన స్పాట్ డ్యూటీల నుంచి ఎవరికి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. ఎవరైనా గైర్హాజరైతే సంబంధిత వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


# ప్రజలు వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో వెంకటేశ్వర బజార్ లోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ వైద్యుల సేవల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మౌనికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణ ప్రజలు అందుబాటులో ఉన్న స్పెషాలిటీ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్, స్థానిక కార్పొరేటర్ గద్దె నీరాజరాణి, తహసీల్దార్ నాగరాజు, ప్రోగ్రాం అధికారి సారంగం, డాక్టర్ మౌనిక, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకులు రాజు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం రైతుల్లో ఆవేదన



**లక్ష్మణ చందా , మార్చి 31, (జనం సాక్షి):** చేతి కొచ్చిన పంట కోసే సమయానికి అకాల వర్షంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. లక్ష్మణచందా మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో పరిసర ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలు, బలమైన ఈదురుగాలు రబీ పంటలను కోతకు సిద్ధంగా ఉన్న దశలోనే మొక్క జొన్న నేలకరిపించాయి. మామిడి , వరి పంటలు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. పంట నష్టాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అకాల వర్షానికి నేలమట్టమైన పంటలు



**కుబీర్, మార్చి 31 (జనంసాక్షి) :** కుబీర్ మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. రాత్రనకా పగలనకా కష్టపడి, కడుపు కట్టుకుని కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న, మొక్కజొన్న పంటలు ఒక్క రాత్రిలోనే నేలపాలవడంతో రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. చేతికొచ్చిన పంట కళ్లముందే మట్టిపాలవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మండలంలో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి సారిక స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు పంట నష్టపోయిన ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఎంతో ఆశతో ఈ ఏడాది జొన్న, మొక్కజొన్న సాగు చేశారు. పెట్టుబడుల కోసం వడ్డీలకు అప్పులు తెచ్చి, విత్తనాలు, ఎరువులు వేసి ఎంతో కష్టపడ్డారు. పంట బాగా పండింది.. ఈసారి అప్పులు తీర్చి హాయిగా ఉండొచ్చు అని కలలు కన్న రైతులకు ప్రకృతి కోపం శాపంగా మారింది. గాలివాన ధాటికి పంట మొత్తం నేలవాలిపోవడంతో, కనీసం కోత ఖర్చులు కూడా వచ్చేలా లేవని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆకాశమే హద్దుగా పెరిగిన పంటలు ఇప్పుడు నేలమట్టం కావడంతో తాము కోలుకోలేని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం చెల్లించాలని కుబీర్ మండల రైతాంగం ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

# ఆశాజనకంగా భూపాలపల్లి మున్సిపల్ బడ్జెట్

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1132.5 లక్షల అంచనా




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1132.5 లక్షల అంచనాతో ఆశాజనకమైన బడ్జెట్ ను రూపొందించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన జరిగిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు విడుదల చేశారు. బడ్జెట్లో సాధారణ ఆదాయం, వ్యయం, ప్రారంభం, ముగింపు నిల్వలతో పాటు క్యాపిటల్, వ్యయాలు ఎంత అనే దానిపై మున్సిపల్ అధికారులు వివరించారు. రెండేళ్ల ఆర్థిక సంవత్సరాలను బేరీజు వేస్తూ ఆదాయం, వ్యయాలను సమతుల్యంగా నిర్వహిస్తూ, ముగింపు నిల్వలను స్థిరంగా ఉంచే దిశగా బడ్జెట్ రూపొందించారు. సాధారణ ఆదాయం, వ్యయాలతో పాటు వివిధ పనులకు నిధులను కేటాయించారు. ఈ సమావేశంలో బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 2024--25లో ఆదాయం అత్యధికంగా రూ.1061.95 లక్షలు రాగా, 2025-26లో కొంత తగ్గి రూ.1029.61 లక్షలకు పడిపోయింది. ప్రస్తుత అంచనా బడ్జెట్ 2026--27లో తిరిగి రూ.1132.50లక్షలకు పెంచారు. టాక్స్, నాన్‌టాక్స్ ఆదాయాలతో పాటు ఇతర గ్రాంట్ల ద్వారా కూడా ఆదాయం పెరిగి మున్సిపాలిటీ ఆర్థిక స్థితిని బలోపేతం చేసేలా ఉంది. 2025-26తో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో రూ.102.89 లక్షలు పెరుగుదల పెంచారు.

**బడ్జెట్ లో హెచ్చు తగ్గులు ఉంటే సరి చేసుకోవచ్చు: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**

బడ్జెట్ లో హెచ్చు తగ్గులు ఉంటే సరి చేసుకోవచ్చని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పలువురు కౌన్సిలర్ లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ మాట్లాడారు. మున్సిపాలిటీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఎటువంటి అనుమానాలు వద్దని, ఏమైనా అనుమానాలు ఉంటే లిఖిత పూర్వ కంగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో హెచ్చు తగ్గులుంటే మున్ముందు జరుగబోయే సమావేశాల్లో తీర్మానం చేసుకుని సరి చేసుకోవచ్చని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు అప్పం కిషన్, బొడ్డు అశోక్, కురిమిళ్ల శ్రీనివాస్, రాధ, శ్వేత పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట

- రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు
- జిల్లా కలెక్టర్ రాజార్ని షా



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) :** పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో (సుమారు రూ. 158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వను న్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నారావుపేట సొసైటీలో రూ.3.30 కోట్ల నష్టం

- ఆర్థిక అవకతవకలపై రీ-ఆడిట్ నిర్వహించాలని డిమాండ్
- చెన్నారావుపేట సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి



**చెన్నారావుపేట, మార్చి 31 (జనం సాక్షి) :** చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారీ ఆర్థిక అక్రమాలు తప్పుడు ఆడిట్ నివేదికలు బయటపడటంతో తక్షణమే రీ-ఆడిట్ (టెస్ట్ ఆడిట్) నిర్వహించాలని చెన్నారావుపేట సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సహకార శాఖ అధికారి చెన్నారావుపేట సొసైటీ పర్సన్ ఇన్చార్జి వజ్రాల విజయ్ భాస్కర్ రెడ్డికి అధికారిక విజ్ఞప్తిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఈ ఏడాది ఏకంగా రూ.3,30,14,720.40 ఆపరేషనల్ నష్టాన్ని చవిచూసినప్పటికి అధికారిక ఆడిట్ సర్టిఫికేట్ (నం.139/2024-25) లో మాత్రం రూ.1.20 కోట్లకు పైగా నికర లాభం ఉన్నట్లు చూపడం జరిగిందన్నారు. గత సంవత్సరాల లాభాలను ప్రస్తుత నష్టంతో సర్దుబాటు చేయడం ద్వారా, సంఘం దివాళా తీసిన నిజాన్ని రైతుల నుండి మరియు ప్రజల నుండి దాచిపెట్టడానికి ప్రయత్నించినట్లు స్పష్టమవుతోందన్నారు. సంఘం వివిధ సంస్థల నుండి తీసుకున్న అప్పులకు రూ.2.20 కోట్ల వడ్డీ చెల్లించగా సభ్యుల నుండి కేవలం రూ.29 లక్షలు మాత్రమే వడ్డీ రూపంలో వసూలు చేసిందన్నారు. ఇది సంఘం యొక్క రుణ నిర్వహణ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. గోదాం మరమ్మతుల పేరుతో ఎలాంటి పారదర్శకమైన టెండర్ ప్రక్రియ లేకుండా, క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకుండానే రూ. 45,47,700.00 ఖర్చు చేసినట్లు చూపారన్నారు. సంఘం నిధులతో చేపట్టిన భూమి కొనుగోలు మరియు గోదాం మరమ్మతుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని దీనివల్ల రైతులకు చెందాల్సిన కోట్లాది రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. తక్షణమే రీ-ఆడిట్ నిర్వహించా లని డిమాండ్ చేయడం చేశారు. భూమి కొనుగోలు లావాదేవీలు మరియు సివిల్ పనులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి బాధ్యులైన కమిటీ సభ్యులు మరియు ఉద్యోగులపై సెక్షన్ 60 కింద చర్యలు తీసుకొని ఆ సొమ్మును రికవరీ చేయాలని కోరారు. సంఘం మూలధనం కరిగిపోతున్నా రూ.1.35 కోట్ల మొండి బకాయిలు ఉన్నా కూడా దీనికి బి గ్రేడ్ కేటాయించడం ఆడిట్ నిబంధనలకు విరుద్ధం అన్నారు. ప్రస్తుత ఆడిట్ నివేదిక కేవలం మేనేజింగ్ కమిటీని బాధ్యతల నుండి తప్పించడానికి చేసిన ప్రయత్నంలా కనిపిస్తోందన్నారు. డైరెక్టర్ ఆఫ్ కోఆపరేటివ్ ఆడిట్ వెంటనే స్పందించి ఈ ఆడిట్ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని ఇతర జిల్లాకు చెందిన నిష్పాక్షిక అధికారి ద్వారా రీ-ఆడిట్ నిర్వహించాలని, లేకుంటే లోకాయుక్తను పిల్ ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 ఏప్రిల్ 2026

## క్రాంతికుమార్‌కు డాక్టరేట్



సూర్యాపేట, మార్చి 31 (జనంసాక్షి) : సూర్యాపేటకు చెందిన పులిపాటి క్రాంతికుమార్ కు జువాలజీలో పీహెచ్ డీ ప్రధానం చేసినట్లు ఉస్మానియా యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కృష్ణంరాజు తెలిపారు.క్రాంతికుమార్ జంతు శాస్త్రంలో టెర్మీటిసైడల్ అండ్ బయో కెమికల్ ఆక్టివిటీ ఆఫ్ టెర్పినాయిడ్స్ అండ్ ఆల్కలాయిడ్స్ ఆన్ ఇండియన్ వైట్ టెర్మిట్ ఓడొంటోటర్మెస్ ఓబెసస్, ఇన్ విట్రో, ఇన్ వైవో అండ్ మెకనిస్టిక్ ప్రాపర్టీస్ అనే అంశం మీద డాక్టర్ ఆప్కా నాగేశ్వరరావు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథం సమర్పించారు.సూర్యాపేటలోని ఆర్ కె గార్డెన్ కు చెందిన పులిపాటి క్రాంతి కుమార్ సూర్యాపేటలోనే పాఠశాల విద్య, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, పీజీని ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా పూర్తి చేశారు.ప్రస్తుతం అనాజీపురంలోని ఆదర్శ పాఠశాలలో పిజిటిగా, బయాలజీ జిల్లా రిసోర్స్ పర్సన్ గా విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లుకు ఆమోదం

- భువనగిరిలో న్యాయవాదుల సంబరాలు




**భువనగిరి టౌన్, మార్చి 31 (జనం సాక్షి) :** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లుకు ఆమోదం లభించిన సందర్భంగా భువనగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, ఈ చట్టం న్యాయవాదుల భద్రతకు కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు ఈ చట్టం మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లందాస్ వెంకటయ్య గౌడ్, నిసంగి విద్యాసాగర్, దామోదర్ రెడ్డి, లింగారెడ్డి, శ్రీకాంత్ రవీందర్, గోదా వెంకటేశ్వర్లు, నర్సింహా యాదవ్, హరిప్రియా, జయ తదితరులు పాల్గొన్నారు.

## హాలియాలో ట్రాఫిక్ నిబంధనలపై కఠిన చర్యలు



**హాలియా, మార్చి 31 (జనం సాక్షి) :** హాలియా పట్టణంలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మైనర్‌ల వాహన నడపడం, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ పలకలు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు, వారికి అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేవిధంగా సురక్షితంగా చేరుకుందాం అనే అవగాహన కార్యక్రమం నిర్వహించి సుమారు 100 మందికి రహదారి భద్రత, బాధ్యతాయుత వాహన నడపడం గురించి వివరించారు. భవిష్యత్తులో కూడా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్.ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



**పెద్ద శంకరంపేట, మార్చి 31 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెద్ద శంకరంపేట అల్లాదుర్గం ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి శంకర్ లు అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని పోలీస్ స్టేషన్ లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని వాటికి అనుగుణంగా మెలగాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు బాధ్యతలను కాపాడుకోవాలి అన్నారు. రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ చంద్రమోహన్.. పోలీసు సిబ్బంది. గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలలో తనిఖీల పేరుతో వేధింపుల పర్వం?




**మర్రిగూడ, మార్చి 31 (జనం సాక్షి) :** గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించే అంగన్‌వాడీ కేంద్రాలు, ఇప్పుడు పర్యవేక్షణ పేరుతో జరుగుతున్న ఒత్తిళ్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి ప్రాజెక్టు పరిధిలోని మర్రిగూడ, నాంపల్లి, చింతపల్లి మండలాల్లో అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కేంద్రాల పనితీరును మెరుగుపరచాల్సిన తనిఖీలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం సాధనాలుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా తనిఖీలు అంటే రికార్డుల నిర్వహణ, పౌష్టికాహార పంపిణీ తీరును పరిశీలించాలి. కానీ, ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వినికిడి. ఒక తనిఖీ అధికారి ప్రతి నెల ఒక్కో అంగన్వాడీ సెంటర్ నుండి మూడు వేల రూపాయల నగదు, రెండు కిలోల చికెన్ వేపుడు, తాటి కల్లు, జొన్న రొట్టెలు, మాడ్చిన కారం కావాలని, డిమాండ్ చేసి ఆ అధికారి పట్టుకెళ్లినట్లు ఆరోపణలు వినపడుతున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితే తప్ప, వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదు.

# మద్యం మత్తులో వాహనాలు నడపటం ప్రమాదకరం

- మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ
- పట్టుబడితే జైలు శిక్షలు తప్పవు
- మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దు
- ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడం డ్రైవర్ బాధ్యత
- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 31 (జనంసాక్షి) :** అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు, సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ప్రజలకు,ఆటో డ్రైవర్లకు, టాక్సీ డ్రైవర్లకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రహదారి నియమాలు, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరాలని అన్నారు. డ్రైవర్ బాధ్యతగా ప్రయాణికులను గమ్యం చేర్చాలని అన్నారు. వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేస్తూ, కాలినడకన వెళ్లే వారిని గమనిస్తూ ముందుకు సాగాలని సూచించారు.టాక్సీ, ఆటో డ్రైవర్లు చక్కని యూనిఫామ్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టి రవాణా చేయకూడదని తెలిపారు. డ్రైవర్ సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడతారని సూచించారు.మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు.జైలుకు పంపడం, వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తికి జైలు శిక్ష జరిమానాలు తప్పవని హెచ్చరించారు.ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు. కార్లు పెద్ద వాహనాల్లో ప్రయాణం చేసే సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోవడం సురక్షితమన్నారు.నిదానంగా వాహనాలను నడుపుతూ ప్రతి ఒక్కరు సురక్షితంగా గమ్యం చేరాలని, సంతోషంగా జీవించాలని అన్నారు.ఈ కార్యక్రమం నందు సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం,టౌన్ ఎస్ఐలు ఏడుకొండలు, ఐలయ్య,ప్రజలు, ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## హుజూర్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




హుజూర్‌నగర్, మార్చి 31 (జనంసాక్షి) : నూతన పాలకవర్గం హుజూర్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. హుజూర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజూర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫాలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజూర్ నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పారిశ్యుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డిఓకు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళల భద్రత కల్పించినట్లు అవుతుందన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హుజూర్‌నగర్, మార్చి 31 (జనంసాక్షి) :** హుజూర్‌నగర్ రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సదుపాయాలతో కేంద్రీయ విద్యాలయం

- ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**భువనగిరి టౌన్, మార్చి 30 (జనం సాక్షి) :** భువనగిరి బైపాస్ సమీపంలోని నేషనల్ హైవే -163 వద్ద జిల్లా అటవీ శాఖ కార్యాలయం పక్కన నిర్మితమైన పి.యం.శ్రీ కేంద్రీయ విద్యాలయం ఆధునిక సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకు సాగుతోంది. 2017లో స్థాపితమైన ఈ విద్యాలయం ప్రారంభ దశలో తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించగా, కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించిన స్వంత ఆధునిక భవనంలో 2024 నుండి విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం విశాల తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్య వసతులు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, స్కౌట్స్ ‌ఉ గైడ్స్ వంటి సహపాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది ద్వారా నాణ్యమైన బోధన అందించబడుతోంది. 2025 - 26 విద్యాసంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని, 1వ తరగతికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, 2వ నుండి 9వ తరగతుల వరకు ఖాళీల ఆధారంగా ఆఫ్‌లైన్ దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. చంద్రమౌళి తెలిపారు. వివరాల కోసం విద్యాలయ కార్యాలయం లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కేంద్ర విద్యాలయ సంస్థ మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్న ఈ విద్యాలయం, భువనగిరి మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాల విద్య అందుబాటులోకి తెచ్చింది.

## మహిళల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం



**తాండూరు, మార్చి 31 (జనంసాక్షి) :** మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా మహిళామణులందరికీ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం తాండూరు ఆర్టీసీ డీఎం సురేష్ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని తెలిపారు.బస్సు సర్వీసులు సరిపోవడం లేదని ప్రభుత్వం దృష్టికి రావడంతో మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తూ, ఆర్టీసీతో సమన్వయం చేసి కొత్త బస్సులను ప్రవేశపెట్టినట్లు వివరించారు.ఈ ఉచిత బస్సు ప్రయాణం వల్ల అనేక నిరుపేద మహిళలకు ఎంతో లాభదాయకంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు గారు, మాజీ డీసీసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ గౌడ్, కర్ణం పురుషోత్తం, ప్రభాకర్ గౌడ్ తో పాటు పట్టణ కౌన్సిలర్స్, నాయకులు పలువురు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**షాబాద్, మార్చి 31 (జనం సాక్షి) :** మామిడికాయల కోసం చెట్టు ఎక్కిన వ్యక్తికి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన సమాచారం మేరకు నగర కుంట కు చెందిన బాబుసు సాయికుమార్ వృత్తినిత్య సెక్యూరిటీ గాడుగా వెల్స్పన్ కంపెనీలో విధులు నిర్వహిస్తుంటాడని, మంగళవారం సమీపంలోని మామిడి తోటలో కాయల కోసం చెట్టు ఎక్కే క్రమంలో అనుకోకుండా విద్యుత్ షాక్ తగిలి చెట్టు పైనే మృతి చెందాడని, మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలుపుతూ. మృతుని భావ చీర నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన గొప్ప గౌరవం ఉచిత బస్సు పథకం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 31 (జనంసాక్షి) :** ఉచిత బస్సు పథకం మహిళల ఆర్థిక, సామాజిక భద్రతకు, స్వావలంబనకు భరోసా, బలమైన అడుగు అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సులో రూ.10వేల కోట్ల ఆదా చేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ఆర్టీసీ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.జిల్లాలో మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం వల్ల భారీ స్థాయిలో ఆర్థిక ఆదా జరిగిందని తెలిపారు.2023 డిసెంబర్ 9న ప్రారంభమైన ఈ పథకం ద్వారా 290 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, మహిళలు, విద్యార్థులు కలిసి సుమారు రూ .10 వేల కోట్ల మేర ఆదా చేసుకున్నారని తెలిపారు.ఈ పథకం వల్ల మహిళలు తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుని ఆ డబ్బును కుటుంబ అవసరాలు, విద్య, ఆరోగ్యంపై వినియోగిస్తున్నారని వివరించారు.ఉచిత బస్సు సదుపాయం మహిళల ఆర్థిక భద్రతకు పునాది వేస్తోందని చెప్పారు.ఉచిత బస్సు పథకం మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన గొప్ప గౌరవమని అన్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రులు, ఉద్యోగాలు, చిన్న వ్యాపారాల కోసం ప్రయాణించే మహిళలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు.బస్సు చార్జీల ఆదా కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ పథకం కుటుంబాభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఈ పథకం వల్ల మహిళలు నెలకు సగటున రూ.5వేలు వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు.ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని, బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని అన్నారు. అనంతరం మహాలక్ష్మి ఉచితబస్సులో ప్రతిరోజు ప్రయాణించే మహిళలను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, ఆర్డీవో వేణు మాధవరావు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం సుచరిత, అడిషనల్ డీఆర్డీవో సురేష్, కౌన్సిలర్ నామా అరుణ,సూర్యాపేట డిఎం సునీత,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 115 డాలర్లు

### విదేశీ పెట్టుబడిదారుల నిరంతర విక్రయాలు




**న్యూఢిల్లీ,మార్చి 31 (జనంసాక్షి) :**ఈ నెలలో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9 లక్షల కోట్లకు పైగా నష్టపోయింది. మహావీర్ జయంతి సందర్భంగా రేపు (మార్చి 31) స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు. నిపుణులు యుద్ధ ఉద్రిక్తతలు తగ్గకపోతే ఏప్రిల్ నెలలో కూడా మార్కెట్‌లో ఒత్తిడి కొనసాగవచ్చని హెచ్చరిస్తున్నారు. ఆర్బీఐ రూపాయి స్థిరత్వం కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, గ్లోబల్ పరిస్థితులు మెరుగుపడకపోతే ఒత్తిడి తగ్గడం కష్టమని వారు అభిప్రాయపడుతున్నారు.

వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపు ప్రీ–కాన్ఫ్లిక్ట్ స్థాయిలో 70%కి పెంచారు
ఉక్కు మంత్రిత్వ శాఖ అభ్యర్థన మేరకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ చర్య
ప్లాంట్లు ఎల్‌పీజీ లేకుండా నిలిపివేయకుండా చూడాలని కోరిక
పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయం

పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపును ప్రీ–కాన్ఫ్లిక్ట్ స్థాయిలో 70 శాతంకి పెంచారు.

ఇటీవల ఉక్కు మంత్రిత్వ శాఖ పెట్రోలియం మంత్రిత్వ శాఖను ఆశ్రయించి, ఉక్కు ప్లాంట్లు ఎల్‌పీజీ లేకుండా నిలిపివేయకుండా చూడాలని అభ్యర్థించింది. దీనికి స్పందించిన పెట్రోలియం మంత్రిత్వ శాఖ వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపును పెంచి, ప్లాంట్ల సరఫరా సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకుంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఎల్‌పీజీ సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోబడింది. ఉక్కు పరిశ్రమ ఎల్‌పీజీపై ఆధారపడి ఉండటం వల్ల సరఫరా సాఫీగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపు ప్రీ–కాన్ఫ్లిక్ట్ స్థాయిలో 70 శాతం వరకు పెంచబడింది. ఇది ఉక్కు ప్లాంట్లు సాఫీగా నడిచేందుకు సహాయపడుతుందని అధికారులు తెలిపారు. యుద్ధ ఉద్రిక్తతలు కొనసాగితే ఎల్‌పీజీ సరఫరా మరింత ఒత్తిడికి లోనవుతుందని, అందుకే కేటాయింపు పెంచాల్సి వచ్చిందని వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయం ఉక్కు పరిశ్రమకు తాత్కాలిక ఊరట కలిగించినప్పటికీ, యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే మరిన్ని సవాళ్లు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## మార్చిలో 11.4 శాతం పతనం

- 2025-26 ఆర్థిక సంవత్సరం నష్టాల్లో ముగిసింది
- రూపాయి 95 మార్కు దాటినా 'ఫైన్‌గా ఉంది' అంటున్నారు నిర్మలా

**ముంబై, మార్చి 31 (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్లు మార్చి నెలలో భారీ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 50 సూచీ ఈ నెలలో 11.4 శాతం పతనం చెంది ఆరు ఏళ్లలో అత్యంత దారుణమైన నెలగా నిలిచింది. సెన్సెక్స్ కూడా భారీగా క్షీణించి 2025–26 ఆర్థిక సంవత్సరా న్ని నష్టాల్లో ముగించింది.

పశ్చిమాసియాలో యుద్ధం ఐదవ వారంలోకి ప్రవేశించడం, చమురు ధరల భగభగలు, రూపాయి విలువ 95 మార్కు దాటడం వంటి పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. సోమవారం సూచీలు 2 శాతం పైగా పడిపోయాయి.

**నిఫ్టీ 50 ఆరు ఏళ్లలో అత్యంత దారుణ నెల**

నిఫ్టీ 50 ఈ మార్చి నెలలో మొత్తం 11.4 శాతం క్షీణించింది. ఇది 2020 మార్చి తర్వాత అత్యంత భారీ నష్టమైన నెలగా నిలిచింది. సెన్సెక్స్ కూడా ఇదే తరహాలో నష్టపోయి ఆర్థిక సంవత్సరం చివరి రోజున నష్టాల్లో ముగిసింది.

**రూపాయి 95 జూపుకు దాట్వనా 'ఫైన్‌గా ఉంది**

రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.45 స్థాయికి చేరుకున్నా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ "రూపాయి విలువ ఫైన్‌గా ఉంది" అని వ్యాఖ్యానించారు. అయితే మార్కెట్ నిపుణులు యుద్ధం, చమురు ధరల పెరుగుదల, ఎఫ్ఐఐల నిరంతర విక్రయాలు వంటి కారణాలు రూపాయి పతనానికి దారితీశాయని అంటున్నారు.



## టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160
# 4వీ కొత్త మోడల్ విడుదల

- ప్రారంభ ధర రూ.1.25 లక్షలు - టాప్ వేరియంట్ రూ.1.37 లక్షలు
- స్పోర్ట్, అర్బన్, రెయిన్ - మూడు రైడింగ్ మోడ్‌లు

**చెన్నై, మార్చి 31 (జనంసాక్షి) :** టీవీఎస్ మోటార్ కంపెనీ తన ప్రముఖ అపాచీ సిరీస్‌లో కొత్త అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీ మోడల్‌ను అధికారికంగా విడుదల చేసింది. కొత్త మోడల్ లో టాప్ వేరియంట్ ఫీచర్లను స్టాండర్డ్‌గా అందించడం విశేషం.

**ధరల వివరాలు :** ప్రారంభ ధర: రూ.1.25 లక్షలు (ఎక్స్–షోరూమ్)
టాప్ వేరియంట్ ధర: రూ.1.37 లక్షలు (ఎక్స్–షోరూమ్)

**కొత్త ఫీచర్లు :** కొత్త అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీలో ఎల్ఈడీ డీఆర్ఎల్‌లతో కూడిన క్లాస్–డి ప్రాజెక్టర్ హెడ్‌ల్యాంప్, అసిస్ట్, స్లిప్పర్ క్లచ్ అన్ని వేరియంట్లలో స్టాండర్డ్‌గా ఇచ్చారు. మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది.

**ఎంట్రీ లెవల్:** సింగిల్ ఛానెల్ ఏబీఎస్, టెలిస్కోపిక్ ఫోర్క్స్, డిజిటల్ ఎల్‌సీడీ క్లస్టర్ (మ్యాట్ బ్లాక్, రేసింగ్ రెడ్)

**మిడ్ లెవల్:** డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్, అప్‌సైడ్ డౌన్ ఫోర్క్ (మ్యాట్ బ్లాక్, గ్రానైట్ గ్రే, పెర్ల్ వైట్) – ధర రూ.1.31 లక్షలు

**టాప్ ఎండ్ (టీఎఫ్‌టీ వేరియంట్):** 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్, ట్రాక్షన్ కంట్రోల్ (మ్యాట్ బ్లాక్, రేసింగ్ రెడ్, మెరైన్ బ్లూ)

**ఇంజిన్, పవర్ :** 159.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తుంది. మూడు రైడింగ్ మోడ్‌లు (స్పోర్ట్, అర్బన్, రెయిన్) ఉన్నాయి.

**స్పోర్ట్ మోడ్:** 17.6 పీఎస్ పవర్ ఏ 9,600 ఆర్‌పీఎం, 14.74 ఎన్ఎం టార్క్ ఏ 7,500 ఆర్‌పీఎం

**అర్బన్/రెయిన్ మోడ్:** 15.6 పీఎస్ పవర్ ఏ 8,650 ఆర్‌పీఎం, 14.1 ఎన్ఎం టార్క్ ఏ 7,250 ఆర్‌పీఎం

ఈ కొత్త అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీ యువతకు మరింత ఆకర్షణీయంగా ఉండేలా డిజైన్, ఫీచర్లు, పనితీరును మెరుగుపరచినట్లు టీవీఎస్ సంస్థ తెలిపింది. ధరల పెంపు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుంది.

| | | |
|---|---|---|
| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| హైదరాబాద్ | ₹ 380 | ₹ 45.60 |
| వరంగల్ | ₹ 382 | ₹45.84 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹1,48,690 (24 క్యారెట్లు) | ₹1,36,300 (22 క్యారెట్లు)

చెన్నై
₹1,36,700 (22 క్యారెట్లు) | ₹1,49,130 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹2,45,000

## అనుమతులకు ముందే చైనా యూజర్ల ఐఫోన్లలో యాపిల్ ఏఐ ఫీచర్!

- పొరబాటున ప్రత్యక్షమైన యాపిల్ ఇంటెలిజెన్స్ - వెంటనే తొలగించిన యాపిల్
- అలీబాబాతో కలిసి అభివృద్ధి చేసిన ఫీచర్




**న్యూఢిల్లీ/బీజింగ్, మార్చి 31 (జనంసాక్షి) :** ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ కొత్తగా అభివృద్ధి చేసిన ఏఐ ఫీచర్ అనుమతులకు ముందే చైనా యూజర్ల ఐఫోన్లలో కొంతసేపు ప్రత్యక్షమై ంది. ఈ పొరబాటును గ్రహించిన యాపిల్ వెంటనే ఆ ఫీచర్‌ను తొలగించిన ట్లు సమాచారం. యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్‌ను చైనా యూజర్లకు అందు బాటులోకి తెచ్చేందుకు అలీబాబా కంపెనీతో కలిసి కొంతకాలంగా పని చేస్తోంది. అయితే చైనాలో విదేశీ ఏఐ సాంకేతికతపై ఉన్న కఠిన ఆంక్షల కారణంగా చైనా సైబర్‌స్పేస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఇటీవల కొంతమంది చైనీస్ యూజర్ల ఐఫోన్లలో యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్ ప్రత్యక్షమైంది. వారు తమ సెట్టింగ్స్ యాప్‌లో ఈ ఫీచర్ యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించి సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. దీంతో ఈ విషయం వైరల్‌గా మారింది. వెంటనే అప్రమత్తమైన యాపిల్ ఆ ఫీచర్‌ను ఆఫ్‌లైన్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

**హువావే, షావోమీ ఏఐతో పోటీ**

చైనాలో హువావే, షావోమీ వంటి స్థానిక కంపెనీలు ఇప్పటికే తమ ఏఐ ఫీచర్లను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చడం యాపిల్‌కు మరింత ఇబ్బంది కలిగించింది. రెగ్యులేటరీ అనుమతుల కోసం యాపిల్ ఇంకా వేచి ఉండాల్సి వస్తోంది. ఇక యాపిల్ కొత్తగా అప్‌గ్రేడ్ చేస్తున్న ఏఐ–ఆధారిత సిరి ఫీచర్ కోసం యూజర్లు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం 'కాంపో' అనే కోడ్ నేమ్‌తో టెస్టింగ్ దశలో ఉన్న ఈ ఫీచర్‌ను జూన్ నెలలో విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. భారత్‌లో మాత్రం యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్ గతేడాది నుంచి అందుబాటులో ఉంది.

### పశ్చిమాసియా యుద్ధం వల్ల విమాన ఇంధనం ధరలు పెరిగే ఆందోళన

**వ్యాట్ తగ్గించాలని రాష్ట్రాలకు కేంద్ర మంత్రి కీలక అభ్యర్థన**

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్) ధరలు పెరిగే ఆందోళన నేపథ్యంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్రాలకు కీలక అభ్యర్థన చేశారు. ఏప్రిల్ 1 నుంచి ఏటీఎఫ్ ధరలను సవరించనున్న నేపథ్యంలో, విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాలను మంత్రి కోరారు. ఈ మేరకు రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖ రాసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఢిల్లీలో విమాన ఇంధనంపై వ్యాట్ 25 శాతం, మహారాష్ట్రలో 18 శాతం, తమిళనాడులో 29 శాతం. ఈ వ్యాట్‌లను తగ్గిస్తే విమాన టికెట్లపై అదనపు భారం పడకుండా ఉంటుందని మంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.

## ఇండిగో సీఈవోగా బ్రిటీష్ ఎయిర్‌వేస్ మాజీ చీఫ్ విలియం వాల్ష్

**పీటర్ ఎల్బర్స్ రాజీనామా తర్వాత ఖాళీ భర్తీ**



**న్యూఢిల్లీ, మార్చి 31 (జనంసాక్షి) :** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సీఈవోగా బ్రిటీష్ ఎయిర్‌వేస్ మాజీ చీఫ్ విలియం వాల్ష్ నియమితులయ్యారు. పీటర్ ఎల్బర్స్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని వాల్ష్ భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్న వాల్ష్ పదవీ కాలం జులై 31న ముగియనుంది. ఆగస్టు 3 తర్వాత ఇండిగో సీఈవో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. గతేడాది డిసెంబర్‌లో ఇండిగో విమానాలు భారీ స్థాయిలో రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పీటర్ ఎల్బర్స్ తన పదవీ కాలం ముగియడానికి 18 నెలల ముందే అకస్మాత్తుగా రాజీనామా చేశారు. దీంతో కొత్త సీఈవో నియామకం చోటుచేసుకుంది. విలియం వాల్ష్ మాట్లాడుతూ, "ఇండిగోలాంటి బలమైన పునాదులు కలిగిన సంస్థకు నాయకత్వం వహించడం సంతోషంగా ఉంది. విమానయాన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్తాను" అని తెలిపారు. ఇండిగో ప్రస్తుతం దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా కొనసాగుతోంది. కొత్త సీఈవో నియామకం సంస్థ భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తి రేపుతోంది.

## గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్ హైదరాబాద్ ప్లాంట్‌కు వీఏఐ ఇన్‌స్పెక్షన్

**గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్‌కు సానుకూల ప్రభావం**



**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీ హైదరాబాద్‌లోని తన ప్లాంట్‌కు అమెరికా ఆహార, ఔషధాల నియంత్రణ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ) నుంచి వాలిడేషన్ యాక్షన్ ఇన్‌స్పెక్షన్ (వీఏఐ) వర్గీకరణ లభించింది. ఈ వర్గీకరణతో ఆ ప్లాంట్‌లో తయారైన ఔషధాలను అమెరికా మార్కెట్‌కు సరఫరా చేయడం కొనసాగించవచ్చని కంపెనీ తెలిపింది. యూఎస్ ఎఫ్‌డీఏ ఇన్‌స్పెక్టర్లు ఇటీవల హైదరాబాద్ యూనిట్‌ను తనిఖీ చేసిన తర్వాత ఈ స్థితి ఇచ్చారు.

గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్ హైదరాబాద్ ప్లాంట్ యూఎస్ మార్కెట్‌కు ముఖ్యమైన సరఫరా కేంద్రం. వీఏఐ వర్గీకరణ లభించడం వల్ల కంపెనీ ఉత్పత్తి, ఎగుమతి కార్యకలాపాలు సాఫీగా కొనసాగుతాయని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ అభివృద్ధి గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్ షేర్లపై సానుకూల ప్రభావం చూపింది. యూఎస్ ఎఫ్‌డీఏ నుంచి వీఏఐ స్థితి లభించడం ఔషధ తయారీ రంగంలో గణనీయమైన విజయంగా పరిగణించబడుతోంది. కంపెనీ భవిష్యత్ ఉత్పత్తి ప్రణాళికలను మరింత విస్తరించాలని యోచిస్తోంది.

## చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారులకు సహజ్, సుగమ్

**ఆడిట్ అవసరం లేని వారు జులై 31లోగా దాఖలు చేయాలి**




**న్యూఢిల్లీ, మార్చి 31 (జనంసాక్షి) :** పన్ను చెల్లింపుదారులకు ముఖ్యమైన అలర్ట్. 2026–27 మదింపు సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్ ఫారాలను ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది. చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారులకు ఉద్దేశించిన ఐటీఆర్–1 (సహజ్) మరియు ఐటీఆర్–4 (సుగమ్) ఫారాలను మార్చి 30న నోటిఫై చేయగా, ఐటీఆర్–2, 3, 5, 6, 7తో పాటు అప్‌డేట్ చేసిన రిటర్నులు దాఖలు చేసేందుకు ఉద్దేశించిన ఐటీఆర్–యూను మంగళవారం నోటిఫై చేసింది. అంటే వ్యక్తులు, వ్యాపారులు, సంస్థలు 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికి సంబంధించిన రిటర్నులు ఇప్పుడు దాఖలు చేసుకోవచ్చు. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు జులై 31లోగా ఐటీఆర్ ఫైల్‌చేయాల్సి ఉంటుంది.

ఏ ఫారం ఎవరికి?

- **ఐటీఆర్–1 (సహజ్):** వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉండేవారు. జీతం, ఒక ఇంటి నుంచి వచ్చే ఆదాయం, వడ్డీ, ఏడాదికి రూ.5,000 వరకు వ్యవసాయ ఆదాయం ఉన్నవారు ఈ ఫారాన్ని ఎంపిక చేసుకోవచ్చు.
- **ఐటీఆర్–4 (సుగమ్):** మొత్తం వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉండి, వ్యాపారం లేదా వృత్తి ద్వారా ఆదాయం పొందే వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (ఎఖఫ్), సంస్థలు (ఎల్ఎల్‌పీ మినహా) ఈ ఫారాన్ని ఎంచుకోవచ్చు.
- **ఐటీఆర్–2:** మూలధన లాభాలున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు ఈ ఫారాన్ని ఎంపిక చేసుకోవాలి. వ్యాపారం లేదా వృత్తి ద్వారా ఆదాయం ఉన్నవారికి ఇది వర్తించదు.
- **ఐటీఆర్–3:** వృత్తి లేదా వ్యాపారం ద్వారా ఆదాయం ఆర్జించే వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌ల కోసం ఈ ఫారం.
- **ఐటీఆర్–5:** సంస్థలు, ఎల్ఎల్‌పీలు, సహకార సంఘాలు ఈ ఫారాన్ని దాఖలు చేయాలి.
- **ఐటీఆర్–6:** కంపెనీల చట్టం కింద నమోదైన కంపెనీలు ఈ ఫారాన్ని ఎంపిక చేసుకోవాలి.
- **ఐటీఆర్–7:** ట్రస్టులు, స్వచ్ఛంద సంస్థలు ఈ ఫారాన్ని ఎంపిక చేసుకోవాలి. పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయ వర్గం, మూలాలను బట్టి సరైన ఫారాన్ని ఎంపిక చేసుకుని సమయానికి రిటర్న్ దాఖలు చేయాలని ఆదాయపు పన్ను విభాగం సూచించింది.

# బ్యాంకులకు ఊరట- జూలై 1 వరకు వాయిదా

**బ్యాంకుల క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్‌లపై కొత్త దిశానిర్దేశాలు**



**ముంబై, మార్చి 31 (జనంసాక్షి) :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకుల క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్‌లపై కొత్త దిశానిర్దేశాల అమలును మూడు నెలలు వాయిదా వేసింది. ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రావాల్సిన ఈ నిబంధనలు ఇప్పుడు జూలై 1, 2026 నుంచి అమలవుతాయి. బ్యాంకులు తమ క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్‌లను మరింత జాగ్రత్తగా నిర్వహించాలని ఆర్‌బీఐ గతంలో దిశానిర్దేశాలు జారీ చేసింది. ఈ నిబంధనల అమలుకు బ్యాంకులు మరికొంత సమయం కావాలని అభ్యర్థించడంతో ఆర్‌బీఐ మూడు నెలలు వాయిదా వేసింది. ఈ నిబంధనల ప్రకారం బ్యాంకులు తమ క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్‌లను (షేర్లు, డెరివేటివ్స్, మ్యూచువల్ ఫండ్ యూనిట్లు మొదలైనవి) మరింత కఠినంగా పరిమితం చేయాల్సి ఉంటుంది. ఇది బ్యాంకుల రిస్క్ నిర్వహణను మెరుగుపరచడం లక్ష్యంగా ఉంది. ఆర్‌బీఐ ఈ వాయిదా ద్వారా బ్యాంకులు తమ సిస్టమ్‌లు, ప్రక్రియలు సన్నాహం చేసుకునేందుకు అవకాశం కల్పించింది. జూలై 1 నుంచి ఈ నిబంధనలు పూర్తి స్థాయిలో అమలులోకి వస్తాయి.

## లోధా కమిటీకి పీఏసీఎల్
# 455 ఆస్తులను అప్పగించిన ఇడి

*రూ.15,582 కోట్ల విలువైన ఆస్తుల పునరుద్ధరణ - బాధితులకు పెద్ద ఊరట*

- లోధా కమిటీ ఆధ్వర్యంలో సమానంగా పంపిణీ
- మరిన్ని ఆస్తులను జప్తు చేసి అప్పగించనున్న ఇడి




**న్యూఢిల్లీ, మార్చి 31 (జనంసాక్షి) :** పీఏసీఎల్ (ప్రాముఖ్యత ఆస్తులు కంపెనీ లిమిటెడ్) మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరో కీలక చర్య తీసుకుంది. రూ.15,582 కోట్ల విలువైన 455 ఆస్తులను న్యాయమూర్తి లోధా కమిటీకి అప్పగించింది.

ఇడి ఈ ఆస్తులను జప్తు చేసి, బాధితులకు పునరుద్ధరణ చేయడం కోసం లోధా కమిటీ ఆధ్వర్యంలో అప్పగించింది. ఈ ఆస్తులలో భూములు, భవనాలు, వాణిజ్య స్థలాలు, ఫ్లాట్లు వంటివి ఉన్నాయి. లక్షలాది మంది పెట్టుబడిదారులు మోసపోయిన ఈ కేసులో ఇడి ఇప్పటివరకు భారీ మొత్తంలో ఆస్తులను జప్తు చేసి, బాధితులకు తిరిగి అందించే ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

లోధా కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆస్తులను బాధితుల మధ్య సమానంగా పంపిణీ చేయనున్నారు. ఇడి ఇంకా అనేక ఆస్తులను జప్తు చేసి, లోధా కమిటీకి అప్పగించే ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ చర్యతో బాధితులు గణనీయమైన ఊరట పొందారు. పీఏసీఎల్ కేసు దేశవ్యాప్తంగా లక్షలాది మంది పెట్టుబడిదారులను ప్రభావితం చేసిన పెద్ద మోసం కేసు. ఇడి ఈ కేసులో ఇప్పటివరకు వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను జప్తు చేసి, బాధితుల ప్రయోజనాల కోసం కొనసాగుతోంది. లోధా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రక్రియ బాధితుల మధ్య న్యాయం జరిగేలా చూస్తుంది. ఈ కేసు ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇడి ఇంకా మరిన్ని ఆస్తులను జప్తు చేసి, లోధా కమిటీకి అప్పగించే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బాధితులు ఆశిస్తున్నారు. ఈ చర్యతో పీఏసీఎల్ మోసం బాధితులకు కొంతవరకు న్యాయం లభించే మార్గం సుగమమైంది.

## ఒక శాతం తగ్గిన
# భారత ఆర్థిక వృద్ధి

- 2026-27 ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాలపై ప్రతికూల ప్రభావం
- పశ్చిమాసియా సంక్షోభం, చమురు ధరల పెరుగుదల కీలక కారణాలు
- దిగుమతి బిల్లు పెరగడం, ద్రవ్యోల్బణం, రూపాయి క్షీణతతో ఆందోళన




**న్యూఢిల్లీ, మార్చి 31 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు భారతదేశ 2026–27 ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి అంచనాలను ఒక శాతం పాయింటు తగ్గించవచ్చని ఈవై నివేదికలో వెల్లడించింది. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరగడం, దిగుమతి బిల్లు పెరగడం, రూపాయి విలువ క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి అంశాలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఈవై విశ్లేషకులు అంచనా వేశారు. దీంతో 2026–27లో భారత జీడీపీ వృద్ధి రేటు ఒక శాతం పాయింటు తగ్గి, ప్రస్తుత అంచనాల కంటే తక్కువగా ఉండవచ్చని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 115 డాలర్ల వరకు పెరిగాయి. భారత్ చమురు దిగుమతులపై ఆధార పడి ఉండటం వల్ల దిగుమతి బిల్లు భారీగా పెరిగి, కరెంట్ ఖాతా లోటు విస్తరించే అవకాశం ఉంది. ఇది రూపాయి విలువను మరింత క్షీణింపజేసి, ద్రవ్యోల్బణాన్ని పెంచుతుందని ఈవై హెచ్చరించింది.

అయితే దీర్ఘకాలికంగా భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులు కలిగి ఉందని, యుద్ధం త్వరగా తగ్గితే వృద్ధి రేటు మళ్లీ స్థిరపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆర్థిక అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం, ఆర్బీఐ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సంక్షోభం భారతదేశ ఆర్థిక వృద్ధి లక్ష్యాలను ప్రభావితం చేస్తుందని, ముఖ్యంగా ఇంధన దిగుమతులు, రవాణా, తయారీ రంగాలపై ఒత్తిడి పెరగనుందని ఈవై నివేదిక స్పష్టం చేసింది.

### యూపీఐ ద్వారా ఏటీఎం నగదు ఉపసంహరణకు
## ఏప్రిల్ 1 నుంచి రూ.23 ఛార్జీ పన్నులు

- కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి బ్యాంకింగ్ నిబంధనల్లో మార్పులు
- డెబిట్ కార్డు రోజువారీ ఉపసంహరణ పరిమితి సగానికి తగ్గింపు




**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :**కొత్త ఆర్థిక సంవత్సరం (2026–27) బుధవారం నుంచి ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో బ్యాంకింగ్ నిబంధనల్లో ముఖ్యమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల మేరకు పలు బ్యాంకులు తమ ఖాతాదారుల లావాదేవీ నియమాలను సవరిస్తున్నాయి.

**యూపీఐ ద్వారా ఏటీఎం నగదు ఉపసంహరణలు**

ఇప్పటివరకు ఏటీఎంలలో కార్డు లేకుండా యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు ఉపసంహరించుకోవడం ఉచితంగా లేదా అదనపు లావాదేవీగా ఉండేది. ఏప్రిల్ 1 నుంచి ఈ సౌకర్యం ఉచిత లావాదేవీల లెక్కలోనే పరిగణించబడుతుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో సహా పలు బ్యాంకులు ఇకపై యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలను నెలవారీ ఏటీఎం లావాదేవీల లెక్కలోనే చేర్చనున్నాయి. ఉచిత లావాదేవీల పరిమితి ముగిశాక ప్రతి ఉపసంహరణకు రూ.23తో పాటు అదనపు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

**ఉపసంహరణ పరిమితుల్లో తగ్గింపు**

పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై రోజువారీ ఏటీఎం నగదు ఉపసంహరణ పరిమితిని సగానికి తగ్గించింది. చాలా కార్డులకు రోజువారీ పరిమితిని రూ.1,00,000 నుంచి రూ.50,000కి తగ్గించింది. బంధన్ బ్యాంక్ ఖాతాదారులు తమ సొంత ఏటీఎంలలో నెలకు 5 సార్లు ఉచిత ఆర్థిక లావాదేవీలు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకుల ఏటీఎంలను వాడితే మెట్రో నగరాల్లో 3 లావాదేవీలు మాత్రమే ఉచితం. పరిమితి దాటితే ప్రతి లావాదేవీకి రూ.10 రుసుము వసూలు చేయనున్నారు.

**రెండంచెల భద్రత తప్పనిసరి**

ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు డిజిటల్ చెల్లింపులకు కేవలం ఓటీపీ మాత్రమే కాకుండా పిన్ లేదా బయోమెట్రిక్ వంటి అదనపు ధ్రువీకరణ (రెండంచెల భద్రత) తప్పనిసరి కానుంది. యాప్‌ల ద్వారా పదేపదే బ్యాలెన్స్ తనిఖీ చేస్తే నామమాత్రపు ఛార్జీలు విధించనున్నారు. ఈ మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయి. ఖాతాదారులు తమ బ్యాంక్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో సంబంధిత నిబంధనలను చదివి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించబడుతోంది.

# మహాలక్ష్మి పథకంతో ఆర్థిక స్వావలంబన

- మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలో 10 వేల కోట్లు మహిళలు చార్జీలు ఆదా చేసిన సందర్భంగా వేడుకలు
- కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి);** ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగ పడుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి రెండేండ్లకుపైగా పూర్తి అయి 290 కోట్ల ప్రయాణాలు మహిళలు చేయగా, రూ.10 వేల కోట్లు ఆదా చేసిన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పలువురు మహిళలకు ఉచిత బస్ టికెట్ అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల సేవలు నిత్యం వినియోగిం చుకుంటున్న పలువురు మహిళలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలు, సంక్షేమ ఫలాలు వారి పేరిట, వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు డిసెంబర్ 9వ తేదీ 2023 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే మహిళలు డబ్బులు ఆదా చేసుకొని, వాటిని పిల్లల చదువు, స్వయం ఉపాధి, పొదుపు వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఈ పథకం దోహదం చేస్తుందని, బస్సుల్లో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. పలు ప్రభుత్వ పథకాలు మహిళల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని తెలిపారు. చీరలు మన సంస్కృతికి నిదర్శనమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతు పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. బ్యాంక్ లింకేజ్ రుణాలు, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచిం చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డీఎంలు ప్రకాశరావు, శ్రీనివాస్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇసుక సరఫరా చేయాలి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఇసుక వాహనం వ్బసైట్ మొబైల్ యాప్ ద్వారా వినియోగదారులకు పారదర్శకంగా ఇసుక సరఫరా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు tgmiv.cgg.gov.in వ్బసైట్ లేదా మన ఇసుక వాహనం యాప్ ద్వారా ఇసుక బుక్ చేసుకుని దళారుల జోక్యం లేకుండా నేరుగా పొందవచ్చన్నారు. మొబైల్ యాప్ ట్రాక్టర్‌కు 775 చెల్లించి ఆన్లైన్లో బుకింగ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక అందజేస్తామని, అవసరమైన చోట రవాణా సౌకర్యం కూడా కల్పించాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో నూతన ఇసుక విధానం పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, టీజీఎండీసీ అధికారి వెంకటేశ్వర్లు, భూగర్భ గనుల శాఖ ఏ.డి. గంగాధర్, భూగర్భ జల శాఖ ఏ.డి. సుహాసిని తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు , ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో టాన్స్‌జెండర్ వ్యక్తుల ఆర్థిక పునరావాస పథకం కింద మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కలెక్టర్ హరిత లబ్ధిదారు లకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సం క్షేమ అధికారి డా.అడేపు బాస్కర్, సెక్షన్ ఫీల్ రెస్పాన్స్ ఆఫీసర్ రవి పసునుంటి పాల్గొన్నారు.



**పకడ్బందీగా ఇండ్ల గణన**

రాష్ట్రంలో చేపట్టనున్న జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవం తంగా నిర్వహించాలని రాష్ట్ర సెన్సెస్ డైరెక్టర్ భారతి హోళికేరి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, చార్జ్ అధికారులు, టెక్నికల్ ఇన్చార్జ్‌తో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్ రావు పాల్గొన్నారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీలు ఉన్నాయని, జనగణన కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. త్వరలో మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు మూడు రోజుల శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవరెడ్డి, ఉప గణాంక అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లా పేరు నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా యువజన క్రీడల అధికారి అష్పాక్ అహ్మద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి మడావి శేఖు, పీజీడీలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రజా వాణిలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమా వేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఏప్రిల్ 2న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించే గ్రామ సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించాలని, సభలో వచ్చే ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని తెలిపారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావడం హర్షనీయం

- మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన మంథని బార్ అసోసియేషన్



**మంథని, (జనంసాక్షి) :** న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావడం హర్షనీయమని మంథని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని శాసనసభలో అలాగే శాసనమండలిలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసినందుకు గాను రాష్ట్ర శాసనసభ వ్యవహారాల, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును మంథని బార్ అసోసియేషన్ తరపున బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి కలిసి శాలువాతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అకాల వర్షం, ఈదురు గాలికి రాలిన మామిడి

- ఆవేదనలో రైతులు
- ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరుతున్న రైతులు



**మంచిర్యాల ప్రతినిధి , (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి వర్షంతో పాటు భారీ ఎత్తున ఈదురు గాలులు రావడంతో మామిడికాయలు రాలి మామిడి పంట తీవ్రంగా నష్టాన్ని గురిచేసింది .మందమర్రి మండలం మామిడిగట్టులో రాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మామిడి పంట తీవ్రంగా దెబ్బ తింది .మామిడి పంట నేలరాలింది. చేతికొచ్చిన పంట చెట్ల నుంచి రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మామిడి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అకాల వర్షంతో ఈదురు గాలులతో వరి పంట అలాగే రాలిన మామిడి కాయల నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. దండేపల్లి మండలంలో వరి పంట పూర్తిగా అలాగే మందమర్రి మండలంలో భారీ ఎత్తున మామిడి పంట నేలరాలింది .సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పంట నష్ట తీవ్రతను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించి తమను ఆదుకోవాలని పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచన వేసి తమను ఆదుకోవాలని రైతు కోరారు.

# సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఉత్తమ సేవలు అందించాలి

- పారిశుధ్య పనులు నిత్యం చేయించాలి
- పన్నులు 100 శాతం వసూలు చేయించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి);** సిరిసిల్ల నూతన మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో మంగళవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. అందరి సహకారంతో ఇటీవల ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామని, నూతన సభ్యులందరికీ అభినందనలు తెలియజేసారు. బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపు, పారిశుధ్య పనులకు చెల్లింపులు, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్‌కు రావాల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని వెల్లడించారు. మున్సిపల్ వార్డ్ సభ్యులు తమ పరిధిలో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలని, అన్ని షాపులు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపాలిటీకి చెందిన ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులు అద్దెకు ఇచ్చేందుకు మరోసారి టెండర్లు పిలువాలని ఆదేశించారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. పార్క్ లు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. కొత్త చెరువులో మరమ్మత్తు పనులు వేగంగా చేయించాలని, ప్రజలు, పిల్లలు వచ్చేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. డీఆర్‌సీసీ కేంద్రం పక్కాగా నిర్వహిం చాలని, ఏబీసీ కేంద్రం వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సిరిసిల్ల ఖ్యాతి చాటేలా రగుడు జంక్షన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, త్వరలోనే వినియోగంలోకి రానున్నదని వెల్లడించారు. అమృత్ పథకం కింద తాగునీటి సమస్యకు పరిష్కారం రానున్నదని వివరించారు. తాగునీటి సమస్య రాకుండా వార్డు సభ్యులు, అధికారులు చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇట్టి సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ వ్యాపారులపై కంపెనీల దౌర్జన్యం

- నేడు బంద్‌కు పిలుపు :కరీంనగర్ జిల్లా సంపూర్ణ మద్దతు
- కరీంనగర్ జిల్లా చికెన్ సెంటర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి నవాబ్



**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర చికెన్ షాపుల ఓనర్ల సంఘం ఇచ్చిన నేడు బంద్ పిలుపుకు కరీంనగర్ జిల్లా చికెన్ సెంటర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కంపెనీలు మార్జిన్ ఇవ్వకుండా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయనే ఆరోపణలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. బుధవారం రోజు జరిగిన విలేఖర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎండి నవాబ్ మాట్లాడుతూ... మార్టిన్ (మార్జిన్) ఇవ్వని కొన్ని కంపెనీలు తమ దౌర్జన్యాన్ని కొనసాగిస్తూ.. చిన్న వ్యాపారులను నష్టాల్లోకి నెడుతు న్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో లాభాలు రావడం దూరంగా ఉండగా, వ్యాపారం కొనసాగించడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయానికి నిరసనగా 2026 ఏప్రిల్ 1, నుండి చికెన్ సరఫరా వ్యవస్థలో మార్పులు చేపడుతూ, కంపెనీలు విధించిన తక్కువ మార్జిన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరిం చాలని, సరైన మార్జిన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చికెన్ వ్యాపారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్.వి. రాంరెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.డి. యునస్, బాలాజీ, జాయింట్ సెక్రటరీ రహిం తదితరులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

**నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**


**మల్లాపూర్ (జనంసాక్షి):** మండలంలోని నిర్మాణంలో ఉన్న మంగళవారం రోజున ముత్యంపేట గ్రామంలోని నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ మంజూరైనా ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ పై ధరల నియంత్రణ ఇండ్లు లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు . ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెనుకబడి ఉన్నట్లయితే వేగవంతం పెంచాలని అధికారులకు ఆదేశించారు. గడువులోపు వారికి కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భవనాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిణామం కలిగి ఉండాలని లబ్ధిదారులకు మరియు నిర్మాణాన్ని సకాలంలో నిర్మించుకునేందుకు కావాల్సిన మేస్త్రీలు, కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని అన్నారు. దశలవారీగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలు మార్కింగ్, బెస్మెంట్, స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, హౌసింగ్ పిడి ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంపిడివో జగదీష్ గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**




**బోధన్, (జనంసాక్షి) :** వచ్చే ఏడాది జూలైలో అట్టహాసంగా జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం కూడా ఈ పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు పురమాయించిన పనులను వారు ఏమేరకు చేపట్టారు అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పుష్కర ఘాట్ కు వచ్చే మార్గాలలో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. గోదావరి పుష్కరాలకు త్రివేణి సంగమ ప్రాంతం అయినందున ఈ ఘాట్ వద్ద పుణ్య స్నానాల కోసం ప్రముఖులతో పాటు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలి వచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ఆయా మార్గాలలో అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణాలు సైతం చేపట్టాలన్నారు. వి.వి.ఐ.పీల కోసం హెలిప్యాడ్ ను నిర్మించాలని, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ కందకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెంజల్ మండల అధికారులతో సమావేశం అయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనాభా గణన ప్రక్రియల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహసీల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఉన్నారు.



# అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ఎస్సై ప్రమోద్ కుమార్ గౌడ్**

**పెద్దవంగర (జనంసాక్షి):** అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు ఎస్సై ప్రమోద్ కుమార్ గౌడ్ అన్నారు మంగళవారం మండలంలోని పోచారం గ్రామ శివారులో రెండు ఇసుక ట్రాకర్లను ప్రభుత్వ అనుమతి పత్రాలు అడగగా, ఏలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డాక్టర్ డ్రైవర్ బానోత్ గోపాల్, యాకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు. ఎస్సై తెలిపారు.



# రసాయన శాస్త్రంలో విస్తరణోపన్యాసం

- పర్యావరణ రంగాల్లో విస్తృత అవకాశాలు
- విద్యార్థులు పట్టుదలతో చదివి అందిపుచ్చుకోవాలలి
- ప్రొఫెసర్ డా. ఎ. సంతోషి
- ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి




**కొడంగల్ , (జనంసాక్షి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ లో కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన బి.ఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థులకు "డిటైల్డ్ స్టడీ ఆన్ ఫార్మకోకైనెటిక్స్ ఇన్ మెడిసినల్ కెమిస్ట్రీ" అను అంశంపై విస్తరణోపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వికారాబాద్ కు చెందిన రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎ.సంతోషి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా ఒక రసాయనాన్ని తక్కువ మోతాదులో శరీరానికి అందించినపుడు అది ఔషదంగా పనిచేస్తుందన్నారు. ఇంకా ఔషధ లక్షణాలు, ఔషధాన్ని శరీరంలోకి పంపించే వివిధ మార్గాలు, ఫార్మసీలో ఔషధాల మోతాదు, ఫార్మకోఫోర్, ఫార్మకోకైనటిక్స్-శోషణ, పంపిణీ, జీవక్రియ, ఔషధాల విసర్జన-విధానం, ఫార్మకోడైనమిక్స్, టాక్సికాలజీ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రసాయన శాస్త్ర విద్యార్థులకు ఎంతో భవిష్యత్తు ఉందని, వారికి ఫార్మా, మెటలర్జీ, పెట్రోకెమికల్, ఆహార శుద్ధి, క్వాలిటీ మేనేజ్మెంట్, పర్యావరణ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని, విద్యార్థులు పట్టుదలతో చదివి వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఆర్. శ్రీనివాస్, యం. హరిప్రియ, డా. వి. శ్రీధర్ కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

# మనల్ని ఎవ్వర్రా ఆపేది ?

- రాజోలిలో పట్టపగలే ఇసుక దందా
- ఏమాత్రం భయపడని ఇసుకాసురులు
- యథేచ్ఛగా తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు
- పట్టపగలే టిప్పర్ల అక్రమ ఇసుక రవాణా
- అధికారుల మౌనంపై తీవ్ర అనుమానాలు ?


పట్టపగలే అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్


తుంగభద్ర నది నుండి ఇసుక తరలిస్తున్న ఎద్దుల బండ్లు

**రాజోలి, మార్చి 31 (జనంసాక్షి) :** రాజోలిలో ఇసుక మాఫియా బరితెగిస్తున్నారు. మంగళవారం ఉదయం రాజోలి నుండి చుట్టుప్రక్కల గ్రామాలకు పట్టపగలే ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక టిప్పర్ల ద్వారా బహిరం గంగానే తరలిస్తున్న ఘటన స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. “మాకు అడ్డు ఎవరు మమ్మల్ని ఆపేది ఎవరు ?” అన్నట్టుగా నిర్భయంగా అక్రమ రవాణా కొనసాగుతుండటం గమనార్హం. కొన్నాళ్లు కనిపించి కనిపించనట్టు లోలోపల సాగిన అక్రమ దందా ప్రస్తుతం పట్టపగలే బహిరంగంగా మారిపోయింది. ఇసుకాసురులు ఏమాత్రం తోణకడం లేదు. మమల్ని ఎవరు ఆపేది అన్న రీతిలో తుంగభద్ర నదిని తోడేస్తున్నారు. ఎవరికి అందిన కాడికి వాళ్లు దోచుకోవడమే అన్నట్టు సాగిపోతుంది. మండల కేంద్రంలోని సహజ వనరుల దోపిడీ దందాను అడ్డుకునే నాథుడే లేకుండా పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందుకు అధికారుల అండదండలు మెండుగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఓవైపు ప్రభుత్వం ఇసుక అక్రమరవాణను అరికట్టాలని మొత్తుకుంటున్నా అక్రమార్కులు, అధికారులు వాటిని తుంగలో తొక్కేస్తున్నారు.

**పగలు ఎద్దుల బండ్లు..రాత్రి టిప్పర్లు**

ఒక్కపుడు అక్రమ ఇసుక రవాణాకు ట్రాక్టర్లను వాడేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో ఇసుక వ్యాపారులు ట్రెండ్ మార్చడంతో ఎద్దుల బండ్లతో ఇసుక రవాణా చేస్తున్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఎద్దుల బండ్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతుంది. పగటి వేళలో ప్రతిరోజు దాదాపు వందల సంఖ్యలో ఎద్దుల బండ్లు అక్రమ ఇసుక రవాణాకు తుంగభద్ర నది నుంచి ఇసుకాసురులు ఒక్కో ఎద్దుల బండికి రూ.600 చెల్లించి రాజోలి గ్రామాల శివారులో ఇసుక డంపులు నిల్వ చేయించి రాత్రి వేళలో టిప్పర్ల ద్వారా చుట్టూ ప్రక్కల గ్రామాలకు తరలించి లక్షల్లో రూపాయలు సంపాదిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

**అధికారుల అండతో ఇసుక రవాణా**

కొంత మంది అధికారుల అండతో ఇసుక రవాణా జోరుగా సాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకున్నా ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నిస్తే..అధికారుల అండదండలు ఉన్నాయని, ఇష్టం ఉన్నచోట చెప్పుకోండి అంటూ ఎదురు దాడికి దిగుతున్న సందర్భాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలే అతివేగంతో మిని టిప్పర్లు రోడ్లపై ప్రయాణిస్తుంటే ఏ ప్రమాదం జరుగుతు ందోనని ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు. ఇసుక దందాకు అధికారులు సహకరిస్తు న్నారని ప్రజలు బాహటంగానే చర్చించుకుం టున్నారు. ఎవరైనా అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన అధికారులు, పోలీసులు చూసీచూడట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇసుక రవాణాకు సహకరిస్తున్న అధికారులపై విచారణ చేసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఐస్ క్రీమ్ కేంద్రాలపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు





**తాండూరు (జనంసాక్షి):** ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా కల్తీ ఐస్ క్రీమ్స్ తయారు చేస్తున్న కేంద్రాలపై వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తన బృందంతో కలిసి తాండూరు పట్టణంలోని పలు తయారీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా నిల్వ ఉంచిన కల్తీ ఐస్ క్రీమ్స్‌తో పాటు, తయారీకి ఉపయోగిస్తున్న ప్రమాదకరమైన రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో వెల్లడైన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన మహ్మద్ అఫ్జర్ (35) అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా, ఐస్ క్రీమ్ తయారీలో వినియోగించకూడని పారిశ్రామిక రంగులు , గడువు ముగిసిన ముడి సరుకులను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. అతని వద్ద ఉన్న కల్తీ సామగ్రిని సీజ్ చేశారు. అదేవిధంగా, ఎస్బీఐ కాలనీకి చెందిన డి. శ్రీనివాస్ (47) సాయిపూర్ రోడ్డులో నిర్వహిస్తున్న ‘శ్రీ నందిని ఐస్ క్రీమ్’ కేంద్రంలో జరిపిన తనిఖీల్లో నాణ్యత లేని, హానికరమైన పారిశ్రామిక రంగులు , గడువు ముగిసిన ముడి సరుకులను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రంగుల తో కూడిన కల్తీ ముడి సరుకుల నిల్వలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టు బడిన నిందితులతో పాటు కల్తీ ముడి పదార్థాలతో కూడిన ఐస్ క్రీమ్‌లను తదుపరి చర్యల నిమిత్తం తాండూరు పోలీసులకు అప్పగించి, వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ ముఖ్యంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అధిక లాభాల కోసం కొంతమంది వ్యాపారులు చిన్నారులు, సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతులు లేకుండా, అపరిశుభ్ర వాతావరణంలో, ప్రమాదకరమైన రంగులు కలిపి తయారు చేసే ఇలాంటి ఐస్ క్రీమ్స్ వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కల్తీ వ్యాపారాలపై నిరంతరం నిఘా ఉంటుంది. ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమా ణాలు పాటించని వారిపై, కల్తీకి పాల్పడే వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటాం,” అని హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా కల్తీ జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

# ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**నగర ప్రజలకు కమిషనర్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ పిలుపు**

**హైదరాబాద్, (జనంసాక్షి) :** 2026-2027 సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026--27)కి సంబంధించిన మొత్తం ప్రాపర్టీ టాక్స్‌ను ముందుగానే చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభించనుందన్నారు .గత సంవత్సరాల బకాయిలపై ఈ రాయితీ వర్తించదన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు 2026-2027 ఆర్థిక సంవత్సరంకు గానూ ముందుగానే తమ ఆస్తి పన్ను చెల్లించి ప్రభుత్వం కల్పించిన 5% రాయితీని పొందాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు.

# పంటలు పొట్ట దశలో ఉన్నందున నీటిని విడుదల చేయాలి

- లేదంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**కొల్చారం, (జనంసాక్షి) :** పంటలు పొట్ట దశలో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని రైతుల గోడును అర్థం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుక్కాపూర్ మంజీరా పరివాహ ప్రాంతంలో పంట పొలాలను అలాగే మంజీరా ఎండిపోయిన దృశ్యాలను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. మంజీరా నదిలో చుక్కనీరు లేకపోవడంతో ఎడారి ప్రాంతాన్ని తలపిస్తుంది సింగూరు ప్రాజెక్టు నుండి ఘనాపూర్ ఆయకట్టుకు 0.3 టి యం.సిల నీటిని విడుదల చేసి సుమారు లక్ష ఎకరాలలో పంటలను కాపాడి ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. మంగళవారం తుక్కాపూర్ వాగులో మండల పార్టీ నాయకులతో కలిసి మం జీరా నదిని పరిశీలించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంవత్సరం రైతులకు అవసరనుగుణంగా నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించే అవకా శం కల్పించారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభు త్వం నీటి సమస్యను పట్టించుకోవడంలేదని ఆగ్ర హం వ్యక్తం చేశారు ఈ సీజన్లో సింగూరు నుండి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో తుక్కాపురం సర్పంచ్ దొడ్ల ఆంజ నేయు లు ఉపసర్పంచ్ ఆరే రవీందర్ కొల్చారం మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్తా, కొల్చారం మండలం యువత విభాగం అధ్యక్షులు



కోనాపూర్ సంతోష్ రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గౌరీ శంకర్ శ్రీనివాసరెడ్డి వెంకట్రాంరెడ్డి ధనరాజ్ గోదావరి సాయిని సిద్ధి రాములు సర్పంచులు పుట్లగళ్ల మోహన్ వినోద్ నాయక్ సిన్నారపు రాజశేఖర్ పార్టీ కార్యకర్తలు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య తీరేనా ?

- గంటల తరబడి కరెంటు కోతలు
- కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బంది



**మర్పల్లి (జనంసాక్షి):** ఒకవైపు రోజురోజుకు ఎండలు ముదిరిపోతున్నాయి. మరోవైపు కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతు న్నారు. మర్పల్లి మండల కేంద్రంలో విద్యుత్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వేస వికాలం రాకతో విద్యుత్ వినియోగం పెరుగు తుందని ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిం చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచి పోవడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. సోమవారం రాత్రి గంట ల తరబడి విద్యుత్తు లేదు అదేవిధంగా చిటికీమాటికీ కరెంటు వచ్చి పోతుండడంతో ప్రజలు సతమతమయ్యారు. ఇప్పటికైనా సం బంధిత ఏఈతన విధులను బాధ్యతగా నిర్వ హించి, మండలంలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన మరమ్మ తులు, నిర్వహణ వెంటనే చేపట్టి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని కోరుతున్నారు.

## జిల్లాలో పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది

**జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు**



**మెదక్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఏప్రిల్ 01 నుండి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ - 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## కబ్జాకు గురైన ప్లాట్లను కాపాడాలి

**మైనార్టీ కాలనీవాసుల ఆవేదన**

**శంకర్‌పల్లి, మార్చి 31(జనంసాక్షి) :** శంకర్పల్లి మున్సిపల్ కేంద్రంలో 1996 వ సంవత్సరంలో సర్వేనెంబర్ 235 లో రెండు ఎకరాల భూమిలో అప్పటి ప్రభుత్వం పేద మైనార్టీ మరియు ఇతరులకు 60 గజాల చొప్పున మొత్తం 69 ప్లాట్ల ను చేసి పేదవారికి పట్టాలు అందజేశారు. అయితే గతంలో సర్టిఫికెట్ పొందిన వారు సుమారు 40 మంది ఇండ్లను నిర్మించుకున్నారు. మిగతావారు తమకు ఇచ్చిన ప్లాట్లను ఖాళీగా వదిలివేయడంతో కొన్ని రోజుల తర్వాత ఖాళీగా ఉన్న ప్లాట్లలో కొన్నింటిని అప్పటి నాయకులు మరియు అధికారులు కలిసి తమ కిష్టానుసారం పట్టా నెంబర్లు మార్చి కబ్జా చేసి విక్రయించారు. అప్పట్లో ఇతర గ్రామాలలో నిర్మించే కొంతమంది ఉద్యోగాలు చేసుకుంటూ శంకర్పల్లిలో నివసించగా,వారికి కూడా ఫ్లాట్లు కేటాయించడంతో తిరిగి వారు వారి సొంత ఊర్లకు వెళ్లడంతో కొంతమంది రియాల్టర్లు వారి వద్ద తక్కువ రేటుకు ప్లాట్లను కొనుగోలు చేసి, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పట్టా నెంబర్లు మార్చి నకిలీ సర్టిఫికెట్లను తయారు చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారులు,అప్పట్లో అధికారులు ఇచ్చిన ఒరిజినల్ పట్టాలు ఉన్నవారికి ప్లాట్లను ఇవ్వాలని,సర్టిఫికెట్లు లేని వారి నుండి వెంటనే ప్లాట్లను అధికారులు తీసుకొని, ప్లాట్లను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

# పాలిసెట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం టి-సాట్ డిజిటల్ లెసన్స్

- ఏప్రిల్ ఒకటో తేదీ నుండి మే 12వ వరకు ప్రసారాలు
- రోజుకు రెండు గంటలు-42 రోజులు-84 పాఠ్యాంశాలు
- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



**హైదరాబాద్, (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులకు ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి టి-సాట్ డిజిటల్ లెసన్స్ అందించనుందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మే 13వ తేదీన నిర్వహించే పాలిసెట్ పరీక్ష కోసం ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి రోజుకు రెండు గంటల చొప్పున 42 రోజుల పాటు 84 ఎపిసోడ్స్ ప్రసారం చేయను న్నట్లు వివరించారు. మ్యాథ్స్, కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ సబ్జెక్టుల్లో అనుభవం కలిగిన లెక్చరర్స్ బోధించిన పాఠ్యాంశాలు విద్య ఛానల్‌లో సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు, రాత్రి తొమ్మిది నుండి 11 గంటల వరకు నిపుణ ఛానల్ లో పున: ప్రసారమౌతాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. పదవ తరగతి లేదా తత్సమానమైన పరీక్ష పాసైన విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు హాజరై మెరుగైన ఫలితాలు సాధించేందుకు టి-సాట్ పాఠ్యాంశ ప్రసారాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, పీవీ నర్సిం హ్మారావు పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ విశ్వ విద్యాలయాల్లో అర్హత సాధించేందుకు విద్యార్థుల కు ఎంట్రన్స్ ఉపయోగ పడుతుందన్నారు.

# మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం దేశానికే ఆదర్శం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**శంషాబాద్, (జనంసాక్షి):** మహిళల ఆర్థిక స్వావలంబనకు మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం ఎంతో ఉపయోగపడుతోందని, దేశా నికే ఆదర్శంగా నిలిచిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రూ. 10,000 కోట్ల మైలురాయిని చేరిన సందర్భంగా శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన ఈ పథకం ద్వారా కోట్లాది మహిళలు ఉచితంగా ప్రయాణి స్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాల్మకుల్ సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్ తో కలిసి పలువురు మహిళా ప్రయాణికులను సన్మానించి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# ఇద్దరు కొడుకులను చంపి తల్లి ఆత్మహత్య

- కుటుంబ తగాదాలతో కూకట్‌పల్లిలో దారుణం
- భర్త రెండో వివాహం చేసుకోవడంతో మనస్తాపం
- 12, 10 ఏళ్ల కుమారులు కార్తీక్, కౌశిక్ మృతి

**హైదరాబాద్, (జనంసాక్షి) :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ తన ఇద్దరు కుమారులను చంపేసి, ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆ మహిళ తన ఇద్దరు కుమారులు కార్తీక్ (12), కౌశిక్ (10)తో కలిసి రాఘవేంద్ర కాలనీలో నివసిస్తోంది. కుటుంబ తగాదాల కారణంగా ఆమె భర్త ప్రవీణ్ దూరంగా ఉంటున్నాడు. ఇటీవలే అతను రెండో వివాహం చేసుకున్నట్లు తెలిసి, మహిళ తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఆమె తన ఇద్దరు కొడుకులను చంపేసి, ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకుంది. దీనిని గమనించిన స్థానికులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఇంతటి దారుణానికి పాల్పడ టానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నారు.

# పునరావాసం పునరుద్ధరణ పథకం కింద గ్రామసభ

- రేడియల్ రోడ్డు 2 నిర్మాణం
- రైతులకు భరోసా కల్పించిన అడిషనల్ కలెక్టర్




**జిల్లేడు చౌదరి గూడెం (జనంసాక్షి):** జిల్లేడు చౌదరిగూడా మండల పరిధి అచ్చంపేట తుమ్మలపల్లి రెవెన్యూ పరిధిలో గల రైతుల భూములు రేడియల్ రోడ్డు2లో పోవడం జరుగుతుంది ఇందులో పునరావాసం పున రుద్ధరణ పథకంలో భాగంగా రైతులకు అధి కార యంత్రాంగం గ్రామ సభ నిర్వ హించి ంది ఇందులో అడిషనల్ కలెక్టర్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ రేడియల్ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతులు ఆందోళన చెంద వద్దు తగిన పారితోషికం ప్రభుత్వం చెల్లిస్తుం దని పేర్కొన్నారు భూములు పోగొట్టుకున్న రైతుల కు భూములు కల్పించాలని రైతులు మాట్లాడ క అలా భూములు కల్పిం చడానికి కుదరదు అని అడిషనల్ కలెక్టర్ పేర్కొ న్నారు. రైతులు భూమి కోల్పోతు న్నందుకు ఎకరానికి ఇంత చెల్లిస్తామని అధికారులు చెప్పలేకపోయారు రైతులంతా సందిగ్ధంలో పడ్డారని పేర్కొన్నా రు. రేడియల్ రోడ్డులో మొత్తం 31 ఎకరం 5 గుంటల భూమి పోతుందని అధికారులు నిజనిర్ధారణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత. తాసిల్దార్ జగదీశ్వర్. సిఐ. భూ బాధితులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా అవసరాల కోసమే రోడ్ల నిర్మాణం

- భూసేకరణలో రైతులు సహకరించాలి
- అన్యాయం జరగకుండా చూస్తాం: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**కొందుర్గు (జనంసాక్షి):** ప్రజా అవసరాల దృష్ట్యా చేపట్టే రోడ్ల నిర్మాణానికి ప్రతి రైతు సహకరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి కోరారు. మంగళవారం కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామంలో నిర్వహించిన రేడియల్ రోడ్డు భూసేకరణ గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల కోసం భూములిచ్చే ప్రతి రైతుకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని, ఎవరికీ అన్యాయం జరగకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు.

**గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంకుల తనిఖీ**

అనంతరం కొందుర్గులోని భవాని గ్యాస్ ఏజెన్సీని అదనపు కలెక్టర్ సందర్శించారు. గ్యాస్ సరఫరా తీరును అడిగి తెలుసుకున్న ఆయన, వినియోగదారులకు గ్యాస్ కొరతపై అవగాహన కల్పించాలని సూచించారు. దేశంలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. అక్కడి నుండి ఇండియన్ ఆయిల్ జీఎం పటేల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెట్రోల్ కేవలం వాహనదారులకే పోయాలని, బాటిళ్లలో అమ్ముతూ నిల్వ ఉంచినట్లు సమాచారం అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, కొందుర్గు తహశీల్దార్ మీర్ అజాం అలీ, ఎస్ఐ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలను పాటించడంతోనే ప్రమాదాల నివారణ

**చేవెళ్ల ఎస్ఐ వనం శిరీష**



**చేవెళ్ల, (జనంసాక్షి):** ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమా దాలను తగ్గించవచ్చని చేవెళ్ల ఎస్ఐ వనం శిరీష తెలిపారు. తెలంగాణ పోలీసుశాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నాంచేరి గ్రామంలో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో జరిగిన ఈ ర్యాలీలో పోలీసు లు, యువకులు పాల్గొని హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడ పకూడదనే అంశాలపై అవగాహన కల్పిం చారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ప్రమా దాలు ఎక్కువగా జరుగుతున్నాయని, చిన్న చిన్న జాగ్రత్తలతో ప్రాణనష్టం చవచ్చునిసూచించా రు. ప్రతి వహనదారులు ఇన్సూ రెన్స్ తప్ప నిసరిగా చేయించుకోవాలని తెలిపారు.

# నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

- లోక్‌సభలో శాశ్వత రాజధానిగా తీర్మానం.. ఆమోదం
- ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం
- అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా రూపుదిద్దుకుంటుంది : టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు



**న్యూఢిల్లీ, (జనంసాక్షి) :** కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు కాబోతున్న నేపథ్యంలో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధం చేసే బిల్లు నేడు లోక్‌సభ ముందుకు వస్తోంది. ఈ బిల్లు ఆమోదం తర్వాత అమరావతి తెలుగువారి శాశ్వత రాజధా నిగా వెలుగొందనుంది. టీడీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, “అమరావతి శాశ్వత రాజధాని అవుతుందని లోక్ సభలో తీర్మానం ఆమోదం తర్వాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుంది” అన్నారు. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకు మరింత భరోసా వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతుల స్వచ్ఛంద త్యాగం గుర్తు చేశారు. రైతులు నమ్మకంతోనే రాజధానికి భూములు ఇచ్చారని, 30 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చిన రైతుల త్యాగం గుర్తు చేశారు. గత జగన్ ప్రభుత్వం రాజ ధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని గుర్తు చేశారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, “అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. దేశంలో ఎక్కడా ఇలా జరగలేదు” అన్నారు. అమరావతి నిర్మాణంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని ఎంపీలు విమర్శించారు. వైసీపీ నేతలు రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు జగన్‌కు ఇది చెంపపెట్టు అన్నారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని, కి రాజ ధానిపై అసలు స్పష్టత లేదని ఎంపీలు ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతు లకు మాట ఇచ్చారని, ఇప్పుడు దానిని నిల బెట్టుకున్నారని ఎంపీలు వివరించారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిం దని, ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి కోసం ప్రాణత్యాగం చేసిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు ప్రకటించిన ఎంపీలు, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణమని ఆయనలు పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం తర్వాత అమరావతి శాశ్వత రాజధానిగా రూపుదిద్దుకోవడం ఖాయమని టీడీపీ ఎంపీలు విశ్వాసం వ్యక్తం చేశారు.

# బెంగుళూరులో యువ టెక్కీ దంపతుల ఆత్మహత్య




- యువకుడిది సిద్దిపేటగా గుర్తింపు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

బెంగళూరు (జనంసాక్షి)

బెంగళూరులో విషాదం జరిగింది. తెలంగాణ సిద్ధిపేటకు చెందిన యువ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముందుగా భర్త గదిలో ఆత్మహత్య చేసుకోగా, ఇది తెలిసిన భార్య వెంటనే బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని సిద్ధిపేట ప్రాంతానికి చెందిన భానుచందర్ రెడ్డి (32), అతడి భార్య బీబీ షాజియా సిరాజ్ (31) ఇద్దరూ కలిసి బెంగళూరులోని కోతనూర్ ఏరియాలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వీరిద్దరూ వృత్తిపరంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. వీరి పెళ్ళై తొమ్మిది సంవత్సరాలు అవుతోంది. మొదట ఇద్దరూ లివ్ ఇన్ రిలేషన్‌లో ఉండి, ఆ తర్వాత కొంతకాలానికి పెళ్లి చేసుకున్నారు. అయితే, పెళ్ళైనప్పటి నుంచి వీరిద్దరి మధ్యా విబేధాలు తలెత్తాయి. దీంతో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో సోమవారం భానుచందర్ రెడ్డి తన గదిలోపల తలుపు పెట్టుకుని, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాజియా సిరాజ్ ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన రాలేదు. దీంతో ఆమె సెక్యూరిటీతోపాటు చుట్టుపక్కల వాళ్లను పిలిచింది. వారు వచ్చి తలుపు బద్దలుకొట్టి చూసేసరికి భానుచందర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది చూసి దిగ్భ్రాంతికి గురైన భార్య సాజియా వెంటనే అదే అపార్ట్‌మెంట్ 17వ అంతస్థు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు జరుపుతున్నారు. వీరి మృతికి వైవాహిక కలహాలతోపాటు భాను చందర్ రెడ్డి అనారోగ్యం కూడా ఒక కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి విచారణ అనంతరం అసలు విషయాలు తెలిసే అవకాశం ఉంది. అధిక ఒత్తిడి, అనారోగ్యం, మానసిక సమస్యలు తదితర కారణాలేమైనా అయ్యుండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తే తప్ప ఈ దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని పోలీసులు వివరించారు. మరోవైపు మృతుల తల్లిదండ్రులు ఇప్పటికే బెంగళూరు చేరుకున్నారు. వీరి మృతితో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# హైదరాబాద్‌లో జయలలిత ఇల్లు సీజ్



- ఇంటిపన్ను చెల్లించకపోవడంతో చర్యలు


**హైదరాబాద్, మార్చి31 (జనంసాక్షి) :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన ఇల్లు సీజ్ చేశారు. ఇంటిపన్ను బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆమె ఇంటిని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆమె ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఫిబ్రవరిలోనే ఆస్తిపన్ను బకాయిలపై నోటీసులు జారీ చేశారు. అయితే జయలలితకు సంబంధించివారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ క్రమంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న జీ?4 భవనాన్ని సీజ్ చేశారు. ఈ ఇంటికి సంబంధించి 2017 నుంచి సుమారు రూ.83 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని సమాచారం. సోమవారం జీహెచ్ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది జయలలిత ఇంటిని సీజ్ చేశారు. మార్చి 31 వరకు ఓటీఎస్ స్కీమ్ అందుబాటులో ఉందని, ఆ రాయితీ పోగా మొత్తం రూ.82,91,822 మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జయలలితకు సంబంధించిన ఈ భవనంలో గతంలో ప్రైవేట్ కార్యాలయాన్ని నిర్వహించారు. అయితే ఈ భవనాన్ని 2017 నుంచి నివాసానికి వాడుకుంటున్నామని.. కాబట్టి రెసిడెన్షియల్‌గా మార్చాలని జీహెచ్ఎంసీ అధికారుల్ని జయలలిత మేనల్లుడు, చెన్నైకి చెందిన దీపక్ జయకుమార్ గతంలో కోరారు.

# ఇప్పపూవు గురించి మాట్లాడితే దుష్ప్రచారమా?



- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి31 (జనంసాక్షి) :** తను ఇప్పపూవు సారా గురించి చెబితే తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. కల్తీసారా తాగకండి అంటే తనను బద్నాం చేస్తారా అంటూ ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ అనేది లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదివాసీలు లిక్కర్ తయారుచేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే కరెక్టా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పసారాకు 3 వేల ఏళ్ల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పసారా ఇండియన్ లిక్కర్ అని ఆయన అభివర్ణించారు.ఇప్పసారాకు శతాబ్దాల చరిత్ర ఉందని అనిరుధ్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. గతంలో దీన్ని తాగి 110 ఏళ్లు బతికారని ఆయన వివరించారు. అనిరుధ్ వ్యాఖ్యలపై ప్రజలు తమదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా సినీతారలపై అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీతారలు కూడా టెస్ట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. వారిపైనే అధికంగా డ్రగ్స్ ర్యూమర్స్ ఉన్నాయని గుర్తుచేశారు. కానీ రాజకీయ నాయకులపై ఈ పుకార్లు తక్కువేనన్నారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలంటూ సినీనటులకు సూచించారు. డ్రగ్ టెస్ట్‌లో నెగెటివ్ వస్తేనే షూటింగ్స్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ బారినపడిన వారు చిత్ర పరిశ్రమలలోనే అధికంగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం రేవంత్ మద్యం, ధూమం వంటివాటికి దూరంగా ఉంటారన్నారు. తాము కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నామని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.



# పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**నెల్లూరు, మార్చి31 (జనంసాక్షి) :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. వెంకటాచలం-మనుబోలు మధ్య కొమ్మలపూడి జంక్షన్ వద్ద ఈ ఘటన జరిగింది. గూడ్స్ రైలుకు ఉన్న పాల ట్యాంకర్ ట్రాక్‌పై అడ్డంగా పడిపోయింది. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# కాంగ్రెస్ పార్టీ బుల్లెట్‌ను నమ్మలేదు.. బ్యాలెట్‌నే నమ్మింది

- కమ్యూనిస్టు పార్టీలకు.. మావోయిస్టుల ఉద్యమానికి తేడా తెలియదా?
- మీరు ఏ పార్టీతో పొత్తుపెట్టుకున్నా తప్పులేదా?
- అమిత్ షాపై నిప్పులు చెరిగిన ఎంపీ డా.మల్లు రవి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు.. కమ్యూనిస్టు పార్టీలకు.. మావోయిస్టుల ఉద్యమానికి తేడా తెలియదని.. నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ బుల్లెట్‌ను నమ్మలేదని.. బ్యాలెట్‌నే నమ్మిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎవ్వరితో పొత్తు పెట్టుకున్నా.. రాజ్యాంగానికి లోబడే వ్యవహరించిందని వివరించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ మల్లు రవి మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ పార్లమెంట్ సెషన్ ఏప్రిల్ రెండో తేదీన ముగుస్తుంది. ఈ సెషన్‌లో ముఖ్యంగా మావోయిస్టుల లొంగుబాటు, ఆపరేషన్ కగార్‌పై చర్చ జరిగింది. మావోయిస్టులు అంతా సరెండర్ కావాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయుధాలు పట్టుకొని రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రభుత్వం మీద పోరాటం చేస్తున్నారు కాబట్టి.. సరెండర్ కాకపోతే మీరు ఏ ఆయుధాలతోటి ప్రభుత్వం మీద పోరాటం చేస్తున్నారో.. అదే ఆయుధాలతోని మీ మీద కూడా పోరాటం చేస్తామని హెచ్చరించింది. ఈ మార్చి నేలాఖరు లోపల మావోయిస్టులు లేకుండా చేస్తామని హోం మంత్రి అమిత్ షా స్టేట్మెంట్ ఇచ్చారు. మావోయిస్టుల విషయంలో గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏం జరిగిందో.. ఏ రకంగా మావోయిస్టు రహిత భారత దేశంగా మారిందనే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న పార్లమెంటులో మాట్లాడారు. ఈ మావోయిస్టుల మీద జరిగినటువంటి చర్చలో కాంగ్రెస్ పార్టీ తరఫున నేను కూడా మాట్లాడాను. మావోయిస్టులకు లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజమ్ అని పేరు పెట్టారు. దీన్నే నక్సలిజం, మావోయిజం అని అంటున్నారు. దీని మీద అమిత్ షా మాట్లాడుతూ.. నక్సలైట్స్ వల్ల ఎంత భూభాగం వారి ఆధీనంలోకి పోయింది, ఎంతమంది ప్రజలు వారి ఆధీనంలోకి పోయారు, ఏ రకంగా ప్రజా కోర్టులు పెట్టి ప్రభుత్వానికి ఛాలెంజ్‌గా నిలిచారు, ఎంతమంది సీఆర్పీఎఫ్ పోలీస్ అఫీషియల్స్ నక్సలైట్ల కాల్పుల్లో చనిపోయారు, ఏ రకంగా రాజకీయ నాయకులు చనిపోయారు.. ఈ లెక్కలన్నీ ఇచ్చారు. ఈ లెక్కలపై మాకేం అభ్యంతరం లేదు. కానీ ఈ లెక్కలు చెబుతూ అమిత్ షా.. ఇందిరా గాంధీ పేరును పదేపదే ప్రస్తావించారు. గద్దర్ ఆయుధాలతో ఉన్నప్పుడు రాహుల్ గాంధీ ఆయనతో వేదిక పంచుకున్నట్టు అమిత్ షా క్రియేట్ చేశారు. ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ ప్రతిష్టను దెబ్బతీసేలా అమిత్ షా మాట్లాడారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా రాజ్యాంగాన్ని గౌరవిస్తూనే.. రాజ్యాంగానికి లోబడి పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించింది. బ్యాలెట్ పేపర్ ద్వారానే అధికారాన్ని సాధిస్తామని కాంగ్రెస్ పార్టీ బలంగా నమ్ముతుంది. ఇదే విషయాన్ని పార్లమెంటులో కూడా నేను ప్రస్తావించాను. బుల్లెట్‌ను నమ్ముకొని అధికారం సాధిస్తామని కాంగ్రెస్ పార్టీ ఏనాడు నమ్మదు. ప్రజాస్వామ్యయుతంగా బ్యాలెట్ ద్వారానే అధికారాన్ని సాధించాలని కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది. స్వాతంత్రం రాకముందు కూడా అహింసా మార్గంలోనే పోరాటం చేశాం. స్వాతంత్రం వచ్చాక రాజ్యాంగం ప్రకారం.. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసింది. ఆయుధాలు పట్టుకొని అధికారం సాధించాలని ఆలోచనకు కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకం. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో దాదాపు 30 ఏళ్లు బ్యాలెట్ ద్వారానే కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అదే రకంగా కేరళ రాష్ట్రంలో కూడా బ్యాలెట్ ద్వారానే సీపీఐ, సీపీఎం పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అంతేకానీ ఆయుధాలు చేతబట్టి బుల్లెట్‌ను నమ్ముకొని ఏ రోజు రాజకీయం చేయలేదు. బ్యాలెట్‌ను నమ్ముకున్న పార్టీలతో.. ఏ పార్టీ అయినా పొత్తులో ఉండవచ్చు. రాజకీయం చేయవచ్చు. జనతా పార్టీ ఏర్పడ్డ సమయంలో సీపీఐ, సీపీఎం కూడా ఆ పార్టీతో ఉన్నాయి. ఆ రోజుల్లో బీజేపీ, జన్‌సంఘ్ కూడా ఆ పొత్తులో ఉన్నాయి. ఆ విషయాన్ని మాత్రం నిన్న అమిత్ షా ప్రస్తావించలేదు. మీరు సీపీఐ, సీపీఎం పార్టీలతో కలిస్తే తప్పులేదు.. కానీ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీ కలిస్తే తప్పా.. మీరు ఏ పార్టీతో అయినా పొత్తు పెట్టుకోవచ్చు.. కానీ వేరే వారు పెట్టుకుంటే తప్పు అవుతుందా.. గతాన్ని మర్చిపోయి అమిత్ షా ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. దేనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఎంపీ డా. మల్లు రవి వ్యాఖ్యానించారు.

# మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 10 వేల కోట్ల ఆర్థిక వెసులుబాటు

- అభినందన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- ఆర్టీసీని కాపాడుకుంటూనే సంక్షేమ పథకాల అమలు: మంత్రి పొన్నం ప్రభాకర్
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం: మంత్రి సీతక్క




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో మహిళా సాధికారత దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం వేసిన అడుగులు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు 290 కోట్ల సార్లు ప్రయాణించి, తద్వారా 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించాం. మహిళలు ఆదా చేసుకున్న ఈ రూ. 10 వేల కోట్లు వారి కుటుంబ ఆర్థిక అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగపడతాయి. కేవలం బస్సు ప్రయాణమే కాకుండా, మహిళలను లక్షాధికారులను చేయడమే మా లక్ష్యం. రాబోయే 3 ఏళ్లలో మహిళా సంఘాలకు రూ. లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలు అందించబోతున్నాం. మహిళలు సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది," అని పేర్కొన్నారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర మరువలేనిది. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులలో 40 లక్షల మంది మహిళలే ఉండటం గొప్ప విషయం. ఆర్టీసీని కాపాడుకుంటూనే మహిళలకు ఈ సదుపాయం కల్పిస్తున్నాం. ఇప్పటికే ఆర్టీసీకి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తోంది. కొత్త బస్సులు, కొత్త రూట్ల ఏర్పాటుతో సంస్థను మరింత బలోపేతం చేస్తాం," అని హామీ ఇచ్చారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణాన్ని విమర్శించే వారికి మహిళలు తమ తిరుగుబాటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు వారికి అప్పగిస్తున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించేది లేదు," అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మహిళలు పొదుపు చేసుకున్న రూ. 10,000 కోట్ల మెగా చెక్కును మంత్రులు ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్, మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, సెర్ప్ సీఈవో దివ్య, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్టీసీ ఈడీలు సి హెచ్. వెంకన్న, ఖుస్రో షా ఖాన్ , రాజశేఖర్ పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వేలాది మంది మహిళలు పాల్గొని ఉత్సాహంగా ఈ వేడుకను జరుపుకున్నారు.


# 2న హనుమాన్ జయంతి హైదరాబాద్‌లో భారీగా శోభాయాత్ర

- సమీక్షించిన వివిధ శాఖల అధికారులు


**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** ఏప్రిల్ 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో అత్యంత వైభవంగా 'వీర హనుమాన్ విజయ యాత్ర' నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గత 22 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ భారీ శోభాయాత్ర.. ఈ ఏడాది కూడా కర్మన్ ఘాట్ నుండి ప్రారంభమై గౌలిగూడ రామ్ మందిరం చేరుకుంటుంది. అక్కడి నుండి సికింద్రాబాద్ లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఈ యాత్ర సాగనుంది. ఈ భారీ యాత్రను పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, వీహెచ్‌పీ / భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు. యాత్ర సాగే మార్గంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం అధికారులు గౌలిగూడ రామ్ మందిరం నుండి అఫ్జల్ గంజ్ మీదుగా తాడ్ బండ్ వరకు రూట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్, పలు హిందూ సంఘాల నాయకులు పోలీసులకు కొన్ని ముఖ్యమైన విజ్ఞప్తులు చేశారు. గతంలో అబిడ్స్ చౌరస్తా వంటి ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి యాత్రకు ఆటంకం కలిగించారని, ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అలాగే యాత్ర ముగిసే వరకు ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను, అలంకరణలను తొలగించవద్దని విన్నవించారు. గణేశ్ ఉత్సవాల తరహాలోనే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలకు కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా పండుగ వాతావరణంలో జరుపుకునేలా సహకరించాలని అధికారులను కోరారు.

# మంచిరేవులలో నాగిరెడ్డికుంట కబ్జా

- రంగంలోకి దిగి ఫెన్సింగ్ వేసిన హైడ్రా




**హైదరాబాద్, మార్చి31 (జనంసాక్షి) :** భాగ్యనగరంలో ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తున్న వారిపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. ప్రజల ఫిర్యాదుల మేరకు స్పందిస్తూ, రియల్ ఎస్టేట్ మాఫియా , అక్రమ కట్టడాల నుంచి కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటోంది. రాజేంద్రనగర్ పరిధిలోని మంచిరేవుల నాగిరెడ్డి కుంట చెరువు వద్ద రియల్ ఎస్టేట్ సంస్థలు చేస్తున్న భారీ అక్రమాలను హైడ్రా అడ్డుకుంది. చెరువు ఉనికిని మాయం చేసేందుకు చుట్టూ టిన్ షీట్లు కప్పి లోపల కబ్జా చేసే ప్రయత్నాన్ని అధికారులు భగ్నం చేశారు. అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ఇది ప్రభుత్వానికి చెందిన చెరువు స్థలం అని తెలియజేస్తూ హైడ్రా బోర్డులను ప్రతిష్టించారు. ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణమవుతున్న గండిమైసమ్మ-మియాపూర్ ప్రధాన రహదారిపై హైడ్రా కీలక చర్యలు తీసుకుంది. 150 ఫీట్ల వెడల్పు ఉండాల్సిన ఈ రహదారిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన 10 షాపులను అధికారులు కూల్చివేశారు. ఈ ఆక్రమణల వల్ల వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. అయితే, ఈ కూల్చివేతలు ఆకస్మికంగా కాకుండా, రెండు నెలల ముందే నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారమే నిర్వహించినట్లు హైడ్రా వెల్లడించింది. దీనితో ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి లభించింది. ఘటకేసర్ పరిధిలోని అవుషాపూర్‌లో 1440 గజాల విలువైన పార్కు స్థలాన్ని హైడ్రా రక్షించింది. ఒక లేఅవుట్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు అక్రమార్కులు ప్లాట్లుగా మార్చి అమ్మేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న హైడ్రా బృందం వెంటనే రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించింది. ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి, ఇది ప్రభుత్వ పార్కు స్థలమని బోర్డులు ఏర్పాటు చేసింది.



# సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాల్సిందే..

- అసెంబ్లీలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** నేటి సమాజంలో సోషల్ మీడియా మానవత్వం మంట కలిసే విధంగా మారిందని ఇలాంటి సోషల్ మీడియాను కంట్రోల్ చేయాల్సిందేనని అసెంబ్లీలో షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు భారతదేశం ప్రపంచ దేశాలలో కెల్లా సంస్కృతి సాంప్రదాయం కలిగిన దేశమని ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగం పట్ల విశ్వాసంతో చట్ట ప్రకారం నడుచుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ (19) ప్రకారం ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉందని కానీ సోషల్ మీడియా ద్వారా మానవత్వం మంట కలిసే విధంగా మార్చుకోకూడదని ఇలాంటి సోషల్ మీడియాను కంట్రోల్ చేయడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురావాలని పట్టుబట్టారు సోషల్ మీడియా ద్వారా సమాజాన్ని వ్యక్తులను కించపరిచే విధంగా ప్రయత్నిస్తున్నారని దాన్ని అడ్డుకోవాల్సిందేనని అన్నారు సమాజంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా స్వాతంత్రంగా జీవించే విధంగా ఉండాలన్నారు..

# చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పేలుడు

- నలుగురు పోలీసులకు గాయాలు



**విజయవాడ, మార్చి31 (జనంసాక్షి) :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370